www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 29-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 151

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా.8.22 తదుపరి సప్తమి; నక్షత్రం: స్వాతి ఉ.11.39 తదుపరి విశాఖ; వర్జ్యం: సా.5.56-7.44; దుర్ముహూర్తం: ఉ.8.33-9.22, మ.12.40-1.30; అమృతఘడియలు: తె.4.43; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సమస్యలపై 2న చర్చిద్దాం.. రండి!

ఉద్యోగుల జేఏసీకి సర్కారు పిలుపు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమైన జేఏసీ నేతలు

చర్చల తర్వాత ప్రభుత్వ స్పందనను బట్టి తమ కార్యాచరణ ఉంటుందని వెల్లడి

14

వరద బీభత్సం









భారీ వర్షాలకు కామారెడ్డి అతలాకుతలం

వణికిన మెదక్.. 48 గంటల్లో 55 సెం.మీ. వాన

నిర్మల్, రాజన్న సిరిసిల్లల్లోనూ కుండపోత

రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది మృత్యువాత

జలదిగ్బంధంలో పలు గ్రామాలు, తండాలు

తెగిన రోడ్లు, కొట్టుకుపోయిన వంతెనలు

హైవే-44పై వరద.. కి.మీ. మేర ట్రాఫిక్ జామ్

వరదల పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాం

3 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం

విధుల్లో 2వేల మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది: డీజీపీ

బండి సంజయ్ అభ్యర్థన మేరకు 4 హెలికాప్టర్లను పంపిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టు.. ఆగకుండా ఒకటే వాన.. కుంభవృష్టి! కామారెడ్డి, మెదక్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాలో కుండపోతగా కురిసిన వానకు చెరువులు నిండి కట్టలు తెగాయి. వంతెనలు కూలాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. వాగులు పొంగాయి. ఊళ్లకు ఊళ్లే జలదిగ్బంధమయ్యాయి. రహదారులు ధ్వంసమై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లో గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. పదుల సంఖ్యలో గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయి అంధకారం అలముకుంది. చాలా జిల్లాల్లో మంగళవారం సాయంత్రం పట్టిన ముసురు.. విడవకుండా గురువారం సాయంత్రం దాకా అలాగే ఉంది!! ముఖ్యంగా.. కామారెడ్డి జిల్లాను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేశాయి. జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రెండు రోజుల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంతో పాటు ఏ గ్రామాన్ని, తండాను కదిలించినా వరద కన్నీటిగాథలే. జిల్లాలోని రాజంపేట మండలం ఆర్గోండ గ్రామంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు కేవలం 6 గంటల్లోనే 36.8 సెం.మీల వర్షపాతం నమోదుకావడం గమనార్హం. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జిల్లా యంత్రాంగం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి రెస్క్యూ ఆపరేషన్ ద్వారా వరదల్లో

మిగతా 12వ పేజీలో...



కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే

నష్టం లెక్కలు వేయండి

పంటలు, ఆస్తుల నష్టం ఫొటోలు, వీడియోలు భద్రపరచండి

ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించాలి

పాత ఇళ్లలో ఉంటున్న వారిని తరలించండి

వినాయక మండపాల వద్ద విద్యుత్తుతో జాగ్రత్త

వరదపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం

13

1) పోచారం ప్రాజెక్టు గేట్ల మీదుగా ప్రవహిస్తున్న వరద 2) కామారెడ్డి, రాజంపేట మండలాల పరిధిలో నీటమునిగిన పంటలు 3) జగిత్యాల జిల్లా వడ్డె లింగాపూర్‌లో గర్భిణిని ఎక్స్‌కవేటర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం 4) కామారెడ్డి పట్టణంలో వరద ఉధృతితో కొట్టుకుపోయిన ఓల్డ్ ఎన్‌హెచ్-7 రోడ్డు

పోచారం ప్రాజెక్టు పైనుంచి ఉప్పొంగిన ప్రవాహం

103 ఏళ్లనాటిదైనా తట్టుకొని నిలిచిన వైనం

గరిష్ఠ వరద సామర్థ్యం 72 వేల క్యూసెక్కులే

బుధవారం 1.82 లక్షల క్యూసెక్కుల రాక

కట్ట కొట్టుకుపోతుందేమోనని ప్రజల ఆందోళన

వరద తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న జనం

రాష్ట్రవ్యాప్తంగా 120 చెరువులకు గండ్లు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: పొంగులేటి

ప్రజలకు వైద్య సాయం అందించాలి: దామోదర

కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా వర్షాలు, వరదలు

13



75 ఏళ్లకు రిటైర్ కావాలని ఎవరికీ చెప్పలేదు

బీజేపీతో సంఘర్షణే తప్ప తగాదాల్లేవ్

సంఘ్ సలహాలిస్తుంది, ప్రభుత్వాన్ని నడపదు

రిజర్వేషన్లకు పూర్తి సమర్థన

చొరబాట్లు, బలవంతపు మతమార్పిళ్లు ఆపాలి

ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో మోహన్ భాగవత్

2

తెలంగాణకు కొత్త రైలు మార్గం..

'సికింద్రాబాద్-వాడి'కి కేంద్రం ఓకే

రూ.5 వేల కోట్లతో 3, 4 లైన్ల నిర్మాణం

రూ.12,328 కోట్లతో దేశంలో 4 రైల్వే ప్రాజెక్టులు

వీధి వ్యాపారులకు 2030 దాకా 'పీఎం స్వనిధి'

రుణ పరిమితులు రూ.5 వేల చొప్పున పెంపు

కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

ట్రంప్ సుంకాలను.. ఎలా ఎదుర్కొందాం?



తీవ్రంగా కసరత్తు జరుపుతున్న కేంద్రం

అమెరికాయేతర మార్కెట్లకు విస్తరణ

40 కీలక దేశాల గుర్తింపు.. భారతీయ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకు కార్యాచరణ

ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల కీలకపాత్ర

ఎగుమతిదారులను ఆదుకునేందుకు రూ.25 వేల కోట్లతో మిషన్

పత్తి దిగుమతులపై సుంకాల మినహాయింపు డిసెంబరు 31 వరకూ పొడిగింపు

స్టాక్‌మార్కెట్లపై సుంకాల ప్రభావం.. రెండు రోజుల్లో రూ.9.6 లక్షల కోట్ల నష్టం

పరిశ్రమల్ని ఆదుకోండి!.. మోదీకి స్టాలిన్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో.. ఇప్పటి వరకూ ఆ దేశానికి భారత్ నుంచి వెళ్తున్న దాదాపు 4,820 కోట్ల డాలర్ల (రూ.4,22,384 కోట్ల) విలువైన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. సుంకాల వల్ల అమెరికా మార్కెట్లలో భారతీయ సరుకుల ధరలు భారీగా పెరిగిపోవటంతో.. ఇతర దేశాల (సుంకం పోటు తక్కువగా ఉన్న దేశాల) సరుకులతో పోటీ పడలేని పరిస్థితి. మరి, ఇంత భారీ నష్టాన్ని భర్తీ చేసుకునేదెలా? ప్రస్తుతం కేంద్ర సర్కారు దీనిపైనే తీవ్రంగా కసరత్తు జరుపుతోంది. ఇందులో భాగంగా, ఇక మీదట అమెరికాయేతర

మిగతా 2వ పేజీలో...

మోదీ నడిపిస్తున్న యుద్ధం

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై శ్వేతసౌధం సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్య

2

అమెరికా విద్యార్థి వీసా గడువు నాలుగేళ్లే!

ఆటలంటే హైదరాబాద్ పేరే చెప్పుకోవాలి!

క్రీడా ప్రపంచం దృష్టి మనపైనే ఉండాలి

క్రీడా రంగం బడ్జెట్ 16 రెట్లు పెంచాం

ఇకపై ఆటల పోటీలు గ్రామ స్థాయి నుంచి అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయి దాకా..

వాటిలో ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్ల ఎంపిక

స్పోర్ట్స్ హబ్ బోర్డ్ భేటీలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రపంచమంతా హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అన్నిరకాల క్రీడలకు హైదరాబాద్ వేదికగా మారాలని ఆకాంక్షించారు. గురువారం 'తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు' మొదటి సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగు పర్చడం, కోచ్‌లు, ట్రైనర్లకు శిక్షణ, క్రీడా విధానంలో వివిధ

మిగతా 3వ పేజీలో...



ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే..

ఎన్డీయేకు 324 సీట్లు!

ఇండియా కూటమికి 208 మాత్రమే!

ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే

బిహార్‌లో ఎన్డీయేదే విజయం

టైమ్స్ నౌ- జేవీసీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు 324 సీట్లు వస్తాయని ఇండియా టుడే-సీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే అంచనా వేసింది. ఇందులో బీజేపీ 260 స్థానాలు సాధిస్తుందని పేర్కొంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంటే బీజేపీకి స్థానాలు పెరిగినా... ఇప్పటికీ ఆ పార్టీకి సొంతంగా ప్రభుత్వ ఏర్పాటుకు

మిగతా 2వ పేజీలో...

అమెరికా విద్యార్థి వీసా గడువు నాలుగేళ్లే!



» ట్రంప్ యంత్రాంగం నూతన ప్రతిపాదనలు
» అమెరికా ఉన్నత విద్యా వ్యవస్థకు దెబ్బ: నిపుణులు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే విదేశీ విద్యార్థులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమైంది. అంతర్జాతీయ విద్యార్థులతో పాటు ఎక్స్ఛేంజ్ విజిటర్లు, విదేశీ మీడియా ప్రతినిధుల వీసాలకు పరిమిత కాల గడువు విధించేందుకు బుధవారం నూతన నిబంధనలను ప్రతిపాదించింది. దీనిప్రకారం విద్యార్థి, ఎక్స్ఛేంజ్ వీసాలను నాలుగేళ్లకు పరిమితం చేస్తారు. విదేశీ మీడియా ప్రతినిధులకు ఇచ్చే ఐ-వీసాలను 240 రోజులకు జారీ చేస్తారు. జర్నలిస్టు వీసాపై ఉన్న చైనీయులకు 90 రోజుల పరిమితిని కఠినంగా అమలు చేయనున్నారు. ఈ గడువును మించి నివాసం ఉండాలనుకునేవారు అమెరికా పౌరసత్వం, ఇమిగ్రేషన్ సేవల (యూఎస్‌సీఐఎస్) విభాగానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిద్వారా వారి దరఖాస్తులను సమీక్షించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్)కు తగినంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. తాజాప్రతిపాదనలు అమలులోకి వస్తే 1978 నుంచి అమలులో ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానం స్థానంలో పరిమిత కాల నివాస అనుమతులతో కూడిన వీసా మంజూరు చేస్తారు. ప్రస్తుతం ఎఫ్-1, జే-1 వీసాదారులు తమ కోర్సు మొత్తం పూర్తయ్యే వరకూ అమెరికాలో నివసించే అవకాశం ఉంది. కొంతమంది ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తూ శాశ్వత విద్యార్థులుగా మారిపోతున్నారని, ఎప్పటికప్పుడు తమ నివాస అనుమతులను పొడిగించుకుంటున్నారని అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీసా గడువును పరిమితం చేయాలని డీహెచ్‌ఎస్ ఇటీవల ప్రతిపాదించింది. కొత్త ప్రతిపాదనలతో కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి తీసుకొస్తున్నామని, ఇది వీసా దుర్వినియోగానికి చెక్ పెడుతుందని డీహెచ్‌ఎస్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. కొత్త ప్రతిపాదనలపై 30 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. కాగా, ఈ ప్రతిపాదనలు అమెరికా ఉన్నత విద్యావ్యవస్థను దెబ్బతీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024లో దాదాపు 16లక్షల మంది ఎఫ్-వీసా విద్యార్థులతో పాటు 3,55,000మంది ఎక్స్ఛేంజీ విజిటర్లు, 13వేల మంది విదేశీమీడియా ప్రతినిధులు అమెరికాలో ఉన్నారు.

లోకం తీరు



సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్‌లు అరాధే, పంచోలీ

» పదోన్నతులపై కొలీజియం సిఫారసుకు కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ, ఆగస్టు 28: బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయి పంచోలికు సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి లభించింది. వీరి పదోన్నతులకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసును కేంద్రం ఆమోదించింది. ఇందుకు సంబంధించి కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘావల్.. ఎక్స్‌లో బుధవారం పోస్టు చేశారు.

పిల్లల ఆధార్ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయండి

» 5, 15 సంవత్సరాల వయస్సులో ఇది తప్పనిసరి
» లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు: ఉడాయ్ చీఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల ఆధార్ వేలి ముద్రలను అప్‌డేట్ చేయాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సంస్థ చీఫ్ భువనేశ్ కుమార్.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని ఆయన తన లేఖలో కోరారు. ఎదిగే పిల్లల బయోమెట్రిక్స్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. అందుకు అనుగుణంగా ఐదు నుంచి ఏడు సంవత్సరాల వయస్సులో, 15-17 సంవత్సరాల వయస్సులోనూ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయడం తప్పనిసరి(ఎంబీయూ). ఈ రెండు సందర్భాల్లోనూ ఈ సర్వీసు పూర్తి ఉచితం. ఆధార్ అప్‌డేట్ చేయకపోతే నీట్, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకు హాజరయ్యే, ప్రభుత్వ పథకాలను అందుకునే విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందని ఉడాయ్ చీఫ్ హెచ్చరించారు.

పుచ్చలపల్లి మేనల్లుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆత్మహత్య

ఖమ్మం క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వ్యవస్థాపక నేత, దివంగత పుచ్చలపల్లి సుందరయ్య మేనల్లుడు ఏపీలోని నెల్లూరుకు చెందిన దువ్వూరు చంద్రశేఖరరెడ్డి(77) బలవన్మరణానికి పాల్పడ్డారు. బుధవారం తెల్లవారుజామున 3:30గంటల సమయంలో ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఒంటరితనమే ఆయన ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. చంద్రశేఖర్‌రెడ్డి భార్య 25 ఏళ్ల క్రితం మరణించారు. వారి ఇద్దరు కుమార్తెలు అమెరికాలో స్థిరపడ్డారు. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఓ వృద్ధాశ్రమంలో చేరారు. అయితే, 15రోజుల క్రితం ఆశ్రమాన్ని ఖాళీ చేశారు. కాశీ పర్యటన ముగించుకుని నెల్లూరు వెళుతున్నానని తనకు మనుమడు వరసయ్యే వ్యక్తికి మంగళవారం తెలిపారు. మంగళవారం రాత్రి ఖమ్మం రైల్వేస్టేషన్‌లో దిగిన ఆయన బుధవారం తెల్లవారుజామున ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపంలో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.

పుట్టినరోజు వేడుక జరుగుతుండగా కుప్పకూలిన భవనం.. 17 మంది దుర్మరణం

పాల్ఘర్, ఆగస్టు 28: అది నాలుగు అంతస్తుల భవనం. మంగళవారం అర్ధరాత్రి దాటింది.. సమయం 12:05 గంటలు. నాలుగో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో గొప్ప సందడిగా ఉంది. తమ బిడ్డ ఉత్కర్ష (1) తొలి పుట్టినరోజు వేడుక కోసం దంపతులు ఓంకార్ జోవిల్ (25), ఆరోహీ ఓంకార్ (24) బంధువులు, మిత్రులను పిలుచుకున్నారు. గడియారం సరిగ్గా 12 గంటలు కొట్టగానే.. ఓంకార్, ఆరోహీ కలిసి పాప ఉత్కర్ష చేతులు పట్టుకొని, కేక్ కట్ చేయించారు. చుట్టూ చేరిన అతిథిగణం 'హేపీ బర్త్ డే డియర్ ఉత్కర్ష' అని చప్పట్లతో అభినందిస్తోంది. అయితే ఆ సమయంలో వారి కాళ్లకింద నేల కదిలిపోయింది.. కళ్లుమూసి తెరిచేలోగా ఘోరం జరిగింది! ఆ ఫ్లాట్ సహా.. భవనంలోని ఓ భాగం కుప్పకూలిపోయింది. తెల్లవారితే వినాయక చవితి పండుగ అనగా మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లా విరార్‌లోని నారంగిలో ఈ విషాద ఘటన జరిగింది. పాప ఉత్కర్ష, తల్లిదండ్రులు ఓంకార్, ఆరోహీ సహా మొత్తం 17 మంది శిథిలాల కింద చిక్కుకొని మృతిచెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. 15 మృతదేహాలను బుధవారం, మరో రెండు మృతదేహాలను గురువారం వెలికితీశారు. శిథిలాల కింద చిక్కుకొని 9మంది గాయపడ్డారు. వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. రమాబాయి అపార్ట్‌మెంట్ పేరుతో ఉన్న ఈ నాలుగు అంతస్తుల భవనాన్ని 2011లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారు. భవనంలో 50 ఫ్లాట్లు ఉన్నాయి. అందులో 12 ఫ్లాట్లు ఉన్న ఓ భాగం పూర్తిగా పక్కనున్న ఓ ఇంటిపై కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ ఇల్లు ఖాళీగా ఉండటంతో అక్కడ ఉండేవారికి ముప్పు తప్పింది. సమాచారం అందడంతో ఎన్డీఆర్ఎఫ్ వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలకు దిగింది. శిథిలాలు తొలగించే పని కొనసాగుతోంది. బిల్డర్ నిట్టల్ సానేపై కేసు నమోదు చేసిన పోలీసులు, అతడిని అరెస్టు చేశారు. ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

సికింద్రాబాద్-వాడి రైల్వే మార్గానికి ఓకే

» కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కొత్త రైల్వే ప్రాజెక్టును మంజూరు చేసింది. సికింద్రాబాద్ (సనత్‌నగర్)- వాడి మార్గంలో 173 కి.మీ. పొడవైన 3, 4వ లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చే రూ.12,328 కోట్ల విలువైన నాలుగు కొత్త రైల్వే ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సికింద్రాబాద్-వాడి మార్గం నిర్మాణానికి కేంద్రం రూ.5012 కోట్లు వెచ్చించనుంది. ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది. 'ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర నిధి (పీఎం స్వనిధి)' పథకం పునర్నిర్మాణం, పొడిగింపునకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7332 కోట్లతో చేపట్టిన ఈ పథకాన్ని మార్చి 31, 2030 వరకు పొడిగించేందుకు ఆమోదముద్ర వేసింది. పథకంలో భాగంగా తొలి విడతలో ఇచ్చే రుణ పరిమితిని రూ.10 వేల నుంచి 15 వేలకు పెంచారు. రెండో విడతలో ఇచ్చే రుణ పరిమితిని కూడా రూ.20 వేల నుంచి 25 వేలకు పెంచారు. మూడో విడత రుణపరిమితి రూ.50 వేలను మాత్రం మార్చలేదు. అలాగే చిల్లర, టోకు వ్యాపార లావాదేవీల్లో డిజిటల్ చెల్లింపులను ఎంచుకునే వీధి వ్యాపారులకు రూ.1600 ప్రోత్సాహక నగదు అందించనున్నట్లు వివరించింది. కాగా, 2030లో కామన్వెల్త్ క్రీడా పోటీలను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించేందుకు బిడ్ వేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశంలో చివరిసారిగా 2010లో కామన్వెల్త్ పోటీలను నిర్వహించారు.

ట్రంప్ సుంకాలను ఎలా ఎదుర్కొందాం?

(మొదటిపేజీ తరువాయి)



దేశాల మార్కెట్లపై ఎక్కువగా దృష్టి సారించాలని నిర్ణయించింది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో, రష్యా, బెల్జియం, టర్కీ, యూఏఈ, ఆస్ట్రేలియా తదితర 40 దేశాలున్నాయి. ఈ దేశాల్లో ఇతర సరుకులతోపాటు వస్త్ర పరిశ్రమ ఎగుమతులకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది (అమెరికా సుంకాలతో తీవ్రంగా నష్టపోతున్నది వస్త్ర పరిశ్రమనే). దీనిపై ఓ అధికారి మాట్లాడుతూ, 'ప్రతీ దేశంలోనూ లక్షిత వ్యూహంతో ముందుకెళ్లాలని అనుకుంటున్నాం. నాణ్యమైన, వినూత్నమైన ఉత్పత్తులను ఎగుమతి చేయటమేకాదు.. ఆయాదేశాలు ఆధారపడతగిన, విశ్వసించదగిన సరఫరాదారుగా పేరు తెచ్చుకునేలా కృషి చేస్తాం. ఈ కార్యాచరణలో ఆయాదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలతోపాటు 'ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు' కూడా కీలకపాత్ర పోషించనున్నాయి' అని వెల్లడించారు.

220 దేశాలకు ఎగుమతులు

భారత్ ప్రపంచవ్యాప్తంగా 220కిపైగా దేశాలకు ఎగుమతులు చేస్తోంది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలతో కూడిన 40 దేశాలు అత్యంత కీలకమైనవి. ఈ దేశాలు ఏటా 59,000 కోట్ల డాలర్ల (రూ.51,70,000 కోట్లు) విలువైన జౌళి ఉత్పత్తులు, వస్త్రాలను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇంతటి భారీ మార్కెట్లో మనదేశం వాటా 5-6% మాత్రమే. అంటే, ఈ దేశాల్లో మన మార్కెట్ వాటాను పెంచుకోవటానికి పుష్కలమైన అవకాశాలున్నాయి. దీని వల్లే ట్రంప్ సుంకాల నేపథ్యంలో.. వీటిపై కేంద్రం దృష్టి పెట్టింది. ఈ కార్యాచరణలో కీలకంగా భావిస్తున్న ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు.. ఆయా దేశాల్లో మార్కెట్ మ్యాపింగ్, అధిక డిమాండ్ ఉన్న ఉత్పత్తుల గుర్తింపు మీద నిశితమైన అధ్యయనం జరిపి మార్గదర్శకాలను వెలువరిస్తాయి. అంతర్జాతీయ ట్రేడ్‌ఫెయిర్లలో, ఎగ్జిబిషన్లలో, కొనుగోలు-అమ్మకందారు సమావేశాల్లో భారత్ బ్రాండ్‌ను బలంగా ముందుకు తీసుకెళ్తాయి. భారత ఎగుమతిదారులు అంతర్జాతీయ ప్రమాణాలను పాటించేలా చేయటం, ఆయాదేశాల మార్కెట్లలోకి వెళ్లటానికి అవసరమైన పత్రాలను సంపాదించుకోవటంలో దిశానిర్దేశం చేస్తాయి. మరోవైపు, భారతీయ ఎగుమతిదారులను రక్షించటానికి రూ.25 వేల కోట్లతో 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్'ను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ట్రంప్ సుంకాలతో వస్త్రాలు, ముత్యాలు, ఆభరణాలు, రొయ్యలు, లెదర్ పరిశ్రమలపై ముఖ్యంగా.. ఎక్కువ మంది కార్మికులు పని చేసే రంగాలపై తీవ్రంగా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో, ఆయా రంగాలకు చెందిన ఎగుమతిదారులతో ఈ వారంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ సమావేశం కానుంది. ప్రత్యామ్నాయాల అన్వేషణ, అమెరికాయేతర మార్కెట్లకు ప్రాధాన్యం, కొత్త మార్కెట్లలోకి వెళ్లటం తదితర అంశాలను సమగ్రంగా చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే, అమెరికా సుంకాలకు పోటీగా ఆ దేశంపై ప్రతీకార సుంకాలు విధించే యోచన ఏమీ లేదని అధికారవర్గాలు తెలిపాయి.

పరిశ్రమల్ని ఆదుకోండి: స్టాలిన్

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికా విధించిన సుంకాల ప్రభావం తమిళనాడులోని సముద్ర ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమపై తీవ్రంగా పడే సూచనలు కనిపిస్తున్నాయి. తూత్తుకుడిలోని సీఫుడ్స్ సంస్థల్లో 50%ఉత్పత్తి నిలిచిపోయింది. తిరుప్పూరులో 35 లక్షల బనియన్లు కర్మాగారాల్లో పేరుకుపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే సీఫుడ్స్‌లో 26.5% దాకా భారత్ నుంచే వెళుతుంది. తమిళనాడులో 25 దాకా సీఫుడ్స్ ఎగుమతి సంస్థలుండగా, వీటిల్లో 11 సంస్థలు తూత్తుకుడిలోనే నడుస్తున్నాయి. ఈ సంస్థల నుంచే అమెరికాకు చేపలు, రొయ్యలు, పీతలు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా సుంకాలదెబ్బతో ప్రస్తుతం 50% దాకా ఎగుమతి నిలిపేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలంటూ ప్రధాని మోదీని సీఎం స్టాలిన్ కోరారు. గత ఏడాది భారతదేశం నుండి రూ.60 వేల కోట్ల విలువైన సీఫుడ్స్ అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

స్టాక్‌మార్కెట్ల పతనం

అమెరికా 50% సుంకాల ప్రభావం తీవ్రంగానే ఉంటోంది. మంగళ, గురువారాల్లో స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా, మదుపరులు రూ.9.6 లక్షల కోట్ల మేర నష్టపోయినట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేశారు.

డిసెంబరు 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికా సుంకాలు అమల్లోకి వచ్చిన వేళ.. దేశీయ టెక్స్‌టైల్ పరిశ్రమకు ఊరట కల్పించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకూ పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును ఇవ్వనుంది. గతంలో సెప్టెంబరు నెలాఖరు వరకు ఇచ్చిన మినహాయింపు గడువును మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ప్రకటించింది. దేశీయ వస్త్ర పరిశ్రమ రంగానికి సరిపడినంత ముడి పత్తి అందుబాటులో ఉంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. దేశీయ రంగాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం ఎంతో ఉపకరిస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫౌండర్ అజయ్‌శ్రీవాత్సవ చెప్పారు.

అది మోదీ నడిపిస్తున్న యుద్ధం

» రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై శ్వేతసౌధం సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్య

న్యూయార్క్/వాషింగ్టన్, ఆగస్టు 28: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని శ్వేతసౌధం వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఆరోపించారు. ఆ యుద్ధాన్ని 'మోదీ నడిపిస్తున్న యుద్ధం'గా అభివర్ణించారు. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్ రష్యా నుంచి రాయితీపై చమురు కొంటోంది. దాన్ని భారత రిఫైనరీలు రష్యా రిఫైనరీల భాగస్వామ్యంతో ఇతర దేశాలకు అధిక ధరకు విక్రయిస్తున్నాయి. రష్యా అలా వచ్చిన డబ్బును ఉక్రెయిన్‌పై యుద్ధానికి, ఉక్రెయిన్ ప్రజలను చంపడానికి వాడుతోంద'ని నవారో ఆరోపించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనడం ఆపేస్తే.. మరుసటి రోజు నుంచే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను 25 శాతానికి తగ్గిస్తారని చెప్పారు. కాగా, భారత్‌పై ట్రంప్ సుంకాల బాదుడును పలువురు విపక్ష డెమోక్రాట్లు ఖండించారు.

చైనాలో మోదీ కీలక భేటీలు!

» 31న జిన్‌పింగ్
1న పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: జపాన్, చైనా దేశాల్లో పర్యటనకు ప్రధాని మోదీ గురువారం బయలుదేరి వెళ్లారు. తన పర్యటన జాతీయ ప్రయోజనాలకు విశేషంగా ఉపకరించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ నెల 31న చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, సెప్టెంబరు 1న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో వేర్వేరుగా భేటీ కానున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేయాలని తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇందుకోసం భారతీయ ఎగుమతులపై ఏకపక్షంగా సుంకాలను రెట్టింపు పెంచడంపైనే ప్రధానంగా చర్చించనున్నారు.

గవర్నర్లు జడ్జిలు కాదు!

» బిల్లులపై న్యాయ సమీక్ష వాళ్ల పని కాదు
» తమిళనాడు తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఆమోదించిన బిల్లు రాజ్యాంగ బద్ధమా, కేంద్ర ప్రభుత్వ చట్టానికి విరుద్ధమా? అని చూడాల్సిన బాధ్యత గవర్నర్‌కులేదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. గవర్నర్ రాజ్యాంగ ప్రతినిధి మాత్రమేనని, ఆయన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తికాదని స్పష్టం చేసింది. ఆ అధికారాలు న్యాయస్థానాలకు మాత్రమే పరిమితమని గుర్తు చేసింది. శాసనసభ పంపిన బిల్లును గవర్నర్ ఆపితే తిరిగి శాసనసభకు పంపాలని, నిర్ణయం తీసుకోకుండా తన దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. శాసనసభ ఆమోదించిన ద్రవ్య బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ నిలిపివేస్తే ఆయన సూపర్ చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని భావించవచ్చునని గురువారం సుప్రీంకోర్టు ముందు వాదించింది. రాజ్యాంగంలోని 143 అధికరణ కింద రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీం ముందు లేవనెత్తిన ప్రశ్నలపై రాజ్యాంగ ధర్మాసనం ముందు జరుగుతున్న విచారణలో భాగంగా తమిళనాడు తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ద్రవ్య బిల్లులను కూడా గవర్నర్ నిరాకరించవచ్చునని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున హరీష్ సాల్వే, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్యలకు సింఘ్వీ సమాధానమిచ్చారు. బిల్లులపై తుది నిర్ణయం ఎన్నికైన ప్రజా ప్రభుత్వానిదికాకుండా గవర్నర్‌దేనని రాజ్యాంగంలో ఎక్కడ పేర్కొన్నారో చూపాలని అడిగారు. తెలంగాణ, ఏపీ, తమిళనాడులో చాలాకాలం నిలిపివేసిన పలు బిల్లుల ఉదంతాలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ అధికారాలకు సంబంధించిన 207 అధికరణలో చెప్పిన అంశా లు ప్రైవేటు సభ్యుల మనీ బిల్లులకే వర్తిస్తుందని, వాటిని నివారించేందుకే ఈ అధికరణను చేర్చారని ఆయన తెలిపారు. ఇతర అన్ని రకాల బిల్లుల విషయంలో మంత్రివర్గ ఆమోదంమేరకే గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. గవర్నర్, రాష్ట్రపతి లాంఛనప్రాయ రాజ్యాంగ అధినేతలని, కొన్ని సందర్భాల్లో తప్ప ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం వారికి లేదన్నారు. 200 అధికరణ ప్రకారం.. గవర్నర్ తొలుత ఆమోదాన్ని నిలిపివేసినప్పుడు శాసనసభకు మాత్రమే తిరిగి పంపాలని తెలిపారు. శాశ్వతంగా ఏ బిల్లు నూ నిలిపివేసే అధికారం గవర్నర్‌కులేదన్నారు. విచారణ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ గవాయి వ్యాఖ్యానిస్తూ..సాధ్యమైనంత త్వరలో అంటేనే వేగంగా నిర్ణయం తీసుకోవాలనే రాజ్యాంగ లక్ష్యాన్ని అది స్పష్టీకరిస్తోందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఏర్పడిన వివాదం కేసులోనూ ఉన్నత న్యాయస్థానం ఈ విషయాన్ని స్పష్టీకరించిందని గుర్తు చేశారు. నిరవధికంగా బిల్లును ఆమోదించకుండా నిలిపివేసే హక్కు గవర్నర్‌కు లేదన్నారు.

ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగితే.. ఎన్డీయేకు 324 సీట్లు!

(మొదటిపేజీ తరువాయి)

కావలసిన బలం (272) దక్కదని తెలిపింది. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి 'ఇండియా'కు 208 సీట్లు మాత్రమే లభిస్తాయని పేర్కొంది. గత ఎన్నికల్లో మొత్తం 543 స్థానాలకు బీజేపీ కేవలం 240 స్థానాలే గెలుచుకుంది. ఇది సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 272 స్థానాల కంటే 32 తక్కువ. అయితే భాగస్వామ్య పక్షాలతో కలిపితే ఎన్డీయేకు 293 స్థానాలు వచ్చాయి. మరోవైపు, ఇండీ కూటమి అధికార ఎన్డీయేకు షాక్ ఇస్తూ 234 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ తర్వాత జరిగిన కీలకమైన హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఇండి కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. ఆ ఎన్నికల్లో విజయాలతో ఎన్డీయే పుంజుకున్నట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జూలై 1, ఆగస్టు 14 మధ్య నిర్వహించారు. అన్ని లోక్‌సభ స్థానాల్లోని 54,788 మంది అభిప్రాయాలను సేకరించారు.

బిహార్‌లో ఎన్డీయేనే..: టైమ్స్ నౌ సర్వే

త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం తథ్యమని టైమ్స్ నౌ-జేవీసీ సర్వే అంచనా వేసింది. మొత్తం 243 స్థానాలకు ఎన్డీయే 136 స్థానాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ 75స్థానాలకు పరిమితమవుతుందని తెలిపింది. 2020 ఎన్నికల్లో 74స్థానాలు సాధించిన బీజేపీ ఈసారి 81 గెలుచుకుంటుందని పేర్కొంది. సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీయూ 31స్థానాల్లోనే గెలుస్తుందని తెలిపింది. ఇది గత ఎన్నికల కంటే 12 తక్కువ. ఆర్జేడీ 52, కాంగ్రెస్ 10 స్థానాలకు పరిమితమవుతాయని సర్వే అంచనా వేసింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆర్జేడీకి 23, కాంగ్రెస్‌కు 9 సీట్లు తగ్గుతాయని పేర్కొంది.

నేను రిటైర్ కాను.. రిటైర్ కావాలని ఎవరికీ చెప్పలేదు

» బీజేపీతో సంఘర్షణే.. తగాదాల్లేవ్: ఆరెస్సెస్ చీఫ్ భాగవత్



న్యూఢిల్లీ, ఆగస్టు 28: రిటైర్మెంట్‌కు సంబంధించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల వయసులో తాను రిటైర్ అవుతానని కానీ లేదా ఇంకెవరినైనా రిటైర్ కావాలని కానీ తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. సంఘ్ కోరుకున్నంత కాలం పనిచేయాల్సిందేనని, అప్పజెప్పిన పని చేస్తూ ఉండాల్సిందేనన్నారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా న్యూఢిల్లీలో మీడియాతో గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జూలై 9న నాగ్‌పూర్‌లో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రిటైర్‌మెంట్‌కు సంబంధించి మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. 75ఏళ్ల వయసు వచ్చిన వారికి శాలువా కప్పుతున్నారంటే మీరు తప్పుకుని మరొకరికి అవకాశం ఇవ్వండని అర్థమని చెప్పారు. అయితే సంఘ్ సీనియర్ నేత మోరోపంత్ పింగ్లే గతంలో చేసిన వ్యాఖ్యలను తాను ఉదహరించానని భాగవత్ స్పష్టం చేశారు. నాడు ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోదీని ఉద్దేశించి చేసినవేనని మీడియాలో కథనాలు రావడంతో కలకలం రేగింది. ఈ నేపథ్యంలోనే భాగవత్ స్పష్టతనిచ్చినట్లు తెలుస్తోంది. కాగా బీజేపీతో సంఘర్షణ ఉండొచ్చని, తగాదాలు మాత్రం లేవని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. సంఘ్ సలహాలు మాత్రమే ఇస్తుందని, ప్రభుత్వాన్ని నడపదని ఆయన చెప్పారు. అక్రమ చొరబాట్లు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. బలవంతపు మతమార్పిళ్లు ఆగాలన్నారు. రిజర్వేషన్లకు సంఘ్ పూర్తి మద్దతునిస్తుందని, రిజర్వేషన్లు కొనసాగాలని చెప్పారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

» ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్

తిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు నడవాలని, దాంతో మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు అన్ని లక్ష్యాలను చేరుకోగలమని మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వరద బీభత్సం

జమ్మూకశ్మీర్‌లో 41 మంది మృతి.. చిక్కుకున్న వైష్ణోదేవి భక్తులు



పంజాబ్‌లోని కపుర్తల ప్రాంతం నుంచి వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: భారతావనిపై 'మేఘ విస్ఫోటం' జరిగిందా..? అన్నట్లు దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులు, జలాశయాలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో.. పరీవాహకాలు, లోతట్టు ప్రాంతాలు, రహదారులు నీటమునిగాయి. ఉత్తరాన కశ్మీర్ నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు.. పశ్చిమాన రాణ్ ఆఫ్ కచ్ నుంచి తూర్పున దీఫూపాస్ వరకు అంతటా భారీ వర్షాలు, వరద బీభత్సం కొనసాగుతుండగా.. రాబోయే రోజుల్లోనూ మోస్తరు నుంచి భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే భక్తులపై వర్షాలు, వరదలు తీవ్రంగా ప్రభావం చూపగా.. ఆ రాష్ట్రంలో 41 మరణాలు నమోదయ్యాయి. హిమాచల్‌లో మరణాల సంఖ్య 300 దాటిందని అధికారులు ప్రకటించారు. కులు నుంచి చండీగఢ్ వెళ్లే జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది.

జమ్మూకశ్మీర్‌లో..

జమ్మూకశ్మీర్‌లో వరద బీభత్సం దారుణంగా ఉంది. మంగళ, బుధవారాల్లో వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే మార్గం(హిమ్‌కోటి ట్రెకింగ్)లో కొండచరియలు విరిగిపడి, 34 మంది మృతిచెందారు. దీంతో.. వైష్ణోదేవి ఆలయ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. రైళ్ల రాకపోకలను నిలిపివేయడంతో వేల మంది ప్రయాణికులు స్టేషన్లలోనే పడిగాపులుకాచారు. రావి నది ఉధృతికి గురువారం రాత్రి పఠాన్‌కోట్‌లోని మాధోపూర్ హెడ్‌వర్క్ నాలుగు గేట్లు విరిగిపోయాయి. దీంతో పాక్ సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ పోస్టులను ఖాళీ చేస్తున్నారు. జవాన్లను వెనక్కి రప్పిస్తున్నారు.

ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు

కులు-చండీగఢ్ రహదారిలో మండీ వద్ద 12 చోట్ల.. మనాలీ వద్ద కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో.. ఆ రహదారిపై 50 కిలోమీటర్ల మేర ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించిపోయాయి. అటు బిహార్‌లోని పట్నాలో భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలమవ్వగా.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద గంగ, యమున నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో.. లక్షన్నర మందిని సహాయక శిబిరాలకు తరలించారు. వారాణసీలోని మణికర్ణికా ఘాట్ వద్ద మెట్లపై వరకు గంగానది ప్రవహిస్తోంది. దీంతో దహన సంస్కారాలను ఆ పక్కనే ఉన్న మండపాల పైకప్పులపై నిర్వహించారు. వరదలతో దేశంలోనే అతి పొడవైన జాతీయ రహదారి-44 చాలా చోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది.



హైదరాబాద్‌లో బీచ్!

» భారీ సరస్సు, ఇసుక తిన్నెలతో నిర్మాణం
» రూ.225 కోట్లతో కొత్వాల్‌గూడలో 35 ఎకరాల్లో ఏర్పాటు
» అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లోటింగ్ విల్లాలు, లగ్జరీ హోటళ్లు, వేవ్‌పూల్స్, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, ఫుడ్‌కోర్టులు
» ఈ ఏడాది చివర్లో పనులు ప్రారంభం..?

శంషాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరం లేని, భూపరివేష్టిత రాష్ట్రం మనది! బీచ్ కోసం ఆంధ్రప్రదేశ్‌కో, తమిళనాడుకో వెళ్లి ఆ ముచ్చట తీర్చుకోవాలి. అయితే ఈ దూరభారం, వ్యయప్రయాసలేవీ లేకుండా రాజధాని హైదరాబాద్‌లోనే అచ్చంగా 'సముద్ర తీరంలాంటి సముద్ర తీరం'లో విహరించే అవకాశం రానున్న రోజుల్లో పర్యాటక ప్రియులకు దక్కనుంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని కొత్వాల్‌గూడ పరిధిలో 35 ఎకరాల విస్తీర్ణంలో రూ.225 కోట్లు వెచ్చించి కాల్పానిక సముద్ర తీరాన్ని (ఆర్టిఫిషియల్ బీచ్) నిర్మించనున్నారు. దీని నిర్మాణం వచ్చే డిసెంబరులోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అక్కడ.. పిల్లలు, యువత కోసం స్పోర్ట్స్, సినిమాల రూపంలో వినోదాలు.. పెద్దలు సేదతీరేలా ప్రశాంత వాతావరణాన్నీ సిద్ధం చేయాలని నిర్ణయించారు. చుట్టూ పెద్ద సరస్సు, ఇసుక తెన్నెలతో అచ్చంగా బీచ్‌ను తలపించే వాతావరణానికి తోడు స్పోర్ట్స్ విల్లాలు, ఫ్లోటింగ్ విల్లాలు, లగ్జరీ హోటళ్లు, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, ఫుడ్‌కోర్టులు, వేవ్‌పూల్స్, థియేటర్లు, ఫౌంటేన్లు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు.

ఆటలంటే హైదరాబాద్ పేరే చెప్పుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు ఉప సంఘాల ఏర్పాటుకు తీర్మానాలు చేశారు. ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్.. ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. బోర్డులోని సభ్యులు సలహాలు, సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ, తెలంగాణలో ఐటీ సంస్కృతి తరహాలో క్రీడా సంస్కృతి రావాలని పిలుపునిచ్చారు. క్రీడారంగానికి బడ్జెట్ 16 రెట్లు పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున స్టేడియాలు, ఆధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నారు. వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడారంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. క్రీడారంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని వివరించారు.

ఆటల పోటీల విధానాన్ని మార్చుతాం

క్రీడా పోటీల విధానాన్ని మార్చనున్నట్లు సీఎం ప్రకటించారు. ఆటల పోటీలను గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తామని చెప్పారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి, అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి, దాని ప్రకారం రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. క్రీడా సామగ్రిపై పన్నుల తగ్గింపునకు కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశ పెడతామని తెలిపారు. కోచ్‌లకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. మూడేళ్లలో సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశం అనంతరం హైదరాబాద్‌లో అక్టోబరు 2 నుంచి ప్రారంభమయ్యే ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీఎల్‌వీ) పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డితో క్రీడా ప్రముఖులు

ఎవరేమన్నారు?

ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతట అవే వస్తాయి. హర్యానాలో కుస్తీతో పాటు ప్రతి క్రీడకు పల్లెల్లో చోటుంది. - కపిల్‌దేవ్, మాజీ క్రికెటర్

ప్రపంచంలో పలు ప్రముఖ కంపెనీల సీఈవోలు హైదరాబాద్ వారే. వారి సేవలను వినియోగించుకుందాం.
- సంజీవ్ గోయెంకా, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ చైర్మన్

ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్శిటీలో ప్రారంభించాలి. క్రీడా సామాగ్రిపై పన్నుల భారం భారీగా ఉంది.
- ఉపాసన కొణిదెల, స్పోర్ట్స్ హబ్ కో చైర్‌పర్సన్

ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండాలి. - అభినవ్ బింద్రా, షూటర్.

గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశల వారీగా ఉంటే మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుంది.
- పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

క్రీడల్లో రాణించే వారికి సామగ్రి కొరత రానివ్వొద్దు
- చింతా శశిధర్, విశ్వ సముద్ర ఫౌండేషన్

స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఐఐటీ ప్రొఫెసర్ల మాదిరి ఉండాలి. - బియ్యాల పాపారావు

గ్రామ స్థాయి క్రీడాకారులకు కూడా స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండాలి. ఇంగ్లండ్ తరహాలో లీగ్స్ ఉండాలి. - బైచుంగ్ భూటియా, ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్.

మన స్టేడియాలు సక్రమంగా నిర్వహిస్తూ వందశాతం వినియోగంలోకి తేవాలి. - రవికాంత్‌రెడ్డి

వందేళ్ల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

» మూసీ మాస్టర్‌ప్లాన్‌పై సీఎం రేవంత్ సమీక్ష
» సిగ్నల్ రహిత కూడళ్ల ఏర్పాటుపై అధికారులకు సూచన

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాబోయే వందేళ్ల అవసరాలకు అనుగుణంగా మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మూసీ అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి అధికారులు రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌పై బుధవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గేట్‌వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధితోపాటు కూడళ్ల ఏర్పాటు, రహదారుల అభివృద్ధిపై సీఎం పలు సూచనలు చేశారు. సిగ్నల్ రహిత కూడళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను పరిశీలించిన సీఎం.. మూసీ అభివృద్ధి పర్యావరణహితంగా ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మీరాలం చెరువు అభివృద్ధి, ఐకానిక్ వంతెన నిర్మాణం ప్రణాళికలను అధికారులు సీఎంకు వివరించారు. వీలైనంత త్వరగా డీపీఆర్ సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు.

4 నెలల్లో రాష్ట్ర రాబడి రూ.74,955 కోట్లు

» అన్ని రకాల వ్యయాలు రూ.68,823 కోట్లు
» 'కాగ్' జూలై నెల నివేదిక విడుదల

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లో రాష్ట్ర రాబడులు రూ.74,955 కోట్లకు చేరాయి. బడ్జెట్‌లో అంచనా వేసిన మొత్తం రాబడులు రూ.2,84,837 కోట్లలో ఇది 26.32 శాతం. గత ఏడాది ఇదే కాలానికి సమకూరిన 26.01 శాతం కంటే 0.31 శాతం మేర రాబడులు పెరిగాయి. ఈ మేరకు రాష్ట్ర ఆదాయ, వ్యయాలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గురువారం జూలై నివేదికను విడుదల చేసింది. ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.74,955 కోట్లు సమకూరినట్లు వెల్లడించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన అప్పుల ద్వారానే రూ.24,669 కోట్లు సమకూరాయి. అంటే ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.54,009 కోట్లలో జూలై నాటికి 45.68 శాతం (రూ.24,669 కోట్లు) మేర అప్పులను తీసేసుకుంది. ఇది కాకుండా పన్నుల రూపంలో రూ.48,145 కోట్లు, పన్నేతర రాబడి రూ.1,334 కోట్లు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల ద్వారా రూ.790 కోట్లు సమకూరాయి. వస్తు సేవల పన్ను(జీఎస్‌టీ) రూ.16,882 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.5,067 కోట్లు, అమ్మకం పన్ను కింద రూ.11,368 కోట్లు, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.6,347 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.5,899 కోట్లు వచ్చాయి. కాగా, జూలై నాటికి ప్రభుత్వం అన్ని పద్దుల కింద రూ.68,823 కోట్లు వ్యయం చేసింది. ఇందులో పథకాల కోసం రూ.24,176 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.9,355 కోట్లు, ఉద్యోగుల జీతభత్యాలకు రూ.15,961 కోట్లు, పెన్షన్ల కోసం రూ.6,149 కోట్లు, సబ్సిడీలకు రూ.7,191 కోట్లు ఖర్చు చేసింది.

సజ్జనార్ ముఖ్యమంత్రా లేక మంత్రా..?

» ఆర్టీసీ కార్మికుల పట్ల భయానక వాతావరణం సృష్టిస్తే ఊరుకోం: కూనంనేని

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ముఖ్యమంత్రా లేక మంత్రినా..? ఓ నియంతలా వ్యవహరిస్తున్నారు. ఆయన ఇకనైనా పద్ధతి మార్చుకోవాలి' అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సజ్జనార్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు కావచ్చు.. ఆర్టీసీ కార్మికుల పట్ల భయానక వాతావరణం సృష్టిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గురువారం మఖ్దూంభవన్‌లో మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కార్మికుల పట్ల సజ్జనార్ తీరు మార్చుకోకపోతే ఆయనకు వ్యతిరేకంగా ప్రత్యేక ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. 'ఈ నెల 30న సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ రవీంద్రభారతిలో ఉంటుంది. సెప్టెంబరు 11 నుంచి 17 వరకు తెలంగాణ వారోత్సవాలు నిర్వహిస్తాం. డిసెంబరు 26న కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నాం' అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని.. కాంగ్రెస్, సీపీఎంలతో పొత్తులేని చోట ఒంటరిగా బరిలో నిలుస్తామని స్పష్టం చేశారు.

హైడ్రాను అభినందించిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న హైడ్రాను హైకోర్టు గురువారం అభినందించింది. రహదారులపై రాకపోకలకు ఆటంకంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించే విషయంలో హైడ్రా అవసరముందంటూ జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్డు ఆక్రమణపై రాంనగర్ మణెమ్మ వీధి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ గతంలో జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసింది. జీహెచ్‌ఎంసీ ..హైడ్రా సహకారాన్ని కోరడంతో జమిస్తాన్‌పూర్ రాంనగర్ క్రాస్‌రోడ్ వద్ద రోడ్డును ఆక్రమించి నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని తొలగించింది. దీంతో రాంనగర్ ప్రధాన రహదారికి వెళ్లేందుకు ఆటంకం తొలగిపోయింది. దీనిపై ఆ వాణిజ్య సముదాయం నిర్మాణదారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగానే రహదారులపై ఆక్రమణలు తొలగించే విషయంలో హైడ్రా సేవలు అవసరమని ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రయోజనాలకు లోబడే ప్రైవేటు ప్రయోజనాలు ఉండాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

శ్రీశైలం ఉన్నది నీటి మళ్లింపునకు కాదు

1954 ఒప్పందానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌లో పెరిగిన ఆయకట్టు

» కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదన

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందే జల విద్యుదుత్పాదన కోసం అని, నీటి మళ్లింపునకు కాదని తెలంగాణ స్పష్టం చేసింది. 1976-77లో అంతర్రాష్ట్ర ఒప్పందం ప్రకారం లైన్డ్ కెనాల్ ద్వారా 1500క్యూసెక్కుల చొప్పున ఏటా 15 టీఎంసీలు తరలించాల్సి ఉండగా ఆ ఒప్పందాన్ని ఏపీ ఉల్లంఘించి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, శ్రీశైలం కుడి కాల్వ, బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీలు తెచ్చిందని ఆక్షేపించింది. 1980లో శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 11,150క్యూసెక్కులు తరలించే సామర్థ్యం ఉండగా, 2020 నాటికి 88వేల క్యూసెక్కులకు పెంచారని నివేదించింది. కృష్ణా జలాలను రాష్ట్రాల వారీగా పంచడానికి జరుగుతున్న విచారణలో భాగంగా గురువారం కృష్ణా ట్రిబ్యునల్-2(జస్టిస్ బ్రిజేశ్ కుమార్)లో తెలంగాణ వాదనలు వినిపించింది. ఏడాదిలో 15టీఎంసీలు తరలించడానికే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ కెనాల్ సిస్టం ఏర్పాటు చేయగా ప్రస్తుతం రోజుకు 15 టీఎంసీలు తరలించే సామర్థ్యానికి పెంచుకున్నారని నివేదించింది. చెన్నైకి తాగునీటి అవసరాల కోసం ఏడాదికి 15 టీఎంసీలు అందించడానికి శ్రీశైలం బ్యాక్‌వాటర్‌పై పనులు చేసి, ఏటా 200 టీఎంసీల జలాలను ఏపీ తరలిస్తున్నప్పటికీ ఏడాదికి 15 టీఎంసీల నీటిని కూడా చెన్నైకి తాగునీటి అవసరాల కోసం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనికోసం శ్రీశైలం లేదా ప్రకాశం బ్యారేజీ నుంచి పైప్‌లైన్ వేయాలని, దీనికి అయ్యే వ్యయంలో తమ వాటా భరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ పేర్కొంది. శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు నీటి తరలింపునకు బచావత్(కృష్ణా-1) బ్రిజేశ్ (కృష్ణా-2) ట్రిబ్యునల్‌లు అనుమతించలేదని నివేదించింది. ఈ సందర్భంగా శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా ఏపీ ఏ విధంగా అక్రమంగా నీటిని తరలిస్తుందో దానికి సంబంధించిన మ్యాప్‌ను ట్రిబ్యునల్‌కు సమర్పించింది. ఇక శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో టెలిమెట్రీలు పెట్టాలని తాము కోరినా కేంద్రం ఇప్పటిదాకా పెట్టలేదని గుర్తు చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూల్-11లోని సెక్షన్-10పై ఏపీ తప్పుగా అఫిడవిట్ దాఖలు చేసిందని, రాజ్యాంగంలోని 262ప్రకారం నీటి కేటాయింపు అధికారం ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉందని గుర్తుచేసింది. 1954లో హైదరాబాద్, ఆంధ్ర సంయుక్తంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం నాగార్జునసాగర్ కుడి కాలువ కింద 9.7 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందించాలని ఉండగా ఆ తర్వాత 11.74 లక్షల ఎకరాలకు పెంచారని తెలంగాణ గుర్తు చేసింది.

గీత దాటితే.. కమలం నేతలపై వేటే!

» 12 మంది నాయకులకు త్వరలో షోకాజ్ నోటీసులు!

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలకు తీసుకునేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం సిద్ధమయ్యింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారు ఏ స్థాయిలో ఉన్నా చర్యలు తప్పబోవని తేల్చి చెప్పబోతోంది. ముఖ్యంగా, వర్గాలుగా విడిపోయి బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన 12 మంది నాయకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వబోతున్నట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో ఉన్నప్పుడు ఆయన సమక్షంలోనే కొంతమంది కార్యకర్తలు, నాయకులు వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా, స్థానిక పార్టీలోని రెండు వర్గాల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. పెద్దపల్లి జిల్లాలో కూడా రెండు వర్గాలుగా విడిపోయిన స్థానిక నాయకులు పరస్పరం బహిరంగంగానే తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారని, అంతేకాకుండా పార్టీ సమావేశాల సందర్భంగా ఘర్షణలకు దిగారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఘటనలను పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా తీసుకుందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా బీజేపీ శాసనసభాపక్ష సమావేశం శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే జరుగనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొని శనివారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు.

కాంగ్రెస్, ఆర్జేడీ నేతల భాష ప్రతీ తల్లికీ అవమానకరం: బీజేపీ

ప్రధాని మోదీ దివంగత మాతృమూర్తిని కాంగ్రెస్, ఆర్జేడీ నాయకులు అసభ్య పదజాలంతో దూషించడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. ఆ రెండు పార్టీల నాయకులు వాడిన పదజాలం ప్రజాస్వామ్యానికి మచ్చ అని, వారు వాడిన భాష, ప్రతీ తల్లికి, కుమారుడికి అవమానకరమని ఎక్స్ వేదికగా స్పందించారు.

ఐసీడీఎస్‌లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపరంగా మంజూరైన(శాంక్షన్డ్) ఐసీడీఎస్ ఉద్యోగాలు ఖాళీ ఉండగా ఆ స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగులను నియమించుకొని, వారిని రెగ్యులర్ చేయకపోవడం తగదని హైకోర్టు అభిప్రాయపడింది. దశాబ్దాలపాటు వారితో పనిచేయించుకుని మళ్లీ కొత్తగా జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం అదే ఉద్యోగాలకు పోటీపడాలని చెప్పడం చెల్లదని స్పష్టం చేసింది. 265 ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గ్రేడ్-2 పోస్టులకు 2013లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. అప్పటికే కాంట్రాక్టు పద్ధతిలో అదే ఉద్యోగాలు చేస్తున్న వారికి 15శాతం వెయిటేజీ ఇస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొంది. 2013 నాటికే ఆరు నుంచి పదిహేనేళ్లపాటు సర్వీసు చేసిన తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించకుండా అవే పోస్టులను రెగ్యులర్ నోటిఫికేషన్ ద్వారా భర్తీచేయడం చెల్లదని అంగన్వాడీ టీచర్ మీరాబాయి సహా దాదాపు 200 మంది ఐసీడీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులు 2013లోనే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఆర్టికల్ 226 కింద దాఖలుపడ్డ అధికారాల ద్వారా పిటిషనర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని ఆదేశాలు జారీచేస్తున్నట్లు పేర్కొంది. కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైన నాటి నుంచి సర్వీసు లెక్కగట్టి పింఛను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని స్పష్టంచేసింది. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించగా మిగిలిన పోస్టులను భర్తీచేసుకోవచ్చని తెలిపింది.

జగన్మోహన్‌రావుకు బెయిల్

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అవినీతి, నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ తదితర అభియోగాలపై సీఐడీ అరెస్ట్ చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అరెస్ట్ చేసి 45 రోజులు అవుతున్నా ఇంకా దర్యాప్తు కొనసాగుతుండటంతో బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది.

33 రోజులుగా మృత్యువుతో పోరాడి..
ఏపీ రాష్ట్ర ఏఎస్పీ మృతి

» జూలై 26న చౌటుప్పల్‌లో రోడ్డు ప్రమాదం

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. 33 రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) కేక దుర్గా మల్లేశ్వర రాంప్రసాద్ (58) కన్నుమూశారు. చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని రాజమండ్రికి చెందిన దుర్గా మల్లేశ్వర రాంప్రసాద్ అమరావతిలో ఏపీ సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ విభాగంలో ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా జూలై 26న దుర్గా మల్లేశ్వర రాంప్రసాద్, డీఎస్పీలు మేక చక్రధర్‌రావు, జెల్ల శాంతారావుతో కలిసి స్కార్పియోలో అమరావతి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. వీరి వాహనం చౌటుప్పల్ మండలం కైతాపురం వద్ద డివైడర్‌ను ఢీకొని, పల్టీ కొట్టింది. ఈ ఘటనలో చక్రధర్‌రావు, శాంతారావు మృతి చెందారు. దుర్గా మల్లేశ్వర రాంప్రసాద్, డ్రైవర్ రెడ్డిచర్ల నర్సింగ్ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి అక్కడ చికిత్స పొందుతున్న ఏఎస్పీ బుధవారం (27న) ఈ నెల 27న మృతి చెందారు.

మాజీ సర్పంచుల వినూత్న నిరసన

» పెండింగ్ బిల్లులపై ఖైరతాబాద్ గణేష్‌కు వినతిపత్రం

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులు చెల్లించాలంటూ ఖైరతాబాద్ మహా గణనాథుడికి సర్పంచుల సంఘం జేఏసీ వినతి పత్రం అందించింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో బడా గణేశునికి పూజలు నిర్వహించిన అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తమ పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని మాజీ సర్పంచులు హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ములుగు జిల్లాకు మూడోస్థానం

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో మూడో స్థానానికి చేరుకుందని కలెక్టర్‌దివాకర తెలిపారు. మొదటి, రెండవ విడతల్లో 42 శాతం గ్రౌండింగ్ పూర్తి చేసుకొని మూడోస్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశంసాపత్రం, ల్యాప్‌టాప్‌ను హౌసింగ్ పీడీ సూర్యనారాయణకు గురువారం అందజేశారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి జిల్లాను మొదటిస్థానంలో నిలబెట్టేందుకు ప్రజాప్రతినిధులు, మండల స్పెషలాఫీసర్లు, హౌసింగ్ అధికారులు, మునిసిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్-అమెరికా సంబంధాలు ఇలా ఉప్పూనిప్పూలాగా తయారవుతాయని అర్నెల్లక్రితం కూడా ఎవరూ ఊహించలేదు. మలివిడత ఆగమనంలో ట్రంప్ ఎలా వ్యవహరిస్తారన్న అనుమానాలు లేకపోలేదు కానీ, మోదీ–ట్రంప్ మధ్య వ్యవహారం మరీ ఇంత చెడుతుందని అనుకోలేదు. తొలివిడతలో మాదిరిగానే ట్రంప్ అండదండలు బేషరతుగా ఉంటాయన్న నమ్మకంతో పాక్‌మీదకు కాలుదువ్వడం సుంకాల సమరాన్ని మరింతరాజేసిందని మోదీ వ్యతిరేకశక్తుల వాదన. యుద్ధాన్ని నేనే ఆపానని ముప్పైసార్లు ట్రంప్ చెప్పుకున్నా, పాకిస్థాన్ మాదిరిగా ప్రత్యక్షంగా సాగిలబడకున్నా, పరోక్షంగానైనా తలూపివుంటే ఆ సమరవీరుడు శాంతించి ఉండేవాడని విశ్లేషకుల నమ్మకం. భారతప్రభుత్వం ఏ మాత్రం ప్రతిస్పందించకుండా కొన్నాళ్ళు, ఎవరి ఒత్తిళ్ళూ ఫోన్లూ లేవంటూ మరికొన్నాళ్ళు, అమెరికా ఉపాధ్యక్షుడు ఫోన్ చేస్తే గట్టిగా జవాబు ఇచ్చామంటూ దేశీయంగా ఆ తరువాత ఇచ్చిన వివరణలూ కలగలసి ట్రంప్‌కు ఆరని ఆగ్రహం కలిగించాయని వారి వాదన. మోదీ మాజీ మిత్రుడు ఆఖరునిముషంలో దిగివచ్చి, అదనపు పాతికశాతం సుంకాల విషయంలో సడలింపులు ఇస్తాడనుకున్నవారి ఆశ చివరకు నిరాశే అయింది.

ఆగస్టు 25న రావాల్సిన అమెరికా వాణిజ్య చర్చల బృందం తన పర్యటన రద్దుచేసుకోవడం ప్రతిష్టంభన తీవ్రంగా ఉందనడానికి సంకేతం. ఉక్రెయిన్ యుద్ధం ఆగాలంటే, రష్యానుంచి చమురుకొని అగ్నికీలలను రాజేస్తున్న భారత్‌ను శిక్షించాలన్న వాదనకు అనుగుణంగానే అమెరికా పాలకులూ, అధికారుల వ్యాఖ్యలున్నాయి. చవకగా రష్యన్ క్రూడ్ కొని, శుద్ధిచేసి, ఎగుమతి చేస్తూ భారతదేశంలోని కొన్ని కులీన కుటుంబాలు విపరీతంగా బాగుపడ్డాయని, భారత్ వందలకోట్లు లబ్ధిపొందిందని అమెరికా విమర్శిస్తున్నది. అమెరికా అధ్యక్షుడి వాణిజ్య సలహాదారు ఇప్పుడు ఏకంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ యుద్ధంగా అభివర్ణించేంతవరకూ పోయారు.

సుంకాల సమరం

ఎవరి బరిలో వారున్నారు. గీతలు చెరగనిదే, రాజీకి రానిదే, చేయి కలవనిదే సుంకాల యుద్ధం ఆగదు. ఎవరూ రాజీపడే సూచనలు కనిపించడం లేదు. రష్యా క్రూడ్ కొనుగోళ్ళు మరింతగా సాగుతూ అక్టోబర్ ఆర్డర్లు కూడా వెళ్ళాయి. మరో ఐదేళ్ళలో ఆ దేశంతో రెట్టింపు వాణిజ్యం చేయాలని కూడా భారత్ నిర్ణయించుకుంది. రష్యాతో అనాదిగా ఉన్న స్నేహం పునాదిగా అది మనకు ఈ కష్టకాలంలో అండగా నిలుస్తున్నది. నిన్నటిదాకా శత్రువులాగా వ్యవహరించిన చైనా సైతం ఈ సంక్షోభంలో మనకు ఊహకందనంత వేగంగా సన్నిహితమైంది. ఈ రెండుదేశాలతో జరుగుతున్న చర్చలు, సాగుతున్న రాకపోకలు, అత్యున్నతస్థాయి భేటీలు ఎంతో భరోసానిస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ ధైర్యవచనాలు పలుకుతున్నారు. అమెరికా నుంచి ఎంత ఒత్తిడివచ్చినా తగ్గేది లేదనీ, లొంగేది లేదనీ, మరింత బలోపేతమవుతామని, రైతులు, చిరువ్యాపారులకు నష్టం రానివ్వబోమని మోదీ హామీ ఇస్తున్నారు. ఆయన నోటివెంట మళ్ళీ స్వదేశీ, ఆత్మనిర్భరత ఇత్యాదిమాటలు వింటున్నాం. ఎగుమతులకోసం కొత్త ద్వారాలు తెరుచుకుంటాయనీ, అమెరికా స్థానంలో మనలను ఎవరెవరో ఆదుకుంటారని హామీలు వింటున్నప్పటికీ, ట్రంప్ సుంకాల ప్రభావం లక్షలాదిమందికి ఉపాధికల్పిస్తున్న కీలకరంగాలమీద కనిపించడం ఆరంభమైంది.

భారత్ కంటే భారీగా రష్యన్ క్రూడ్ కొంటున్న చైనాను వదిలేసి, మనమీద ట్రంప్ విరుచుకుపడటం వెనుక చమురు ఒక్కటే కాక అనేక కారణాలు ఉండవచ్చు. పాతికశాతం చమురుసుంకం అమలులోకి వస్తున్నతరుణంలోనే, ట్రంప్ మరోమారు భారత్-పాక్ యుద్ధం గురించి ప్రస్తావించి, తాను ఇచ్చిన గడువుకంటే బాగాముందే ఐదు గంటల్లోనే యుద్ధం ఆగిపోయిందంటూ ఓ వ్యాఖ్యచేశారు. ఆయన నోబెల్‌శాంతి ఆకాంక్షను పరోక్షంగానైనా బలపరచడంతోపాటు, వాణిజ్య ఒప్పందానికి కూడా మార్గం సుగమం చేసివుంటే ఇంత వీరంగం ఉండేది కాదేమో. ఉభయదేశాలకూ పరస్పరప్రయోజనకారిగా ఉన్న వాణిజ్యాన్ని ట్రంప్ తన దుందుడుకుతనంతో ప్రమాదంలోకి నెట్టేశారు. ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మన 'మిగా' కలసి 'మెగా' అవుతుందని మోదీ కూడా ఒక దశలో ఆశపడ్డారు. మన సంకల్పబలం మెచ్చదగిందే కానీ, ట్రంప్ రక్షణాత్మక చర్యలు ఇంకెన్ని రంగాలకు విస్తరిస్తాయనే భయం తప్పడం లేదు.

డబ్బు ఆడిస్తున్న ఇండో–పాక్ క్రికెట్!

'రక్తమూ, నీరూ కలిసి ప్రవహించవు' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. పహల్గాం ఉగ్ర దాడి వెన్వెంటనే ఆరు దశాబ్దాల సింధు నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ పాకిస్థాన్‌కు చేసిన హెచ్చరిక అది. రక్తం నీటితో కలిసి ప్రవహించక పోవచ్చుగానీ అది తప్పకుండా క్రికెట్ క్రీడతో కలిసి కచ్చితంగా ప్రవహిస్తుంది. మరో పక్షం రోజుల్లో ఆసియా కప్ క్రికెట్ ప్రారంభమవనున్నది. క్రికెట్ అభిమానులు అందరూ మరీ ముఖ్యంగా భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఈ మ్యాచ్‌లకు మోదీ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌లు ద్వైపాక్షిక సంబంధాలు, బహుళపాక్షిక ఈవెంట్స్ మధ్య ఒక విలక్షణ వ్యత్యాసాన్ని కల్పిస్తాయని ప్రధానమంత్రి అన్నారు. అంతేకాకుండా అవి అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల ఆతిథేయిగా భారత్‌ను ఎక్కువగా ఇష్టపడేట్టు కూడా చేస్తాయని ఆయన అన్నారు.

మోదీ ప్రభుత్వం సూత్రబద్ధంగా 2012 నుంచి అనుసరిస్తున్న అలిఖిత మార్గదర్శక సూత్రాలకే అంటిపెట్టుకుని ఉన్నది: ఆనాటి నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లు అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో ఆడుతున్నవి మాత్రమే. భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రీడా సంబంధాలు సుదృఢమవ్వాలని సుదీర్ఘకాలంగా ఆకాంక్షిస్తున్న క్రికెట్ అభిమానిగా ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్ పట్ల ప్రభుత్వ వైఖరిని ఎటువంటి ఆక్షేపణ లేకుండా స్వాగతిస్తున్నాను. ఈ విశాల ఉపఖండాన్ని క్రికెట్ ఏకం చేస్తున్నది. భిన్న వర్గాల ప్రజల మధ్య స్నేహబంధాలను నిర్మిస్తోంది. ప్రజల మధ్య స్నేహసేతువులను నిర్మించేవి, నిర్మించగలిగేవి ఆటలే కదూ? క్రికెట్ అభిమానిగా నా మధుర జ్ఞాపకాలలో ముఖ్యమైనవి భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లే. కోట్లా స్టేడియంలో అనిల్ కుంబ్లే పది వికెట్లు తీసుకోవడం, 2003 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో సచిన్ టెండూల్కర్ అనితర సాధ్యమైన బ్యాటింగ్ నుంచి షార్జాలో జావేద్ మియాందాద్ చివరి బంతి ఆరు పరుగులు దాకా, ఇండో-పాక్ క్రికెట్ వీక్షకులలో అంతిమ భావోద్వేగ ఆశా నిరాశలను ప్రస్ఫుటీకరిస్తుంది. ఆ ఉద్విగ్నతలలో కలహశీల గత, వర్తమాన చరిత్రలు బంధితమవుతాయి. ఒక ఇమ్రాన్ ఖాన్, ఒక సునీల్ గవాస్కర్ మధ్య, ఒక షోయబ్ అఖ్తర్, వీరేంద్ర సెహ్వాగ్ మధ్య పోటాపోటీ ఆట క్రికెట్ సౌందర్యాన్ని కళ్లకు గట్టిస్తుంది. ఆ ప్రామాణిక క్రీడా నైపుణ్య ప్రభావం ఆటస్థలం ఆవల కూడా అమితంగా ఉంటుంది.

అయితే ఇప్పుడు ఆసియా కప్ క్రికెట్ రేకెత్తిస్తున్న భావోద్వేగాలు భిన్నమైనవి. కేవలం రెండు నెలల క్రితమే సంభావ్య అణుయుద్ధం అంచుల నుంచి వెనక్కి వెళ్లిన రెండు దేశాల క్రికెట్ టీమ్‌ల మధ్య జరగనున్న మ్యాచ్ ఇది. పహల్గాంలో సంభవించింది మాటల్లో చెప్పలేని రాక్షస చర్య. ఆసేతు హిమాచలం సకల భారతీయులను కలవరపెట్టిన దురాగతమది. అయినప్పటికీ పాకిస్థాన్ సైనిక రాజ్యం ఎలాంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాము స్వయంగా ప్రోత్సహించిన ఉగ్రవాదం సృష్టించిన మహా బీభత్సానికి ఆ సైనిక రాజ్యం ఎలాంటి బాధ్యత తీసుకోవడానికి సుముఖత చూపలేదు. సామాన్య భారత పౌరులపై జరిగిన ఆ దాడిని 'తప్పుడు జెండా చర్య' (ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్ – నిజమైన బాధ్యులను దాచిపెట్టి మరొక పార్టీ లేదా సంస్థపై నిందమోపే ఉద్దేశంతో నిర్వహించే రహస్య చర్య)గా అభివర్ణించేందుకు ఒక మొరటు ప్రయత్నం జరిగింది. ఉగ్రవాద సంస్థ లష్కర్ ప్రేరిత 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' క్రూరత్వాన్ని యథావిధిగా కప్పిపుచ్చారు. పాకిస్థాన్ ప్రాయోజిత ఉగ్రవాదంపై భారత్ న్యాయబద్ధమైన ఆందోళనలను కనీస మాత్రంగానైనా అంగీకరించేందుకు కూడా తిరస్కరించడం జరిగింది. పహల్గాం ఘటనకు కొన్ని వారాల ముందు ద్విజాతి సిద్ధాంతాన్ని సంపూర్ణంగా సమర్థించిన పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ భారత్ పట్ల విషం చిమ్మడాన్ని కొనసాగిస్తూ ఉండగానే ఆయనకు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించారు.



భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ ఇంకెంత మాత్రం క్రీడా మర్యాదలకు నిబద్ధమవడం లేదు. ధనలాలసతో నడుస్తున్న అపార సంపద్వంత క్రీడా సంఘాల అనైతిక ప్రపంచంలో నిజంగా ముఖ్యమైన ఏకైక విషయం స్పాన్సర్ షిప్ మనీ మాత్రమే. రక్తమూ, నీరూ సహ జీవనం చేయక పోవచ్చుగానీ డబ్బు (ఏ రంగులో ఉన్నది అయితేనేం)కు హద్దులు లేవు. అవును, దానికి 'వాఘా–అట్టారి' లాంటి సరిహద్దులు తెలియనే తెలియవు.

ద్రోహ బుద్ధితో వ్యవహరించే పాక్ సైనిక–రాజ్యం కుట్రలు, కుతంత్రాలకు అంతర్జాతీయ క్రికెటర్లు ఎలా స్పందించాలి? 'వెయ్యి గాయాల'తో భారత్ రక్తమోడేలా చేసేందుకు ప్రయత్నిస్తున్న రాజకీయ వ్యవస్థ అనాగరికత నుంచి స్ఫూర్తిదాయక క్రీడ క్రికెట్ విలక్షణత, స్వచ్ఛతను సంరక్షించడం సాధ్యమవుతుందా? సూత్రప్రాయంగా సాధ్యమే, వాస్తవంగా అయితే కానేకాదు. పహల్గాం దాడి తరువాత భారత ప్రజలకు సంఘీభావం, సహానుభూతి తెలుపుతూ పాకిస్థాన్ క్రికెట్ సమాజం నుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. చేయకపోగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఆ ఉగ్రవాద దాడికి భారత సైన్యానిదే బాధ్యత అని ఆరోపించారు. ఇటువంటి నిందారోపణ చేసింది ఆయన ఒక్కరే కాదు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చీఫ్ షాబాద్ షరీఫ్, ప్రభుత్వంలో మంత్రి కూడా అయిన మోహిసిన్ నఖ్వి ఏమన్నారో చూడండి: 'పాకిస్థాన్ అణ్వాయుధ రాజ్యం. మాతో క్రికెట్ ఆడేందుకు తిరస్కరించే ధైర్యం భారత్‌కు లేదు. అలా తిరస్కరిస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయో వారికి తెలుసు'.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

న్యూఢిల్లీ పట్ల పాకిస్థాన్ పాలనా వ్యవస్థలో ఎంత విరోధ భావం ఉన్నదో పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చీఫ్ విద్వేష ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. సరే, మన దేశంలోనూ పాకిస్థాన్ పట్ల ఒంటికాలిపై లేచి ఆగ్రహోదగ్రులయ్యేవారు చాలా మంది ఉన్నారు. పాకిస్థాన్‌ను శాశ్వతంగా నిర్మూలించాలని వారు తరచు యుద్ధోన్మాద ప్రేలాపనలు పేలుతుంటారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వాఘాకు ఆవల, ఈవల మీడియా నిష్పాక్షికంగా వ్యవహరించ లేదు. భారతీయ మీడియా అయితే కొంచెం ఎక్కువ కలహశీలంగా వ్యవహరించింది కూడా. సంస్థాగతమైన ప్రవర్తనా నియమావళి పూర్తిగా కూలిపోయింది. న్యూస్ యాంకర్ల ప్రదర్శనాత్మక జాతీయవాదం ఇప్పుడు న్యూస్ టీవీ వ్యాకరణంలో అంతర్భాగమైపోయింది.

ఇటువంటి పరిస్థితులలో ఇండో-పాక్ క్రికెట్ మ్యాచ్ ఇరు దేశాల ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందా? స్నేహాన్ని కుసుమింప చేస్తుందా? అలా జరిగేందుకు ఆస్కారం లేదు. రాజకీయ, మీడియా వర్గాల సంకుచిత వైఖరులు అటువంటి శుభస్కర పరిస్థితులను అనుమతించవు. 2004లో నేను పాకిస్థాన్‌లో పర్యటించాను. ఒక టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను భారత్ ప్రప్రథమంగా ఓడించిన సందర్భమది. అయినా భారతీయ క్రికెటర్ల పట్ల పాకిస్థానీయులు ఎనలేని సుహృద్భావాన్ని చూపారు. అపూర్వ గౌరవ మర్యాదలు చేశారు. ప్రజల స్థాయిలో వర్ధిల్లే సంబంధాలు ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో పాకిస్థానీయుల నడవడి స్పష్టం చేసింది. భారత్–పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు మెరుగుపడతాయనే ఆశాభావం మిణుకుమన్నది. లాహోర్‌లో ఒక సాయంత్రం నన్ను క్రికెట్ అభిమానులు చుట్టుముట్టారు. 'బాలాజీ ధీరే చలో' అని గానం చేశారు. అది భారతీయ ఫాస్ట్ బౌలర్ లక్ష్మీపతి బాలాజీ గురించిన ప్రస్తావన. అనుక్షణం మందహాసం చేస్తుండే బాలాజీ మోము పాకిస్థానీయుల హృదయాలను గెలుచుకున్నది. అలాగే 1999లో చెన్నైలో ఇండో-పాక్ మ్యాచ్‌లో కొద్ది తేడాతో భారత్ ఓడిపోయింది. అయినప్పటికీ స్టేడియంలో ఉన్న భారతీయ క్రికెట్ అభిమానులు పాకిస్థానీ క్రీడాకారులకు జేజేలు పలికారు. వారిని మనసారా అభినందించారు. ఒక అవిటి బాలుడు పాకిస్థాన్ క్రికెటర్ ఒకరి ఆట తీరును అభినయించి చూపడం అందరినీ ఆకట్టుకున్నది. ఆ అవిస్మరణీయ క్షణాలలో కూడా ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలు తప్పక నెలకొంటాయనే ఆశాభావం జనించింది. అయితే అదొక తప్పుడు ప్రభాతమని రుజువయింది. ఎంత విచారకరం! నిజం చెప్పాలంటే భారత్-పాకిస్థాన్ సంబంధాలు ఏమైనా కావచ్చు గానీ సాధారణమైనవి అని చెప్పడానికి వీలు లేదు.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ ఇంకెంత మాత్రం, ఏ జాతీయ జట్టునూ బాయ్‌కాట్ చేయడాన్ని తీవ్రంగా నిరసించే క్రీడా మర్యాదలకు నిబద్ధమవడం లేదు. ధనలాలసతో నడుస్తున్న అపార సంపద్వంత క్రీడా సంఘాల అనైతిక ప్రపంచంలో నిజంగా ముఖ్యమైన ఏకైక విషయం స్పాన్సర్‌షిప్ మనీ మాత్రమే సుమా! ఈ ప్రాయోజిత ధన శక్తి అంతకంతకూ ఇతోధికంగా పెరుగుతోంది. క్రికెట్ జగత్తుకు సంబంధించిన చాలా సరళ సత్యమిది. పక్షం రోజుల పాటు జరిగే ఆసియా కప్ క్రికెట్‌లో మరే ఇతర మ్యాచ్‌ల కంటే భారత్-పాకిస్థాన్ మ్యాచ్ మాత్రమే సంఖ్యానేక క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటుంది. వాణిజ్య ప్రకటనల ద్వారా మిగతా మ్యాచ్‌లకు సమకూరే మొత్తం ఆదాయం కంటే ఈ ఒక్క మ్యాచ్‌కు లభించే సదరు ఆదాయమే అధికంగా ఉంటుంది. క్రికెట్ వాణిజ్యమే ఇండో-పాక్ క్రికెట్‌ను ప్రోత్సహిస్తోంది. ఆ లాభాల పంటే దానికి ప్రధాన ఆసరా. దేశ విభజనతో విడిపోయిన పేద సాధారణ భారతీయులు, పాకిస్థానీయులు, పహల్గాం ఉగ్ర ఘాతుకం అనంతరం, పరస్పర కుటుంబాలను సందర్శించేందుకు వీసాలు పొందలేక పోతున్నారు. అయితే ఇరు దేశాల క్రికెట్ బోర్డ్‌ల వీవీఐపీ కులీనులు మ్యాచ్‌లు జరిగే స్టేడియంలలో చాలా సంతోషంగా ఎయిర్ కండిషన్డ్ బాక్స్‌లలో రాసుకు పూసుకు కూర్చొని ఆటను వీక్షిస్తారు. ఇది తథ్యం. రక్తమూ నీరూ సహజీవనం చేయక పోవచ్చుగానీ డబ్బు (ఏ రంగులో ఉన్నది అయితేనేం)కు హద్దులు లేవు. అవును, దానికి 'వాఘా–అట్టారి' లాంటి సరిహద్దులు తెలియనే తెలియవు. మైదాన్‌లో 'యుద్ధం' ప్రారంభం కానివ్వండి!

తాజా కలం : ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ అభిమానుల వాట్సాప్ గ్రూప్‌లో నేనూ భాగంగా ఉన్నాను. నిజాయితీగా చెబుతున్నాను: వాఘా సరిహద్దుకు ఆవల నుంచి రాజకీయాల రొద లేకుండా క్రికెట్ అనురక్తులైన ప్రతిభావంతుల చర్చలను వినడం నాకు చాలా ఉల్లాసంగాను, ఉపశమనం కలిగిస్తున్నదిగాను ఉన్నది. గవాస్కర్, హనీఫ్; ఇమ్రాన్, కపిల్ దేవ్; విరాట్, బాబర్ ఆజమ్‌ల క్రికెటింగ్ ప్రావీణ్యాలపై ఉత్తేజకరమైన చర్చలు, సందేహం లేదు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు సార్వకాలిక సంయుక్త ఇండియా–పాకిస్థాన్ ఎలెవన్ మనం ఎంపిక చేసుకోవాలి. ఎవరు ఎన్ని జెట్ విమానాలను కూల్చి వేశారన్న విషయమై పెద్ద పెట్టున వాదోపవాదాలు చేయడం కంటే ఆ సార్వకాలిక మేటి క్రికెటర్ల జట్టును ఎంపిక చేయడమే చాలా తేలిక!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

జీవ ద్రవ్యాలతో విద్యుత్ ఉత్పత్తి

ఒక పక్క భయానకమవుతోన్న వాతావరణ మార్పు, మరో పక్క అభివృద్ధి చెందుతున్న దేశాలలో గృహావసరాలకు, ఫ్యాక్టరీలకు, దుకాణాలకు విద్యుత్ శక్తిని సమృద్ధిగా సమకూర్చవలసిన తక్షణ అవసరం... ఈ రెండు సవాళ్ల దృష్ట్యా విద్యుదుత్పాదనకు బొగ్గును వాడుకోవాలా లేక మానివేయాలా అన్నది జిలియన్ (పరిమితి లేని అనిర్దిష్ట సంఖ్య) డాలర్ల ప్రశ్న. ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువగా ఉంచడంలో ప్రపంచ దేశాలు విఫలమవుతున్నాయి. సమస్త మానవాళి శ్రేయస్సుకు దోహదం చేసే విధంగా వాతావరణ మార్పు సమస్యను పరిష్కరించుకోవలసిన అవసరమున్నది. ఇదిగో ఇక్కడే విద్యుదుత్పత్తికి బొగ్గును ఉపయోగించుకోవాలా అన్న ప్రశ్న మరింత సంక్లిష్టమవుతోంది. బొగ్గును భూగర్భంలోనే ఉండనివ్వండి– విద్యుదుత్పత్తికి బొగ్గును ఉపయోగించ వద్దు అని చెప్పడం తేలికే. ఇప్పటికే ధరిత్రి వాతావరణాన్ని నిండుగా కమ్మివేసిన హరిత గృహవాయువుల ఉద్గారాలకు బొగ్గు ఆధారిత ఉత్పత్తి ప్రక్రియలే అత్యధికంగా కారణమని భావిస్తున్నందున బొగ్గు వాడకాన్ని నిలిపివేయాలనే మాట గట్టిగా వినిపిస్తోంది. అయితే ఇంధన అవసరాలు తగినంతగా చేకూరని దేశాలు అనేకం ఉండగా వాతావరణ మార్పు సమస్యకు అటువంటి పరిష్కారం ఎలా సాధ్యమవుతుంది?



■ సునీతా నారాయణ్

మట్టివాసన

మరి ఇంధన కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న భారత్ లాంటి దేశాలు ఏమి చేయాలి? సరసమైన అభివృద్ధి సాధన అనే వాటి స్వప్నం ఎలా ఫలిస్తుంది? బొగ్గు ఆధారిత ఉత్పత్తి పద్ధతులను పూర్తిగా త్యజించాలా? లేక పాత, కొత్త ఇంధన వనరులను సమతుల్యంగా ఉపయోగించుకోవాలా? కాలుష్యరహిత అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? విద్యుదుత్పత్తిలో బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించడమే లక్ష్యంగా ఉన్న భారత ప్రభుత్వ ఇంధన పరివర్తన ప్రణాళికే సమస్య పరిష్కారానికి సరైన మార్గాంతరమని నేను మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నాను. వాస్తవమేమిటంటే మన ఇంధన అవసరాలు 2030 సంవత్సరం నాటికి రెట్టింపు అవనున్నాయి. జీవనోపాధుల రక్షణకు, ఆరోగ్య భద్రత అవసరాలకు విద్యుదుత్పత్తి సమృద్ధిగా జరగడం తప్పనిసరి. పెరిగిన ఇంధన అవసరాలను ప్రాథమికంగా పవన, సౌరశక్తితో తీర్చుకునే వెసులుబాటు ఉన్నది. ఈ విధంగా 2030 నాటికి బొగ్గు, మన విద్యుత్ అవసరాలను 70 నుంచి 75 శాతం కాకుండా కేవలం 50 శాతాన్ని మాత్రమే తీర్చగలుగుతుంది.



బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన రంగం నుంచి హరిత గృహవాయువు ఉద్గారాల తగ్గింపునకు మనం ఏమి చేయాలో చర్చిద్దాం. బొగ్గు త్వరలోనే చరిత్ర చెత్తబుట్టలోకి చేరుతుందని సర్వత్రా విశ్వసిస్తున్న దృష్ట్యా ఆ శిలాజ ఇంధనంపై చర్చ నిషిద్ధ విషయమని నాకు తెలుసు. అయితే వాస్తవాల ప్రాతిపదికన మనం ఆలోచిద్దాం. అన్ని రంగాలలోను హరిత గృహవాయు ఉద్గారాలను తగ్గించవలసిన అవసరమున్నది. మనకు ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్న విషకారక వాయు ఉద్గారాలను తగ్గించుకున్నప్పుడే మనకు స్థానికంగా వాయు నిర్మలత సమకూరుతుంది. అదే సమయంలో ప్రపంచ వాతావరణ పరిరక్షణ ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకుని మనం వ్యవహరించాలి. ఆరోగ్య సవాళ్ల ప్రపంచ ప్రయోజనాలు రెండిటికీ దోహదం చేసే వ్యూహాలను మనం రూపొందించుకోగలిగితే మనకు ఆ రెండు అంశాలలోను సమ విజయం సమకూరుతుంది.

థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు జీవద్రవ్యాన్ని (వృక్షాలు, జంతువుల నుంచి సమకూరిన సేంద్రియ పదార్థాలు) ముడి పదార్థంగా ఉపయోగించాలి. 20 శాతం మేరకు జీవద్రవ్యాన్ని ఉపయోగించుకుంటే కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు గణనీయంగా తగ్గిపోతాయి.

'Decarbonizing the Coal based Thermal Power Sector in India : A Roadmap' అన్న నివేదికలో నా సహచరులు ఇదే ప్రతిపాదన చేశారు. థర్మల్ విద్యుత్కేంద్రాల డీ కార్బొనైజింగ్ చేసే వ్యూహాన్ని అనుసరించేందుకు దేశం నిర్ణయం తీసుకుంటే ఉక్కు, సిమెంట్ పరిశ్రమల కర్బన ఉద్గారాలతో సమస్థాయిలో థర్మల్ విద్యుత్కేంద్రాల కర్బన ఉద్గారాలు తగ్గిపోతాయి. తగ్గింపును విధిగా పరిగణనలోకి తీసుకోవాలి. తగ్గింపుపై దృష్టి పెట్టాలి.

ఈ మార్గదర్శక ప్రణాళికలో మొదటి అడుగు ప్రస్తుతమున్న విద్యుత్కేంద్రాలను, ఆ తరహా పరిశ్రమలలోని ఉత్తమ ప్లాంట్ల ఉత్పాదక సామర్థ్యంతో సమంగా విద్యుదుత్పాదన చేసేలా మెరుగుపరచాల్సిన అవసరమున్నది. ఉదాహరణకు సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఆధారిత విద్యుత్కేంద్రాలలో అగ్రశ్రేణివి అయిన టాటా పవర్ ట్రాంబే యూనిట్ లేదా తెలంగాణ లోని కొత్తగూడెం విద్యుత్కేంద్రం ఉద్గారాల స్థాయికి సమ రీతిలో తమ ఉద్గారాలనూ తగ్గించుకోవాలి. దీనివల్ల ఉద్గారాల పరిమాణం మొత్తంగా తగ్గిపోతుంది.

చేపట్టవలసిన రెండో చర్య బొగ్గు స్థానంలో జీవద్రవ్యాన్ని (వృక్షాలు, జంతువుల నుంచి సమకూరిన సేంద్రియ పదార్థాలు) ముడి పదార్థంగా ఉపయోగించడం. మా ప్రతిపాదన ఏమిటంటే ప్రతి థర్మల్ విద్యుత్కేంద్రమూ 20 శాతం జీవద్రవ్యాన్ని ఉపయోగించుకోవాలి. దీనివల్ల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు గణనీయంగా తగ్గిపోతాయి.

అయితే వీటన్నిటికీ ఒక ప్రణాళిక అవసరం. ఇందుకు ఉద్గారాల తగ్గింపునకు లక్ష్యాలు నిర్దేశించి, వాటి పరిపూర్తికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం అవసరం. ఉదాహరణకు ప్రస్తుత ప్రభుత్వ ప్రణాళిక అత్యాధునిక బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలకు ప్రాధాన్యమిస్తోంది. ఇవి నిస్సందేహంగా పాత సాంకేతికతల కంటే మరింత సమర్థమైనవి. అయితే విధానపరంగా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఈ అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాలలో నలభై శాతం, 50 శాతం కంటే తక్కువ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ కన్నా తక్కువగా పని చేస్తున్నాయి. అంటే ఉద్గారాలు పాత సాంకేతికతతో నడిచే ప్లాంట్లలో కంటే అధికంగా విడుదలవుతున్నాయి. పాత విద్యుత్కేంద్రాలలో విద్యుదుత్పాదన ఉత్పత్తి వ్యయం తక్కువ. పెట్టుబడి వ్యయాలూ తక్కువ. సాంకేతికతల, ప్లాంట్ల నిర్వహణకు అవసరమైన పెట్టుబడులూ తక్కువే. ఈ కారణంగానే బొగ్గు ఇప్పటికీ విద్యుదుత్పాదనకు అనివార్యంగా ప్రధాన అవసరంగా ఉన్నది. దానిని తొలగించాల్సిన అవసరమున్నది. అది సుసాధ్యమే.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

యువత ఆడాలి – భారత్ గెలవాలి

ప్రతి సంవత్సరం ఆగస్టు 29న, భారతదేశం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఈ రోజు కేవలం ఒక హాకీ లెజెండ్‌ను స్మరించుకోవడానికి మాత్రమే కాదు, 'దేశ క్రీడా రంగాన్ని క్షుణ్ణంగా సమీక్షించుకోవడానికి, దాని గతం నుంచి పాఠాలు నేర్చుకోవడానికి, వర్తమాన సవాళ్లను విశ్లేషించడానికి, భవిష్యత్తు కోసం ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించడానికి' గొప్ప అవకాశం. జనాభా పరంగా పెద్ద దేశమైనా, ఒలింపిక్ పతకాల సంఖ్య పరంగా మాత్రం చాలా వెనుకబడి ఉన్నాం. దీనికి కారణాలు అనేకం. 2016 రియో ఒలింపిక్స్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మన పతకాల స్థానం కొంత మెరుగుపడినా ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంది.



భారతదేశం 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే సంకల్పంతో ఉంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే, మన క్రీడా వ్యవస్థను సమూలంగా మార్చాలి. కేవలం నగరాల్లో ఆధునిక స్టేడియాలను నిర్మించడమే కాదు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి ప్రపంచ స్థాయి శిక్షణను అందించడం పట్ల దృష్టి సారించడం తప్పనిసరి. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం క్రీడా వికాసానికి జాతీయ స్థాయి విధానాలను రూపొందించాలి. దీనిలో పాఠశాల స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి వరకు అన్ని దశలను స్పష్టంగా నిర్వహించాలి. నేషనల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించి, విద్యలో క్రీడలను తప్పనిసరిగా భాగం చేయాలి. క్రీడా రంగానికి బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించి, వాటిని పారదర్శకంగా పంపిణీ చేయాలి. ఖేలో ఇండియా ప్రోగ్రాంను మరింత విస్తృతంగా, సమర్థవంతంగా అమలు చేసి, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించాలి. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం' పథకాన్ని మరింతగా విస్తరించాలి. క్రీడా వికాసంలో స్పోర్ట్స్ సైన్స్, ఫిజియాలజీ, సైకాలజీ వంటి శాస్త్రాలను ఉపయోగించుకోవాలి. క్రీడాకారుల పనితీరును మెరుగుపరచడానికి డేటా, విశ్లేషణాత్మక సమాచారం ఆధారంగా శిక్షణనివ్వాలి. విదేశీ కోచ్‌లను నియమించి, భారత కోచ్‌లకు అధునాతన శిక్షణ ఇప్పించాలి. క్రీడా సమాఖ్యల పనితీరును పారదర్శకంగా పర్యవేక్షించాలి. వాటిలో ఉన్న అవినీతి, స్వయంప్రతిపత్తి లేమి వంటి సమస్యలను పరిష్కరించాలి.

భారతదేశంలో యువతకు కొదవలేదు. కానీ నేటి సాంకేతిక యుగంలో మైదానంలో ఆటలు ఆడాల్సిన పిల్లలు, యువత వీడియో గేమ్స్, ఇతర సామాజిక మాధ్యమాల యాప్స్, ఆన్లైన్ గేమ్స్ వంటి వాటికి అలవాటు పడడం దురదృష్టకరం. యువత ఆ ప్రభావం నుంచి బయటకు వచ్చి మైదానంలో క్రీడల్లో పాల్గొనే విధంగా చేయడమే కాదు, వారి ప్రతిభను గుర్తించి, వారికి సరైన మద్దతు, ప్రోత్సాహం అందించడం ప్రభుత్వాల బాధ్యత.

– డా. రావుల కృష్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్‌సియు

ఈ పాటలు నేను మద్రాసులో క్రైస్తవ కళాశాలలో పట్ట పరీక్షకు చదువుకొనే దినాలలో (1917–1918) వ్రాయ మొద లెట్టినాను.

అప్పుడు నా అదృష్టంవల్ల మ – రా – శ్రీ అధికార్ల సూర్యనారాయణరావుగారి స్నేహభాగ్యం లభించటం, ఆయనతో కలిసి వాసం చేయటం కలిగింది. నన్నంతకు మునుపే సారస్వత విషయాల్లో అంతో యింతో తరిఫీదు చేయుచున్న మా బసవరాజు అప్పారావు కూడా అక్కడే వుండేవాడు. వారితో ముచ్చట్లకు మ – రా – శ్రీ పాటిబండ అప్పారావుగారును వచ్చుట మామూలు.

వారందరు యెవరి రచనల గురించి వారు సొంపుగా మాట్లాడుకొంటుంటే నేనొకప్రక్క కూర్చుని విస్తుపోయి వినటం రివాజు.

ఒకనాడు కాలేజీ నుండి ట్రాంబండిలో వస్తుండగా, గొంతులో సన్నని రాగం బయలుదేరింది. దానిని నాలో నేను పాడుకోవాలని సాహిత్యం జ్ఞాపకం చేసుకోపోయాను. ఎప్పుడో విన్న పదంలాగున "గుండెగొంతుకలోన కొట్లాడుతాది" అన్న పల్లవి వచ్చింది. అదే మననం చేసుకోగా చేసుకోగా యిల్లు చేరేసరికి నేను వ్రాసిన మొదటిపాట తేలింది.

మా "జానకీ" పతికిన్నీ, అప్పారావుకున్నూ ఆ పాట గద్గదికతో వినిపించాను. "సెబాస్ వ్రాయ"మన్నాడు జానకీపతి; "నీవు నిత్యం వాడే భాష కాదిది, యీ భాష సాయమున సత్యాన్వేషణం చేయలే" వన్నాడు మా బసవరాజు అప్పారావు.

ఏ సమయమున వెన్ను చరిచాడో, సూర్యనారాయణ! అప్పటి నుండియు "యెంకి"ని కవితారీతిని స్మరించుట నిముసమైన మానలేదు. ఆతడును అంతకంతకు దన అభిప్రాయమును బలపరుచుకొన్నాడు. మా అప్పారావు రానురాను తన అభిప్రాయం మార్చుకొని యిటీవల అతడును వల్లె అనుచున్నాడు.

పాటలు అప్రయత్నంగా వచ్చేటట్లు ప్రసాదించిన యెంకికి కృతజ్ఞుడనా? ప్రోత్సాహముచేసి వీపు దట్టిన అధికార్లవారికా? కవిత్వ కళా రహస్యాలు తెలియజేప్పిన మా బసవరాజు అప్పరాయనికా? మువ్వురకును. ఇంకను సహృదయు లెందరో చాలకాలంనుంచీ నన్ను హెచ్చరిస్తున్నారు.

అందులో "యెంకి" పాటలు పదిమందికీ వినిపించినవారు దేశోద్ధారక శ్రీయుత కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు. ఆంధ్ర పత్రికలో నేమి, భారతిలో నేమి ఆ పాటలకు తగిన తావొసంగి, యీ పుస్తకం అచ్చులో యెంతో అభిమానం చూపి, రెండు మాసములు యీ పుస్తకమును తమ మూడు పత్రికలలోనూ ఉచితముగా అడ్వర్‌టైజ్ చేయునట్లు ఆర్డరు దయచేసినారు. వారికెంతో కృతజ్ఞుడను.

'సాహితి' మా పత్రికే. అనసూయ, జనరంజని, జ్యోతి, సుజనరంజనీ పత్రికాధిపతులును నాకెంతో గౌరవమొసంగినారు. శారదయు అట్లే. వారూ తెలుగుతల్లి యొక్క నిజస్వరూపం చూడాలెనని ఉవ్విళ్లూరుచున్నవారే; తెలుగుపస, తెలుగునుడి, తెలుగువాదం,

'యెన్నాని సెప్పేది యెంకి ముచ్చట్లు'



ఇరవయ్యో శతాబ్ది నవ కవితా చైతన్యంలో అపూర్వ సంచలనం సృష్టించిన గేయ సంపుటి 'యెంకి పాటలు'. తన కృతికి నండూరి వెంకట సుబ్బారావు రాసిన ముందు మాటకు నేటికి వందేళ్లు.

తెలుగురుచీ తెలిసికొని మనజాతి సాంప్రదాయాలలోగల సొగసు, జీవమూ, పదిమందికిన్నీ మనసుకెక్కించాలెనని కంకణము కట్టుకుని కృషి చేస్తున్నవారే. వారందరికీ నా నమస్కృతులు,

ప్రభువులలో మా ప్రభువులును, కవులూ, రసికులూ అయిన శ్రీశ్రీశ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దురుగారు యీ పాటలు విని ఆనందించేవారు. ఆ మహారాజు నాకెన్నో విధాల మేలుచేసినారు. వారివంశమాచంద్రార్కమూ నిలుచుగాత యని పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను. పాటలలో సగం పైగా నూజువీటిలో శ్రీవారి సన్నిధినే వ్రాశాను.



మా అభినవాంధ్రకవిమిత్రమండలి వారందరు నా ప్రాణమిత్రులు. మాప్రెసిడెంటుగారగు శ్రీయుత కోలవెన్ను రామకోటేశ్వరరావుగారి ద్వారా వారి దయకు బదులు నా వందనము లర్పిస్తున్నాను. ఇందులో చిత్రపటములు మా అడవి బాపిరాజుగారు వ్రాసినవి. ఆయన చిత్రములలోని మహోన్నత భావాలకు నా యెంకి పాటలే కారణమైతే, ధన్యుడను, ధన్యుఁడను!

మద్రాసు ఆంధ్ర పండిత మండలివారు నన్ను ప్రత్యేకం ఆహ్వానించి గౌరవించారు. 'అప్పటినుంచీ పండితులంటే భయంపోయి భక్తే మిగిలింది, వారికి నా సమస్సులు.

కావ్యవ్యాకరణతీర్థులు బ్రహ్మశ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రుల వారికి మా యెంకి పేరు చెపితేనే యెంతో అపేక్ష; పాటలంటే ప్రాణమే. పండితులయిన్నీ "యేమో, చదువురానివారి పాట"లని తోసెయ్యరు. యెంకిపై పదిమంది హృదయాలల్లో భక్తి కలిగించింది వారున్నూ, బ్రహ్మశ్రీ పొక్కులూరి లక్ష్మీనారాయణగారున్నూ. వారిరువురికీ నా నమస్కారాలు.


తెలుగుదేశంలో పేరొందిన మేటిగాయకులు మ. రా. శ్రీ విద్వాన్ పారుపల్లి రామకృష్ణయ్యగారు యెంతో శ్రమపడి, శ్రద్ధతో యీ పాటలకు స్వరం వేశారు. వారికి నా నమస్కారాలు. అదే నేను పాడే విధము.

తర్కవ్యాకరణ శాస్త్రవేత్తలగు బ్రహ్మశ్రీ గంటి సూర్యనారాయణ శాస్త్రులుగారు తమకుతామై కోరి, యీ పాటలు చక్కగా అచ్చువేయించినందుకు వారికి చదువరులతోబాటు నేనును కృతజ్ఞుడను.

ఈ కృతి నర్పించినది నా పెత్తల్లి కుమారునకు. నా తండ్రి నాకు నాలుగైదేండ్లున్నప్పుడు కాలంచేస్తే, అప్పటినుండి యిప్పటివరకు మాకందరకు అతడే పట్టుకొమ్మ. "చంద్రున కొక్కనూలిపోగ"న్నట్లు అతనికీ కృతి సమర్పిస్తున్నాను.

మద్రాసు,
29–8–1925.

– నండూరి వెంకటసుబ్బారావు



సాదా బైనామాలకు రైట్ రైట్

- హైకోర్టు తీర్పుతో క్రమబద్ధీకరణకు మార్గం సుగమం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తెచ్చిన జీవో 112పై హైకోర్టులో కేసు
- పాత చట్టం స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం రావటంతో తొలిగిన అడ్డంకులు
- క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు
- భూ భారతి సదస్సుల్లో భారీగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 1,66,784 దరఖాస్తులకు కలగనున్న మోక్షం

ఐదున్నరేళ్ల రైతుల ఎదురుచూపులకు తెర

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సాదా బైనామాలకు అడ్డంకులు తొలిగాయి. ఐదున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల నిరీక్షణకు తెరపడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన 112జీవో స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకరావటంతో పాటు ప్రభుత్వం సాదా బైనామాల పరిష్కారంపై విధివిదానాలను హైకోర్టుకు సమర్పించింది. దీంతో హైకోర్టు తన ముందు ఉన్న పిల్‌ను కొట్టివేసింది. ప్రభుత్వం సాదా బైనామాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2020 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,66,784దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లోనూ భారీగా సైదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌తో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదా బైనామాలకు మోక్షం కలుగుతుందనే ఆనందంలో అన్నదాతలు ఉన్నారు.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది సాదాబైనామాలు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. 12 అక్టోబరు 2020లో కూడా జీవో నెంబరు 112ను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసిన సాదాబైనామాల ప్రక్రియ ముందుకు సాగలేదు. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో జీవో నెంబరు 112ద్వారా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ నిర్మల్‌కు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో పిల్ దాఖాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు జీవో అమలును నిలిపివేస్తూ 2020 నవంబరు 11న మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తుందనే ఆశతో అప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో వరంగల్ జిల్లాలో 26,630 పెండింగ్ సాదాబైనామాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో 27,057 దరఖాస్తులు, జనగామ జిల్లాలో 10,350 దరఖాస్తులు, మహబూబాబాద్ జిల్లాలో 31,250 దరఖాస్తులు, ములుగు జిల్లాలో 20,150 దరఖాస్తులు, భూపాలపల్లి జిల్లాలో 51,347 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇటీవల నిర్వహించిన భూభారతి

(మిగతా 7లో..)

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ...

- కన్నుల పండువగా మొదలైన నవరాత్రి వేడుకలు
- వాడవాడనా మండపాల్లో కొలువైన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో కొనసాగిన ప్రతిష్ఠాపన వేడుకలు
- పాల్గొన్న పలువురు ప్రముఖులు.. ప్రత్యేక పూజలు
- ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడే..

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జిల్లా ప్రజలు జరుపుకున్నారు. బాద్రప్రద శుద్ధ చవితి బుధవారం ఉదయం 10.30 గంటల వరకు వర్షం ఉండటంతో 11 గంటల తరువాత భాజాభజంత్రీలు, మేళతాళాలతో అట్టహాసంగా గణేష్ మండళ్ల నిర్వాహకులు ప్రత్యేకంగా శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపాల్లో గణనాథుడి ప్రతిమలను నిలిపి తొలిపూజలను నిర్వహింపజేశారు. అదే విధంగా బుల్లి గణపయ్యలను ప్రతీ ఇంట ప్రతిష్టింపజేసి

(మిగతా 6లో..)


ఎల్లంబజార్‌లోని 45 అడుగుల భారీ గణేషుడు


హనుమకొండ సాయినగర్ వద్ద..


వేయిస్తంభాల ఆలయంలోని లక్ష్మీ గణపతిని ఐరావత వాహన సేవలో పాల్గొన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

జోరుగా వర్షాలు

హసన్‌పర్తిలో అత్యధికంగా 44.2 మి.మీ. వర్షం

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. హనుమకొండ జిల్లాలో సరాసరి 26.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. హసన్‌పర్తి మండలంలో అత్యధికంగా 44.2 మి.మీ. వర్షం పడింది. భీమదేవరపల్లి మండలంలో 9.2 మి.మీ, వేలేరులో 20.8 మి.మీ, ఎల్కతుర్తిలో 13.6 మి.మీ, కమలాపూర్‌లో 42.9 మి.మీ, హసన్‌పర్తిలో 44.2 మి.మీ, ధర్మసాగర్‌లో 16.2 మి.మీ, కాజీపేటలో 28.2 మి.మీ, హనుమకొండలో 31.6 మి.మీ, ఐనవోలులో 5.1 మి.మీ, పరకాలలో 33.2 మి.మీ, దామెర లో 38.2 మి.మీ, ఆత్మకూరులో 31.7 మి.మీ, శాయంపేటలో 31.3 మి.మీ, నడికూడలో 20మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ హెచ్చరిక కేంద్రం తెలిపింది. హనుమకొండతో పాటు వరంగల్, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా అతి భారీ వర్షాలు కురవవచ్చునని పేర్కొన్నది.

సీఎంది మోసం.. మాజీ సీఎంది వైఫల్యం..

- పేదల బతుకులంటే ఎందుకింత చిన్నచూపు
- పెన్షన్లు పెంచి, కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోతే యుద్ధమే
- సెప్టెంబర్ 9న హైదరాబాద్ మహాగర్జనను విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి చేసింది మోసమైతే, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్నదని వైఫల్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ధ్వజమెత్తారు. పేదల బతుకులంటే మీకెందుకంత చిన్నచూపంటూ ఇద్దరినీ తూర్పార బట్టారు. ధనిక సామాజిక వర్గంలో పుట్టిన మీకు పెన్షన్‌దారులంటే ఓ రకమైన భావన ఉందని, కానీ పూరి గుడిసెలో పుట్టిన తనకు వారంటే ప్రేమ ఉందని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ వారి బాధలను భుజాన వేసుకుని మోస్తూ మిమ్మల్ని ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద గల ఓ గార్డెన్‌లో గురువారం ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ పెన్షన్ దారుల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబరు 9న సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెన్షన్ దారులైన వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు ఇతరులకు రూ.4వేలు ఇస్తానన్న ముఖ్యమంత్రి మాటలను వీడియో ద్వారా సాక్షాలు చూపుతూ సభలో ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ ఉంటే రూ.2 వేలే, నేనొస్తే రూ.4 వేలంటూ నమ్మబలికించి సీఎంగా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని ఆరోపించారు. 20నెలలుగా పెన్షన్ దారులను, కొత్తగా మంజూరి కావాల్సిన వారిని పట్టించుకోకుండా ప్రభుత్వం తప్పించుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 45 లక్షల మంది పెన్షన్‌దారులు, మరో 10లక్షల మంది కొత్తగా మంజూరు కావాల్సిన వారున్నారని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి అధికారంలోకి వచ్చాక ఆ లెక్క మరిచిపోయాడా అని ప్రశ్నించారు. రూ. 200 ఉన్న పెన్షన్‌ను నేడు రూ.2వేల వరకు సాధించేలా పోరాటం చేసిన

(మిగతా 6లో..)


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కొత్త పత్తి వచ్చేసింది..

ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన రైతు


కొత్తపత్తిని అమ్మకానికి తీసుకువచ్చిన రైతుతో అడ్తిదారు, ఖరీదుదారు

కేయూ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇంజనీరింగ్ సప్లిమెంటరీ 3, 5, 7, 8వ సెమిస్టర్, ఐదేళ్ల న్యాయశాస్త్ర కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల షెడ్యూల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ అసీం ఇక్బాల్‌లు విడుదల చేశారు. బీటెక్ మూడో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 2, 4, 8, 10, 12, 16, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. బీటెక్ ఐదో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1, 3, 6, 9, 11, 15, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. బీటెక్ ఏడో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 2, 4, 8, 10, 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. కేయూ కో ఎడ్యుకేషన్, వుమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. న్యాయశాస్త్రం ఐదేళ్ల రెగ్యులర్ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1, 3, 6, 9, 11 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులు పరీక్షలు రాసుకునే అవకాశం వుంది. పరీక్షల కేంద్రాలను సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో ఏర్పాటు చేశారు.

రీషెడ్యూల్ పరీక్షల తేదీలివే..

భారీ వర్షాల కారణంగా ఆగస్టు 28, 29 తేదీల్లో జరుగాల్సిన పరీక్షల రీ షెడ్యూల్‌ను గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రకటించారు. ఆగస్టు 28న జరుగాల్సిన కేయూ ఎంఈడీ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పేపర్ -4 సబ్జెక్టును సెప్టెంబరు 3న జరుగుతోంది. 28న జరగాల్సిన కేయూ బీఫార్మసీ సీబీసీఎస్ నాలుగో సెమిస్టర్ పేపర్-2 పరీక్షల సెప్టెంబరు 6వ తేదీన జరుగుతుందని ప్రకటించారు. ఆయా పరీక్షలు గతంలో ప్రకటించిన విధంగా యథావిధిగా పరీక్షల కేంద్రాలు, టైం టేబుల్ ప్రకారం జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌ను చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

ఈనెల 28, 29 కేయూ పరీక్షలన్నీ వాయిదా

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరుగాల్సిన డిగ్రీ, పీజీతో సహా అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ గురువారం స్పష్టం చేశారు. తెలంగాణలో భారీ వర్షాల కారణంగా రెండు రోజులు పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మిగతా పరీక్షలన్నీ గత షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని వెల్లడించారు. వాయిదా వేసిన పరీక్షల రీషెడ్యూల్ తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

నేడు పలు రైళ్ల రద్దు

కాజీపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. (17003)కాజీపేట-సిర్పూర్ టౌన్ వెళ్లే రామగిరి ప్యాసింజర్ రైలు అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట-బల్లార్షల మధ్య నడిచే కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భద్రాచలం నుంచి సిర్పూర్ బల్లార్ష మధ్య నడిచే సింగరేణి ప్యాసింజర్ భద్రాచలం నుంచి కాజీపేట మధ్య మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

మద్యం టెండర్లపై కసరత్తు

- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంపు
- 2025-27 మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి అధికారుల కసరత్తు
- డిసెంబరు 1 నుంచి అమలులోకి రానున్న కొత్త మద్యం పాలసీ
- ఇంకా ఖరారు కాని తేదీలు
- టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్న లిక్కర్ వ్యాపారులు



వరంగల్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల టెండర్లకు కసరత్తు మొదలైంది. 2025-27 సంవత్సరానికి గాను కొత్త మద్యం పాలసీని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఏ-4 లిక్కర్ షాపుల లైసెన్సుల జారీకి ప్రభుత్వం ఈనెల 20న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో వైన్‌షాపుల టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రస్తుతం అమల్లో వున్న 2023-25 సంవత్సరం టెండర్ వచ్చే నవంబరు 30తో ముగిసిపోనుంది. ఆ లోపు దరఖాస్తులు, టెండర్‌లు, లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సిద్ధమవుతున్నారు.

దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు

2025-27 సంవత్సరం మద్యం పాలసీలో భాగంగా టెండర్ల దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో 2023-25 సంవత్సరంలోని మద్యం పాలసీలో లైసెన్సు ఫీజుగా రూ.2 లక్షలు చెల్లించారు. ఈసారి మరో రూ.ఒక లక్షను పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే అర్హులని అధికారులు చెబుతున్నారు. వరంగల్ జిల్లాలోని 63 మద్యం దుకాణాలకు టెండర్లు వేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. వరంగల్ జిల్లాలో మొత్తం మూడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఉండగా, వాటిలో పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 22, నర్సంపేట 25, వర్ధన్నపేట పరిధిలో 16 మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించనున్నారు. గత టెండర్‌లో 2,938 దరఖాస్తుల ద్వారా రూ.58 కోట్ల 76లక్షలు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల సంవత్సరం కావడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత టెండర్ల కన్నా రెట్టింపు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి అధికారులు 4వేలకు పైగా దరఖాస్తులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వ్యాపారులు ముందుకు వచ్చేనా..

2025-27 మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు మద్యం వ్యాపారులు ముందుకు వచ్చే పరిస్థితి కనబడడం లేదు. మద్యం దుకాణాలను పొందాలంటే ఒక్కో దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలు చెల్లించాలి. గతంలో రూ.2 లక్షలు ఉండేది. ఈసారి అదనంగా రూ.లక్ష పెంచడంతో వ్యాపారులు తక్కువ మొత్తంలో దరఖాస్తులు చేసే అవకాశాలు లేకపోలేదు. అంతేకాకుండా సాధారణంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వెంటనే డ్రా తీసి దుకాణాలను కేటాయించి నెల రోజుల్లో నూతన దుకాణాలు ప్రారంభం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేది.

ఇంకా దుకాణాల లైసెన్సుల గడువు మూడు నెలలకు పైగా ఉన్నప్పటికి ముందుగానే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా నూతన దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించి డ్రా నిర్వహించి లైసెన్సు ఫీజును తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. డ్రాలో మద్యం దుకాణం పొందిన వారు మూడు నెలల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రూ.లక్షలు, కోట్లు వెచ్చించి దరఖాస్తులు చేసి మద్యం దుకాణం పొందిన తర్వాత మళ్లీ లైసెన్సు ఫీజు కూడా రూ.లక్షల్లో చెల్లించి నాలుగు నెలలు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో వ్యాపారులకు వడ్డీ భారం తప్పడం లేదు. ప్రభుత్వం మద్యం వ్యాపారులకు ఇచ్చే లాభాలు మాత్రం పెంచడం లేదు. దీంతో దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో తేదీలను ఖరారు చేస్తాం..



ప్రభుత్వం ఏ-4 మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తులు, టెండర్లు, లక్కీ డ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే దరఖాస్తుల తేదీలను ప్రభుత్వం ఖరారు చేస్తుంది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ ప్రతీ దరఖాస్తుకు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

– డి.అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, ఎక్సైజ్ శాఖ, వరంగల్ జిల్లా

కొత్త పత్తి వచ్చేసింది..

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం కొత్త పత్తి అమ్మకానికి వచ్చింది. హనుమకొండ జిల్లా నాగారం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ఐదు బస్తాల కొత్త పత్తిని అమ్మకానికి తీసుకువచ్చాడు. కల్పన అండ్ కో అడ్తికి రాగా మారుతి ఆయిల్ మిల్ ఖరీదుదారు క్వింటాల్‌కు రూ.6,921 చొప్పున కొనుగోలు చేశారు. ఇదిలా ఉంటే మార్కెట్‌కు కొత్త పత్తి అమ్మకానికి వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు, వ్యాపారులు, అధికారులు కొత్త పత్తిని చూసి రైతుతో మాట్లాడి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తాను జూన్ మొదటి వారంలోనే మూడెకరాల్లో పత్తి సాగు చేశానన్నారు.ఇప్పుడిప్పుడే కాయలు పడి పత్తి వస్తుంటే తొలిసారి అమ్మకానికి తీసుకువచ్చానని చెప్పారు.

నిమజ్జనానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

పోచమ్మమైదాన్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద, గ్రేటర్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయితో కలిసి గురువారం ఎంపీ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. క్రేన్‌లు, తెప్పలు రద్దీకి సరిపోయేలా సిద్ధంగా ఉంచాలని, రద్దీని నియంత్రిస్తూ పటిష్టమైన భద్రత కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు రాయల ప్రభాకర్, షేక్ సలీమా, వరంగల్ సబ్‌డివిజన్ ఏఎస్పీ శుభం ప్రకాష్ పాల్గొన్నారు.

గణపతి విగ్రహాలకు జియో ట్యాగింగ్



వరంగల్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గణపతి విగ్రహాల లొకేషన్‌తో పాటు ఆన్‌లైన్ తనిఖీలను ఉన్నతాధికారులు పరిశీలించేందుకు వీలుగా ఉండేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌జోన్ ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో గణపతి విగ్రహల జియో ట్యాగింగ్‌ను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని 3 జోన్‌లలో ఇప్పటి వరకు 4,200 మండపాల నిర్వహకులు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందగా సుమారు 2,000 విగ్రహలకు జియోట్యాగింగ్ అయినట్లుగా సమాచారం. కాగా, జియో ట్యాగింగ్ ద్వారా మండపం వద్ద జరగరాని సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడానికి సలువుగా ఉండటం, తొమ్మిది రోజుల పాటు పాయింట్ బుక్‌లో సిబ్బంది నిర్వహించే తనిఖీలను సంబంధిత ఎస్‌హెచ్‌ఓతోపాటు పోలీస్ కమిషనర్ వరకు పరిశీలించేందుకు వీలుంటుందని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా ఎన్ని విగ్రహలు నిమజ్జనం అయ్యాయనే విషయం సైతం జియో ట్యాగింగ్ ద్వారా ఉన్నతాధికారులకు చేరుతుంది. తనిఖీల సమయంలో సిబ్బంది ట్యాబ్‌లో మండపంవద్ద నుంచి విగ్రహం ఫొటోతో పాటు అక్కడే ఉన్న రిమార్క్స్‌ను ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లే అవకాశం ఉంది. ఈ జియో ట్యాగింగ్ విధానంను వేగంగా పూర్తిచేసేందుకు కమిషనరేట్ పోలీసులు ఆయా మండపాలను సందర్శించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

సీఎంది మోసం.. మాజీ సీఎంది వైఫల్యం..

(5వ పేజీ తరువాయి)

మాకు మీరిచ్చిన హామీని అమలు ఎలా చేయించుకోవాలో కూడా తెలుసన్నారు. ఇక మాజీ సీఎం కేసీఆర్ అధికారంలోకి వస్తే ఇదేవిధంగా పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వంలోకి రాలేదన్నారు. కానీ, ప్రశ్నించే స్థానంలో ప్రజలు కూర్చోబెడితే ఫాంహౌస్‌లో పడుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజల తరఫున మాట్లడకుండా, అసెంబ్లీకి వెళ్లకుండా మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్షంగా ఎందుకున్నాడని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ మోసం చేస్తే, బీఆర్ఎస్ వైఫల్యం చెందుతోందని ఆరోపించారు. గతంలో వీరిద్దరు పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర శిష్యరికం పొందిన వారే కదా, మరి అతన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు.

బువ్వ కరువై, బతుకు బరువైన వృద్ధులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంతోనే తాను వారిని తన భుజాలపై ఎత్తుకుని ప్రశ్నించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 89 నియోజకవర్గాలు పూర్తి చేసుకు ని, మరో 30 నియోజకవర్గాలు పూర్తి చేసి, రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 9న హైదరాబాదులో భారీ మహాగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో గోలి సుధాకర్, జోగుల కుమారస్వామి, ఐత రాజు, రమేశ్, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- మైనారిటీ గురుకులాన్ని తనిఖీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్



మైనారిటీ గురుకులాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

శంభునిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించాల్సిన వసతులు, సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ ఎంపీ కడియం కావ్య హెచ్చరించారు. నగరంలోని రంగశాయిపేట జక్కలొద్దిలో గల మైనారిటీ గురుకుల కళాశాలను గురువారం ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజులు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని వంట గదిని పరిశీలించారు.. స్టోర్ రూమ్, కిచెన్, హాస్టల్, గురుకుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం వండిన వంటలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, హాస్టల్, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరంవిద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా.. అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో అందిస్తున్న మౌలిక వనరులను ఉపయోగించుకొని కష్టపడి చదవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష సాధన కోసం కృషి చేయాలన్నారు. మానసిక ఒత్తిడికి గురికావద్దని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. వివిధ పాఠ్యాంశాల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించి విద్యా ప్రమాణా లు, సదుపాయాల గురించి మాట్లాడారు. గురకులం భవనంపై నుంచి నీరు కారుతుండడాన్ని గుర్తించి పరిశీలించారు. మరమ్మతు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

దామెర చెరువు కట్టను మరమ్మతు చేయాలి

గురుకులం పక్కనే ఉన్న దామెర చెరువును ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారదలు కళాశాల భవనంపై నుంచి పరిశీలించారు. చెరువు నీటి సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం, ఇతర అంశాలను నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుకట్ట బలోపేతానికి చర్య తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్, డీపీఆర్వో అయూబ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ...

(5వ పేజీ తరువాయి)



సాయిబాబా ఆలయంలో కొలువైన వినాయకుడు

పాయసం, ఉండ్రాళ్ల నైవేద్యంతో ఇంటిల్లిపాది గణపయ్యను కొలిచి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం తమ వాడలో ప్రతిష్ఠింపజేసిన మండలాల వద్దకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. నగరంలోని అనేకఅపార్ట్‌మెంట్లలో సైతం గణేష్ చవితి సందడి నెలకొంది. ఎక్కడ చూసిన ఆధ్యాత్మిక పరిమళాలు గుబాళిస్తున్నాయి. మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇచ్చిన నేపథ్యంలో విద్యుత్ దీపకాంతులను మండపాల ముందు ఈసారి మరింత ఆడంబరంగా తీర్చిదిద్ది వేడుకలు నిర్వహిస్తున్నారు.

వేడుకల్లో ప్రముఖులు

నగరంలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో 55వ వరసిద్ధి వినాయక నవరాత్రి వేడుకలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతులు ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారి పున్నంచందర్ ఇంటి నుంచి ఆరున్నర అడుగుల పీట్ల మట్టి గణపయ్యను ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠింపజేశారు. అదే విధంగా హనుమకొండ బ్రాహ్మణవాడలో 8 ప్రాంతాల్లో, సుధానగర్‌లో 6 చోట్ల, రెవెన్యూకాలనీ, ఎక్సైజ్ కాలనీ, రామ్‌నగర్, విద్యారణ్యపురి, వికాస్‌నగర్ తదితర అన్ని ప్రధాన ప్రాంతాలలో వందలాది గణపయ్యలను ఆకర్షణీయ మండపాల్లో కొలువుదీర్చి పూజలు నిర్వహిస్తున్నారు.

నగరంలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌లు వారి వారి నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మేయర్ గుండు సుధారాణి వరంగల్‌లో పలు ప్రాంతాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న వేడుకల పరంపరలో భాగంగా ఈసారి కూడా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు నిత్యపూజలతోపాటు హోమాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సెప్టెంబరు 5వ తేదీన అన్ని చోట్ల ఒకేసారి గణపతి ప్రతిమలను నిమజ్జనం చేయనున్నారు.

వర్షాభావ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి రాజనర్సింహ

వరంగల్ మెడికల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాల వైద్య శాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలలో వర్ష ప్రభావానికి గురైన ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. పురపాలక, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, స్నేక్ బైట్‌లు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వచ్చే రెండుమూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

రాజకీయ లబ్ధికోసమే ఓట్ల చోరీ స్టంట్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి
- నాయిని అడ్డిమారిలో గెలిచాడు : రావుల కిషన్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరిగే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓట్ల చోరీ కథను దేశవ్యాప్తంగా నడిపిస్తున్నాడని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఎన్నికల సమయంలో ఏదో ఒక స్టంట్‌లో భాగంగా జోడో యాత్ర, పాద యాత్ర పేరిట ప్రజల్లోకి రావడం రాహుల్‌కు అలవాటైపోయిందన్నారు. ఎప్పటిలాగే ఇప్పుడు ఓట్ల చోరీ డ్రామాతో కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ముందు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై నాయిని దృష్టిసారించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి హితవు పలికారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్ మాట్లాడుతూ.. నాయిని రాజేందర్‌రెడ్డి అడ్డిమారిలో ఎమ్మెల్యేగా గెలుపొందాడని, ఎద్దేవా చేశారు. మద్యం దందా, ఇళ్ల దందాలో ఆయనతోపాటు బస్వరాజు సారయ్య పాత్ర ఏమిటో వరంగల్ ప్రజలందరికీ తెలుసన్నారు. బాలసముద్రంలోని డబుల్ బెడ్ రూమ్‌ల పంపిణీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను దూషించడమే కాకుండా, సొంత పార్టీలోని బీసీ నాయకులైన కొండా మురళి, సురేఖలను సైతం ఓర్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, శేషగిరిరావు, శ్రావణ్, మహేందర్, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

- ఐదుగురు వ్యక్తుల నుంచి 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



దొంగలను అరెస్టు చూపిస్తున్న సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామగ్రి కొనుగోలు చేస్తున్న వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లను దొంగలించిన జార్ఖండ్‌కు చెందిన ఐదుగురు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. అయన కథనం ప్రకారం.. గణపతి ఉత్సవాల్లో భాగంగా లష్కర్‌బజార్, కుమార్‌పల్లి మార్కెట్ ఏరియాల్లో భక్తులు పూజా సామగ్రి తీసుకుంటుండగా దృష్టిమరల్చి జేబుల్లో నుంచి సెల్‌ఫోన్‌లను దొంగలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రూ.1,50,000 విలువ చేసే 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన దొంగల ముఠా ప్లాస్టిక్ కవర్లు అడ్డుపెట్టి రద్దీప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లను దొంగలిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆ ముఠా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన రావుఫ్, అశోక్, మహేందర్‌లను సీఐ అభినందించారు.

గణేష్ నవరాత్రి వేడుకలతో ఐక్యత

వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి నిధులు


హనుమకొండ పెట్రోల్ పంపు వద్ద..


హనుమాన్ యూత్ జన్మభూమి జంక్షన్‌లోని గణేషుడు


జ్యోతి వెలిగించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా మొదలైన వినాయక చవితి వేడుకలు


హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందింపజేసి ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో దేవాదాయ శాఖ పక్షాన వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి వేడుకలను బుధవారం ఆమె వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి- నీలిమా దంపతులతో కలిసి ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, సాంస్కృతిక కార్యక్రమాలకు దాతగా వ్యవహరిస్తున్న లయన్స్ మల్టీపుల్ నాయకుడు బిర్లా ఓపెన్‌మైండ్స్ డైరెక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, ఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలు ఈ ప్రాంత ప్రజల్లో భక్తిభావనను పెంపొందింపజేస్తున్నాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు


వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా కేంద్ర పురావస్తు, టూరిజం శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి రూ. 75 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ కావ్య చెప్పారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంలో ఆయన సానుకూలంగా స్పందించారని ప్రసాద్ పథకం కింద చేర్చి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. కుడా ఆధ్వర్యంలో ఆలయం ముందు భాగాన రోడ్డు వెడల్పు, గార్డెన్ ఆధునీకరణల అంటి కార్యక్రమాలను కూడా చేపడతామన్నారు. తొలిరోజు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాహనసేవలో స్వయంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాత్రి ప్రముఖ పురాణ ప్రవచకులు వంగాల సోమయాజులుచే శమంతకోపాఖ్యానం నిర్వహించారు.

లక్ష్మీగణపతిగా...

రెండవ రోజు నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం వేయిస్తంభాల ఆలయంలోని ప్రధాన గణపతిని లక్ష్మీ గణపతిగా అలంకరింపజేసి ఐరావత వాహన సేవ నిర్వహించారు. ప్రముఖ బిల్డర్ వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభింపజేశారు. శివానంద నృత్యమాల నిర్వాహకులు బోంపెల్లి సుధీర్‌రావు బృందంచే గురువారం రాత్రి కళాకారులు అద్భుత శాస్త్రీయ నృత్యాలతో భక్తులను ఓలలాడింపజేశారు. రుద్రేశ్వర సేవా సమితి సభ్యులు గంద్రాతి రాజు, చొల్లేటి కృష్ణమాచారి, పులి రజనీకాంత్ తదితరులు సేవలందించారు.


ఏకశిల యూత్ ఆధ్వర్యంలో బాల గణేసుడిగా కొలువుదీరిన గణనాథుడు


గీసుగొండలోని కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో..


కాజీపేట సెయింట్‌పేటర్స్ స్కూల్ సమీపంలో..


రామన్నపేటలో రుద్రాక్షలతో గణనాథుడు


పాపయ్యపేటలో మహావీర్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు


కాజీపేట డీజిల్‌కాలనీలో భారీ గణనాథుడు


హనుమకొండ చౌరస్తా పూల దుకాణాల వద్ద..


హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో..


జేపీఎన్ రోడ్ సిద్ధివిఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాజుపెంకులతో కొలువుదీరిన గణనాథుడు

హాకీ... ఏకాకి..

- దేశవాళి క్రీడగా ప్రసిద్ధిగాంచిన క్రీడపై నీలినీడలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరాదరణ
- పట్టించుకోని క్రీడా సంఘాలు, అధికారులు




వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడ ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రధానంగా హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్ధమాన క్రీడాకారులకు తర్ఫీదులు అందించే వారు లేకపోవడంతో ఈ క్రీడ పట్ల క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. హాకీ క్రీడపై డీఎస్‌ఏ, అసోసియేషన్లు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో క్రీడాకారులకు ఆట అందని ద్రాక్షలాగా మిగిలింది. హాకీ క్రీడను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం (ఆగస్టు 29) సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని హాకీ క్రీడ స్థితిగతుల పట్ల ప్రత్యేక కథనం..

కోర్టులు లేవు.. కోచ్‌లు కరువు

హనుమకొండ జేఎన్ఎస్‌లో పలు క్రీడలకు మైదానాలు, కోర్టులు ఉన్నప్పటికీ హాకీ క్రీడకు మైదానంతోపాటు కోచ్‌లు సైతం అందుబాటులో లేని కారణంగా ఈ క్రీడ అంతరించిపోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కేయూ, నిట్ కళాశాలలో సైతం విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు హాకీ కోర్టులు అందుబాటులో లేకపోవడం దయనీయం. అయితే 30 ఏళ్లుగా హనుమకొండ నయీంనగర్‌లోని కుడా మైదానంలో కొందరు సీనియర్ క్రీడాకారులు హాకీ క్లబ్ ఏర్పాటు చేసుకొని వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు.

ప్రోత్సహించాలి..

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) పలు క్రీడలకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతోంది. 2005కు ముందు జేఎన్ఎస్‌లో అన్ని క్రీడలకు ఉన్నట్లే హాకీ క్రీడకు కోర్టు ఉండేది. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు. హాకీ జట్టుకు చీఫ్‌కోచ్‌గా ప్రాతినిథ్యం వహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందల సంఖ్యలో క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చి రాష్ట్రానికి, దేశానికి పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందించి రిటైర్డు అయిన చెందిన పెరుమాళ్ మధుకరన్ మన ములుగుకు చెందినవాడే కావడం గర్వకారణం. అదే విధంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గతంలో జేఎన్ఎస్ మైదానంలో హాకీలో శిక్షణ పొందినవారే. గతంలో నిత్యం వందల మంది హాకీ క్రీడాకారులతో కళకళలాడే జేఎన్ఎస్.. నేడు అసోసియేషన్ బాధ్యుల సమన్వయలోపంతో బోసిపోతోంది. ఘన చరిత్ర కలిగిన హాకీ క్రీడను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రోత్సహించి జిల్లాకు పునర్వైభవం తీసుకురావాలని పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.



హాకీ క్రీడకు సహకారం



నగరంలో హాకీ మైదానం ఏర్పాటుకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారం కోరాం. జిల్లాలో అసోసియేషన్ల సమన్వయ లోపం కారణంగా హాకీ క్రీడను నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావడం లేదు. దీనిపై జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రత్యేక దృష్టి సారించి ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వాల ప్రోత్సాహంతో పాటు కొన్ని ఐటీ కంపెనీలు ముందుకు వచ్చి క్రీడలను ప్రోత్సహిస్తే మెరికలాంటి క్రీడాకారులను దేశానికి అందించవచ్చు.

- కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట ఎమ్మెల్యే


అసోసియేషన్ల సమన్వయ లోపం



అసోసియేషన్ల సమన్వయలోపం వల్ల ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడకు ఆదరణ కరువైంది. గతంలో అంతర్జాతీయస్థాయిలో హాకీ ప్రీమియర్ లీగ్ (హెచ్‌పీఎల్) మ్యాచ్‌లు జరిగేవి. ఏదైనా క్రీడల్లో ప్రతిభ కనబర్చాలంటే పిరమిడ్ లాంటి ప్రణాళిక రూపొందించి క్రీడాకారులకు శిక్షణ అందించాలి. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా విద్యార్థులను ప్రైమరీ స్థాయి నుంచే క్రీడల వైపు మళ్లించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ దిశగా తల్లిదండ్రులు, క్రీడా సంఘాలు కృషి చేయాలి.

- పెరుమాళ్ మధుకరన్, ఇండియన్ హాకీ రిటైర్డు చీఫ్ కోచ్


హాకీ కోర్టులు ఏర్పాటు చేయాలి..



గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడకు ఆదరణ ఎక్కవ ఉండేది. దీంతో తర్ఫీదు తీసుకునేందుకు క్రీడాకారులతో హమీ క్రీడా మైదానాలు కళకళలాడేవి. కానీ కొన్నేళ్లుగా హాకీ క్రీడను సాట్, డీఎస్ఏలు పట్టించుకోవడం లేదు. హాకీ క్రీడకు కోర్టులు లేకపోవడంతో విద్యార్థులు ఈ ఆటపై ఆసక్తి చూపడం లేదు. ఏళ్లుగా హాకీ క్రీడను బతికించుకునేందుకు శ్రమిస్తున్నాం. హనుమకొండ జేఎన్ఎస్‌లో హాకీ కోర్టు ఏర్పాటు చేయడంతో పాటు కోచ్‌ను నియమించేలా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చొరవచూపాలి.

- ఎం.డి. హుస్సేన్, హాకీ కోచ్, మామునూరు


కోర్టు ఏర్పాటుకు స్థలం లేదు..



హనుమకొండ జేఎన్ఎస్‌లో హాకీ కోర్టు నిర్మించేంత స్థలం లేకపోవడంతో కోర్టు ఏర్పాటుకు అంతరాయం ఏర్పడింది. కొన్నేళ్ల కిందట ఇక్కడ హాకీ కోర్టు ఉండేదని పలువురు అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు నా దృష్టికి తీసుకువచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) నగరంలో కోర్టు నిర్మాణం చేయమని ఆదేశాలు ఇస్తే హాకీ కోర్టు నిర్మించే అవకాశం ఉంటుంది.

- జి.అశోక్‌కుమార్, హనుమకొండ డీవైఎస్‌వో

హాకీ స్టిక్స్ కొనేవారు కరువయ్యారు..



గతంలో మా షాపునకు హాకీ స్టిక్స్ కొనుగోలు చేసేందుకు వందల మంది విద్యార్థులు, క్రీడాకారులు బారులు తీరేవారు. కానీ నేడు ఇతర క్రీడా సామగ్రితో పోల్చుకుంటే హాకీ స్టిక్స్ కొనుగోలు చేసేవారు రావడం లేదు. ఒకప్పుడు నెలలో 100 నుంచి 200వరకు హాకీ స్టిక్స్ అమ్మకాలు జరిపేది. నేడు యేడాదికి 500 స్టిక్స్ కూడా అమ్మలేక పోతున్నాం. హనుమకొండ నయీంనగర్‌లోని హాకీ మైదానంలో సాధన చేసే క్రీడకారులు, కొన్ని ప్రైవేటు పాఠశాలకు చెందిన క్రీడకారులు మాత్రమే హాకీ స్టిక్స్ కొనడానికి ఆసక్తి కనబర్చుతున్నారు.

- పులి అనిల్ (స్పోర్ట్స్ వేర్ నిర్వాహకుడు, హనుమకొండ)

సాదా బైనామాలకు రైట్ రైట్..

5వ పేజీ తరువాయి

రెవెన్యూ సదస్సుల్లో కూడా భారీగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి.

భూ భారతితో లైన్ క్లియర్

రైతాంగం భూహక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సమస్యలు పరిష్కారం కావటం లేదు. 2020లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు భూ హక్కులను కల్పించే పట్టాదారు పాసు పుస్తకాల చట్టం- 1971ని రద్దు చేసి కొత్తగా పాసుపుస్తకాల చట్టం-2020 ధరణిని తీసుకవచ్చింది. అయితే కొత్త చట్టం ద్వారా రైతు సమస్యలను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో సాదాబైనామాలతో పాటు అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి ధరణిలో ఎలాంటి మార్గాలను చూపించలేదు. దీంతో పాటు గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేయటంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయి. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒక్కటి సాదాబైనామా. గతంలో చాలామంది రైతులు తెల్లకాగితాలపై, రెవెన్యూ స్టాంపు పేపర్లపై భూములు క్రయవిక్రయాలు చేశారు. ఇవీ అధికారికం కాకపోవటంతో వీటికి రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఫలితంగా బ్యాంకుల్లో వీరికి రుణాలు కూడా అందటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సమస్యల పరిష్కారంపై ఫోకస్ చేసింది. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రెవెన్యూ గ్రామ సదస్సులను ప్రభుత్వం నిర్వహించింది. ఈ సదస్సుల్లో అత్యధికంగా సాదాబైనామాలపైనే దరఖాస్తులు వచ్చాయి. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు మరోసారి భూభారతి సదస్సులో దరఖాస్తులు చేశారు. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించి, సాదాబైనామాలపై మధ్యంతర స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరింది. దీంతో గత ప్రభుత్వం తీసుకవచ్చిన 112జీవో స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం తీసుకవచ్చిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కోర్టు విచారణ అనంతరం సాదాబైనామాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాతే..

కుప్పలు, తెప్పలుగా సాదాబైనామాల దరఖాస్తులు వస్తుండటంతో ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12ఏళ్ల పాటు భూమి స్వాధీనంలో ఉండి, ప్రభుత్వం నిర్దేశించినట్టుగా రాతపూర్వకంగా ఒప్పందం ఉంటే సాదా బైనామాలు చెల్లుతాయని ప్రభుత్వం ఇటీవల కోర్టుకు విన్నవించింది. దీంతో పాటు గతంలో సాదా బైనామాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 1,66,784 దరఖాస్తుల్లో ఎన్ని అర్హతలను కలిగి ఉన్నాయో కూడా అధికారులు గుర్తించనున్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో నోటీస్ బోర్డులో వివరాలను అంటించి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అన్నిరకాల పరిశీలన తరువాతే అర్హులను గుర్తించి పట్టాదారు పాస్ పుస్తకాలను అందించేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ఆస్తి తగాదాలతో హత్య చేసిన నలుగురికి జీవితఖైదు

వరంగల్ లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల తగాదాలతో వ్యక్తిని హత్య చేసిన కేసులో నేరం రుజువైనందుకు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేలు జరిమాన విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి బీవీ నిర్మాల గీతాంబ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లి గ్రామానికి చెందిన మక్కాజి రాజేష్.. తన తల్లి ప్రమీల, తమ్ముడు ప్రవీణ్, అక్క సరితలతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆ గొడవల్లో పలుమార్లు కుటుంబ సభ్యులంతా కలిసి రాజేష్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో బతుకుదెరువు కోసం వరంగల్ వచ్చి భార్యతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 2021 జూలై 6న బంధంపల్లి గ్రామంలోని పొత్తులో ఉన్న భూమి ఇంటి స్థలం విషయంలో పంచాయితీలో తేల్చుకునేందుకు వెళ్లారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో అక్కడ ఇంటి ముందు మక్కాజీ రాజేష్, తన భార్యతో కలిసి ఉండగా వంగపహాడ్ గ్రామానికి చెందిన బొక్క రాజు, తమ్ముడు మక్కాజీ ప్రవీణ్, తల్లి ప్రమీల, అక్క సరితలు వచ్చి ఆస్తిలో వాటా కావాలా..? అంటూ అందరు కలిసి రాజేష్, అతడి భార్య కళ్లలో కారం చల్లారు. ఈలోగా ప్రవీణ్ బండరాళ్లతో రాజేష్ తలపై తీవ్రంగా కొట్టాడు. బీరు సీసాతో సైతం దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అనంతరం నిందితులందరూ ఒక్కసారిగా దాడి చేసి రాజేష్‌ను కత్తితో పొడవగా తీవ్రగాయాలతో చనిపోయాడు. దీంతో రాజేష్‌ను ఇతరుల సహాయంతో భార్య శైలజ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో తన భర్త రాజేష్‌పై దాడి చేసి హత్య చేసిన మక్కాజీ ప్రవీణ్, మక్కాజీ సరిత, మక్కాజీ ప్రమీల, బొక్క రాజులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి హత్యా కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు అయినందున నిందితులకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ గోవింద్ రవికుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా, లైజన్ అధికారిగా కె.హరికృష్ణ, దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌బాబు, ఎం.సాయిరమణ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



కాజీపేట సివిల్ డిస్పెన్సరీలో సేవలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

మడికొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం కాజీపేట మండలం భట్టుపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, ఫీవర్, డ్రైడే కార్యక్రమాలను పరిశీలించారు. ప్రసూతి అనంతర సేవలు, ఉప కేంద్రం భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాజీపేట సివిల్ డిస్పెన్సరీలో అందుతున్న ఓపీ, ఫార్మసీ సేవలు, ఉద్యోగుల హాజరు పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట డాక్టర్ జయకృష్ణ, హెల్త్ విజిటర్ పద్మజ, ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ పద్మజ, సుశీల, సల్మా, జీసీడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బంధం చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీపీ

గణేశ్ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో ఈ నెల 5 న నిర్వహించే గణేశ్ నిమజ్జన ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం పరిశీలించారు. కాజీపేటలో బంధంచెరువు, హనుమకొండలోని సిద్ధేశ్వర గుండం, హసన్‌పర్తి చెరువును స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. క్రేన్లు, బారీకేడ్ల నిర్మాణం, విద్యుత్, తెప్పల ఏర్పాటు, సిబ్బంది నియామకంపై సంబంధిత అధికారులతో చర్చించారు. సీపీ వెంట సెంట్రల్ జోన్ సలీమా షేక్ సలీమా, అదనపు డీసీపీ ప్రభాకర్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు సుధాకర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

మట్టి గణపతులనూ పూజిద్దాం..

కేయూ క్యాంపస్ ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతులను పూజిద్దాం.. కాలుష్యాన్ని అరికడుదామని వడ్డెపల్లి ప్రభుత్వ అటానమస్ పింగళి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి పిలుపునిచ్చారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మొక్కల ఆకులు, కూరగాయాలతో పర్యావరణహిత వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఆయా గణపతి విగ్రహాలను వడ్డేపల్లి పరిసరాల ప్రాంతాల ప్రజలకు, విద్యార్థులకు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, బాటనీ విభాగాధిపతి డాక్టర్ డి.సునీత, అధ్యాపకులు జ్యోతిర్మయి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి

హసన్‌పర్తి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లిలో విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి చెందినట్లు మండల పశువైద్యాధికారి మాచవరం మాళవిక గురువారం తెలిపారు. మడిపల్లికి చెందిన జక్కుల సదానందంకు చెందిన గొర్రెలను బుధవారం పశువుల కాపరి ఊరు శివారులో మేపుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ ద్వారా విద్యుత్ ప్రసరించడంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడికి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని పశువుల కాపర్ల సంఘం నాయకులు కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 19 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. మిగిలిన 16 మందికి రూ.17,500 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.3,700 జరిమానా విధించామన్నారు.

8 నెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి

పట్టుకొని బంధువులకు అప్పగించిన పోలీసులు

మడికొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలోని సమస్యల వల్ల ఎనిమిది నెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని పోలీసులు పట్టుకొని అతడి భార్యకు అప్పగించిన ఘటన కాజీపేట మండలం కడిపికొండలో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన కొడవటి యువరాజ్ జనవరిలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి అతడి కోసం వెతుకుతున్నారు. ఇంట్లో నుంచి వెళ్లిన యువరాజ్ అప్పటి నుంచి శ్రీశైలం, కడప, గుంటూరు, తదితర ప్రదేశాల్లో తిరుగుతున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు చివరికి అతడు ఒంగోలు జిల్లా చీమకుర్తిలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి తీసుకువచ్చారు. గురువారం యువరాజ్‌కు ఇన్‌స్పెక్టర్ కిషన్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి అతడి భార్య విజయకు అప్పగించారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోలనుకొండ వేణు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే విలీనంతోపాటు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రైవేట్ సెక్యూరిటీ చట్టాలను అమలు చేయాలి

కేయూ క్యాంపస్ ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ప్రైవేట్ సెక్యూరిటీ చట్టం-2025ను పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం కేయూలో 102 మంది సెక్యూరిటీ సిబ్బంది ఏకపక్షంగా సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా రాగుల రమేశ్ సీఐటీయూ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కేయూ ఆడిటోరియం ఎదుట జె.రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాగుల రమేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెక్యూరిటీ గార్డులను కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. 12గంటల పాటు పనిచేయించుకుంటున్నారని అన్నారు. ఓవర్‌టైం అలెవెన్స్‌లు ఇవ్వడం లేదన్నారు. 2005 ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల చట్ట మేరకు గుర్తింపుకార్డులు, షూలు, టార్చ్‌లైట్‌తో పాటు రక్షణ పరికరాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్‌లు, కాంట్రిబ్యూషన్‌లను ఇప్పించాలని అన్నారు. యాజమాన్యాలు సెక్యూరిటీ గార్డులను ఇవ్వాల్సిన అన్ని సదుపాయాలను ఇప్పించాలని అన్నారు. ఈ సందర్భంగా కేయూలో పనిచేస్తున్న 102 మది సెక్యూరిటీ గార్డులు సీఐటీయూలో ఆధ్వర్యంలో చేరారు.

సంస్కరణల పేరిట దోపిడీకి కుట్ర

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంస్కరణల పేరిట కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లిశ్రీనివాస్‌రావుఆరోపించారు. విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం గురువారం హనుమకొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పోరాట అమరులకు వామపక్షాల నాయకులు నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 2023లో విద్యుత్ సంస్కరణల పేరిట కొత్త చట్టం తీసుకొచ్చిందన్నారు. రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతులను దోపిడీ చేయాలని చూస్తోందన్నారు. విద్యుత్ కూడా అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు రాష్ట్ర జాబితాలో ఉన్న విద్యుత్‌పై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, కరుణాకర్, మద్దెల ఎల్లేష్, ఎస్‌ఏ స్టాలిన్, బత్తిని సదానందం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, గుంటి రాజేందర్, ఎం.చుక్కయ్య, చక్రపాణి, ఉప్పలయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నవరాత్రులు ప్రారంభం

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పరిమళకాలనీలోని సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్‌లో బుధవారం గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘణంగా ప్రారంభమయ్యాయి. అపార్టుమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో విగ్రహదాతలుగా అడ్లూరి నర్సింహమూర్తి, ఆయన కుమారుడు అడ్లూరు దినేశ్‌క్రాంతి చక్ర వ్యవహరించారు. డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ ఎస్.రాజేశ్వర్ శాస్త్రీ అర్చకత్వంలో గణపతి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన కన్నుల పండువగా జరిగింది.

దినేశ్ క్రాంతి చక్ర కుటుంబసభ్యులు తొలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి తమ్మెర కమలాకర్, కోశాధికారి దామెరుప్పుల దయాకర్‌తో పాటు అపార్టుమెంట్ సభ్యులు, ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


● హనుమకొండ టౌన్: ప్రజలందరి విఘ్నాలను విఘ్నేశ్వరుడు తొలగించాలని, సకల జనులు సంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కాగా, హనుమకొండ టౌన్: టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మహ్మద్ ముస్తాక్ నెహాల్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా గణపతి మండపాలకు గురువారం ఉచితంగా క్యారం బోర్డులను పంపిణీ చేశారు. డివిజన్‌కు రెండు చొప్పున అందించినట్లు తెలిపారు.




బీఆర్ఎస్ కార్యాలయంలో వినాయకుడి పూజలో పాల్గొన్న దాస్యం వినయ్ భాస్కర్ దంపతులు

ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు, సోషల్‌మీడియా నాయకుడు రోషన్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్ కోరారు. న్యూశాయంపేట సర్కిల్‌లో వినాయక చవితిని పురస్కరించుకుని బుధవారం రాజుయాదవ్ స్థానికులకు 300 మట్టి వినాయకులతో పాటు లడ్డూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులు డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడు



మణికంఠ గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో కొలువుదీరిన గణనాథుడు

● మడికొండ: మడికొండలోని వాడవాడలో గణనాథులు కొలువుదీరారు. బుధ, గురువారాల్లో గణపతి మండపాల్లో గణేషుడికి భక్తులు ఘనంగా పూజలు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సైలు పెగడ రాజ్‌కుమార్, రామ్మోహన్, పోలీసులు గణపతి మండపాలను సందర్శించి వివరాలు సేకరించారు. నిర్వాహకులకు పలు జాగ్రత్తలు సూచించారు. మడికొండ మణికంఠ గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు.



హనుమాన్‌నగర్ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో కొలువుతీరిన గణనాథుడు

దాసు సురేష్ కుటుంబానికి పలువురి పరామర్శ

హసన్‌పర్తి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తండ్రి రఘురాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఎర్రగట్టుగుట్టలోని వారి స్వగృహంలో దాసు సురేష్ కుటుంబాన్ని గురువారం పలువురు బీసీ నాయకులు, జర్నలిస్టు నాయకులు పరామర్శించారు. వరంగల్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, గౌడ సంఘం రాజ్యాధికార సమితి నాయకులు గంటి వీరేందర్‌గౌడ్, మంథని ఆర్టీసీ డీఎం రవి యాదవ్, సోమిశెట్టి హర్షవర్ధన్ రావు, భారత బచావో నాయకుడు ప్రవీణ్‌కుమార్, సురేష్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

నెలాఖరులోగా వసతులు సమకూర్చాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- జేఎన్ఎస్‌లో తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా జేఎన్ఎస్‌లో స్పోర్ట్స్ క్రీడాకారులకు వసతులు ఏర్పాటు చేయాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ మైదానంలో స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ హాస్టల్ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను, అక్కడి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, ఔట్‌డోర్, ఇండోర్ క్రీడా మైదానాలను పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మతులు, కావాల్సిన సదుపాయాలు, విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఈ నెల 31 వరకు ఏర్పాటు చేయాలని అక్కడి అధికారులకు చెప్పారు. అక్కడి క్రీడాభివృద్ధి అధికారి అశోక్‌ను ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న మౌళిక సదుపాయాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జేఎన్ఎస్‌లో మరమ్మతులు వెంటనే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సురేష్, నరేందర్‌రెడ్డితో పాటు కోచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ 58వ డివిజన్ స్నేహ నగర్‌లో రూ.5లక్షలతో చేపట్టే రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో అత్యవసర ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 58వడివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహితరాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చిన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు కరాబు రాజేశ్వర్‌రావు, ఫిషర్‌మన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య, 58వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రవీందర్ (జేకే), జనగాం శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపెల్లి మేరీ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల సందర్శన

హనుమకొండ 57వ డివిజన్ గోకుల్‌నగర్, అశోక కాలనీ ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి గురువారం సందర్శించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డివిజన్‌లోని గోకుల్ నగర్, అశోక కాలనీ, సమ్మయ్య నగర్, ఇంజనీర్స్‌కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరద ప్రవాహానికి అడ్డుగా ఉండే ప్రాంతాలను గుర్తించి పరిష్కార మార్గాలను చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సతీష్ యాదవ్, బంక చంద్రశేఖర్‌తో, మున్సిపల్ డీఈ సారంగం, డబ్ల్యూఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహ నగర్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



పెన్షన్ విద్రోహ దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ విమర్శించారు. గురువారం కలెక్టరేట్‌లోని టీజీఓ భవన్‌లో జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అక్టోబర్12న తేదీన లక్ష మంది ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం పెన్షన్ విద్రోహ దినం పోస్టర్ ఆవిష్కరించి, ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిష్కారం కోసం జంగ్ సైరన్ మోగిస్తామన్నారు. గెజిటెడ్ అధికారుల నాయకులు అన్నమనేని జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారరంలో ప్రభుత్వం విపరీతమైన కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరుపుతున్నప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప పరిష్కరించడం లేదన్నారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జేఏసీ నాయకులు పెండెం రాజు, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, ఆకవరపు శ్రీనివాస్ కుమార్, బైరి సోమయ్యతోపాటు పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

డీజేలు పెడితే కఠిన చర్యలు

మడికొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మడికొండ పోలీస్ స్టేషన్‌లో గురువారం మడికొండ, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన డీజే సౌండ్స్ నిర్వాహకులకు ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా డీజేలు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వారిని కాజీపేట తహసీల్దార్ బావుసింగ్ ఎదుట బైండోవర్ చేశారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్‌తో కలిసి కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం పరిశీలన



కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. గురువారం కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం వద్ద జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాల మార్ట్ ఏర్పాటు చేసేందుకు కావలసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళలకు ఎన్నో ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాలను ఉత్పత్తి రంగంలో ప్రోత్సహించేందుకు వరంగల్ ట్రైసిటీస్‌లో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వరంగల్ సర్కిల్‌కు సంబంధించి కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఐదు గదులను కేటాయించి మరమ్మతు చేయిస్తున్నట్టు చెప్పారు. మహిళా మార్ట్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని అక్కడి సిబ్బందిని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు ఖలీల్, ప్రశాంత, ఇన్‌చార్జి ఈఈ సంతోష్‌బాబు, సూపరింటెండెంట్ హబీబ్, ఆర్‌వో షహజాది బేగం, టీపీఎస్‌లు అనీల్, శ్రీకాంత్, ఏఈ హబీబ్ పాల్గొన్నారు.

నగరంలో శిథిల భవనాలను గుర్తించాలి

వరంగల్ నగరంలో కూలడానికి సిద్ధంగా ఉండి శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ నగరంలో పలుచోట్ల శిథిలావస్థలో ఉన్న భవనాలను మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను ఎన్ని గుర్తించారు? ఇంకా ఎన్ని భవనాలు కట్టడాలు పాతబడి ఉన్నాయో గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. నిబంధనలు ఖాతరు చేయని వారిని గుర్తించి మౌఖిక ఆదేశాలు జారీచేయాలని, తర్వాత మునిసిపల్ సిబ్బందితో కూల్చివేతలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

ఇటీవల భారీగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు నష్టపోకుండా ఉండేందుకు మాన్‌సూన్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం హనుమకొండ పరిధిలోని జవహర్ కాలనీ, గోపాల్‌పూర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలో పర్యటించి చేపట్టవలసిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో మాన్‌సూన్ బృందాలు 24/7 అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డుల వారిగా నియమించిన శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం ● 29 ఆగస్టు 2025

చింతన



ఏదైనా కథ విన్నప్పుడు... ఆ కథలోని విశేషాలను గ్రహించడం, మంచి విషయాలను పాటించడం ప్రధానం. గౌరీ శంకరుల కథలో... అర్ధనారీశ్వర తత్త్వాన్ని లోతుగా తెలుసుకోవాలి. ఆ ఆది దంపతుల అన్యోన్యతను అర్థం చేసుకోవడం, ఆ విలువలను అనుసరించడమే ఆనందకరమైన గృహస్థ జీవితానికి సోపానం.

అన్యోన్యతకు అర్థం...

అర్ధ నారీశ్వర తత్త్వం

హిమవంతుని పుత్రిక అయిన హైమవతి (శైలజ) తండ్రి ఆదేశం మేరకు శంకరుడికి పరిచర్య చెయ్యడానికి వచ్చింది. అది నిర్జనమైన వనం. వారిద్దరూ యవ్వనంలో, ఏకాంతంలో ఉన్నారు. కానీ వారి మనసుల్లో శృంగారపరమైన భావన లేదు. చివరకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు శంకరుడి మీద మన్మథుడు బాణం వేయాల్సి వచ్చింది. శారీరక సౌందర్యం లాంటి వాటికే ప్రాధాన్యం ఇస్తున్న నేటి కాలపు పద్ధతులకు ఇది విరుద్ధం. అంటే శారీరక సౌందర్య దృష్టితో చూసినంత కాలం మానసిక ప్రేమ అనేది ఉండదని భావం. ఈ భేదాన్ని గుర్తించగలిగితే దాంపత్యం అన్యోన్యంగా ఉంటుంది. మరో విషయం ఏమిటంటే... మన్మథుణ్ణి శంకరుడు తన మూడో కంటితో భస్మం చేయడం చూశాక కూడా... శైలజ తనంతట తానుగా నిర్ణయం తీసుకోలేదు. తల్లిదండ్రులకు చెప్పింది. తద్వారా ఆమె మానసికమైన ప్రేమ ఆమె తల్లితండ్రులకు అర్థమయింది. ఒక నిర్జన వన ప్రదేశానికి, ఏకాంతంలో ఉన్న పురుషుడి సేవ కోసం హిమవంతుడు తన పుత్రికను పంపాడంటే... తన కుమార్తె ప్రవర్తన, శీల సంపద మీద ఆయనకు ఎంత నమ్మకం ఉందో గమనించాలి.

భిన్నత్వంలో ఏకత్వం...

వివాహానికి ముందు ప్రేమించుకున్న కాలంలో... చెప్పలేనంత అన్యోన్యంగా కనిపించే జంటల సంసార సౌధం కొన్నాళ్ళకే బీటలు వారడం నేడు చూస్తున్నాం. ఇలాంటి సందర్భంలోనే గౌరీ శంకరుల కథను శ్రద్ధగా ఒంటపట్టించుకోవాలి. గౌరీ శంకరులు... అర్ధనారీశ్వర రూపంలో ఉంటారు. కుడివైపున శంకరుని రూపం, ఎడమవైపు గౌరీ రూపం. పూర్వం ఈ అర్ధనారీశ్వర చిత్రాన్ని దేవాలయం గోడల మీదో, ప్రధాన స్తంభం మీదో... శిల్ప రూపంలోనో, చిత్ర రూపంలోనో కనిపించేలా ఉంచేవారు. "కుడి అర చేత్తో కుడి కంటిని మూసి గౌరీదేవిని, ఎడమ అరచేత్తో ఎడమకంటిని మూసి శివయ్యను చూడు" అని తమ పిల్లలకు తల్లిదండ్రులు చెప్పేవారు, ఆ విధంగా చేయించేవారు. ఎందుకని? ఏ సంస్కారమూ లేని బిరుసైన జేగురు రంగు శిరోజాలు... అవి కూడా మోకాళ్ళు దాటేంత పొడవున శివుడికి ఉంటాయి. సంపెగ, అశోక, సురపొన్న, సౌగంధిక (చంపాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా) పుష్పాలతో చక్కగా అలంకృతమైన కొప్పు ఆమెకు ఉంటుంది. ఆగ్రహం వచ్చినా, అనుగ్రహాన్ని కురిపిస్తున్నా ఏ మార్పూ కనిపించని అష్టమి చంద్రుడిలా ఆమె నుదురు ఉంటే... ఏమాత్రం తేడా కనిపించినా ఆయన నుదుటి భ్రుకుటి ముడిపడిపోతూ ఉంటుంది. ఆయన కన్ను రుద్ర రూపంలో వెలుగుతూ ఉంటే ఆమె నేత్రం నీటి మడుగులో కదలాడే చేపలా... ఇంకా ఇంకా చూడాలనిపించేలా ఉంటుంది. మరో చిత్రం... ఆమె నయనం పరమ మనోహరంగా, ప్రశాంతంగా, అందరికీ ఉండేలా అడ్డంగా ఉంటే... ఆయనకు నుదుటి మధ్యలో మరో నేత్రం ఛటచ్ఛటలాడే అగ్నితో ఉండడమే కాదు, నిలువుగా ఉంటుంది. ఇలా... ఇద్దరూ ఒకే తీరుగా ఉండనే ఉండరు. కానీ భిన్నమైన లక్షణాలు కలిగి కూడా కలిసే కనిపిస్తారు. మానసికంగా కూడా ఐక్య భావంతోనే ఉంటారు.

ఏం నేర్చుకోవాలి?

ప్రతి వ్యక్తికి తనవైన కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. వాటిని ఎదుటివారు గౌరవించాలి. "నేను మంచి శిరోజాలంకరణతో ఉంటాను కదా! నీవూ అలాగే ఉండు! నా నుదురు ప్రశాంతంగా ఉంటుంది కదా! నీవెందుకు అలా ఉండవు? నేను చక్కటి పట్టు వస్త్రాలను ధరిస్తాను కదా! నీవెందుకు ఆ ఏనుగు, పులి చర్మాలు ధరిస్తావు? నా మాదిరిగా ఉండు!" అని ఆమె ప్రాధేయపూర్వకంగా కానీ, గద్దించి కానీ ఆయనను అడగలేదు. అలాగే ఆయన కూడా "నాలా నీవు ఉండవచ్చు కదా?" అని అడగలేదు. అంటే... దంపతులు తమ వివాహానికి ముందు విడివిడిగా ఉన్న స్థిరాభిప్రాయాలను పరస్పరం గౌరవించుకుంటూ ఉండాల్సిందే. అవి పుట్టుక నుంచి వచ్చినవి. ఆ లక్షణాలకు వారు అలవాటు పడి ఉంటారు కాబట్టి... వాటిని మార్చుకోవాలని పట్టుపట్టినా, నిర్బంధించినా... వివాహబంధం క్రమంగా సడలిపోతుంది. అందుకని... దాంపత్యంలో సర్దుకుపోవడం తప్పనిసరి. ఈ దశలో ఏ మూడో వ్యక్తో (వారివారి తల్లితండ్రులు, స్నేహితులు లేదా ఇరుగుపొరుగువారు) జోక్యం చేసుకుంటే... ఆ సంసారంలో అన్యోన్యత ఉండదు. అందుకే గౌరీ శంకరులు తమ మధ్య ఎవరూ చొరబడే వీలు లేకుండా నిలువునా కలిసిపోయి... అర్ధనారీశ్వరులుగా ఉంటారు. ఇలాంటి విశేషాలను అర్థం చేసుకున్నప్పుడు... అవి మన జీవితాలు సక్రమంగా సాగేందుకు ఉపకరిస్తాయి.

● డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

విశ్వకర్మలుగా పేర్కొనే స్థపతి, వర్ధకి, తక్షకుడు, సూత్రగ్రాహి... పవిత్రమైన యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించడానికి హోమ కుండాలను, యజ్ఞ మండపాలను, హోమానికి కావలసిన యజ్ఞపాత్రలు, స్రుక్, స్రువం లాంటివి తయారుచేసి ఇస్తారు. ఆలయ ఆరాధనలో భాగమైన పూజా పాత్రలు, అభిషేక పాత్రలు, గంటలు, దేవుణ్ణి ఊరేగించే పల్లకి, వాహనాలు, రథాలు తదితరాలు తయారు చేసేది వీరే. వీరి పరంపర చాలా గొప్పది. వారి తపోబలంతో నిర్మితమైనవే... నేటికీ పూజలందుకొంటున్న ప్రాచీన ఆలయాలు.

ఆలయం ఎక్కడ నిర్మించాలి?

ఆలయ నిర్మాణాల విషయానికి వస్తే... నిర్దిష్టమైన (శాస్త్రాల్లో పేర్కొన్న) కొలతలతో నిర్మితమైన ఆలయం మాత్రమే శుభాలను ఇస్తుందని, ఆ ప్రకారం లేకపోతే అంతులేని ఆపదలు తెస్తుందని, దేశ ప్రజలకు అపకారం కలుగజేస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఎందుకంటే... సలక్షణంగా కట్టిన ఆలయమే దేవునికి ఆవాసం అవుతుందని 'విశ్వకర్మీయం' గ్రంథం వెల్లడిస్తోంది. అందులో ప్రతిష్ఠించే విగ్రహాన్ని స్థపతి పర్యవేక్షణలోనే తయారు చేయించాలి. కొలతలన్నీ సక్రమంగా ఉండి, రూపలావణ్యాలు కలిగిన విగ్రహాలలోనే దేవుడు కొలువై ఉంటాడని ఆగమాలు చెబుతున్నాయి. 'మానవ నిర్మితే బింబే స్వయం ఆభాతి దైవతం... నిర్దీతమైన కొలతలతో నిర్మించిన విగ్రహాలలో భగవంతుడు స్వయం వ్యక్తమవుతాడు' అని 'మకుటాగమం' చెబుతోంది. అందుకే స్థపతి లేకుండా దేవాలయ నిర్మాణాలలో ఏ కార్యక్రమం జరగదు. శంఖుస్థాపన నుంచి మహా కుంభాభిషేకం వరకూ స్థపతి పర్యవేక్షణలోనే జరగాలి.

ఆలయాలను ఎలాంటి ప్రదేశాలలో నిర్మించాలి? దీని గురించి శిల్ప, ఆగమ గ్రంథాలు అనేక ప్రదేశాలను నిర్దేశించాయి. వాటి ప్రకారం... భగవంతుడికి ప్రీతికరమైన ప్రదేశాలైన ఉద్యానవనాలు, నదీ తీరాలు, నదీ సంగమ ప్రదేశాలు, పర్వతాలు, సిద్ధులు తపస్సు ఆచరించిన ప్రదేశాలు తదితర ప్రకృతి రమణీయ ప్రదేశాలలో దేవాలయాలను నిర్మించాలి. అలాంటి ప్రదేశాల్లో దేవాలయాలను నిర్మించడం వల్ల... ఆ ప్రాంతం సౌందర్యం, ప్రకృతి రమణీయత వల్ల మానవునిలో మానసిక ప్రశాంతత పెరుగుతుంది. దైవం మీద మనస్సు లగ్నం అవుతుంది. అద్వితీయమైన, అలౌకికమైన ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుంది.

నిర్మించిన ప్రదేశాన్ని బట్టి ఆలయం ఉత్తమం అవుతుందా? ఈ ప్రశ్నకు 'శిల్ప సంగ్రహం' గ్రంథంలో సమాధానం దొరుకుతుంది.

ఉత్తమం పర్వతాగ్రేషు మధ్యమం వనరాజిషు

అధమంతు నదీతీరే గ్రామాదీష్వధమాధమమ్

భావం: పర్వతం పైభాగంలో నిర్మించిన ఆలయాలు ఉత్తమమైనవి. అడవులలో, వనాలలో నిర్మించినవి మధ్యమమైనవి. నదుల ఒడ్డున ఉన్నవి అధమమైనవి (సామాన్యమైనవి). గ్రామాల మధ్య ఉన్నవి అన్నిటికన్నా అధమమైనవి.

● దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

తెలుసుకుందాం




గీతాసారం


అవగాహన, కరుణ

ఆత్మజ్ఞానం పొందే మార్గంలో మనకు ఎదురయ్యే అనేక అడ్డంకులను దాటడానికి, మూసి ఉన్న ద్వారాలను తెరవడానికి కావలసిన అమోఘమైన తాళం చెవులన్నీ భగవద్గీతలో ఉన్నాయి. అటువంటి కీలకమైన ఉపాయాల్లో ఒకటి... మిమ్మల్ని ఇతరుల్లో, ఇతరులను మీలో చూసుకోవడం. అందరిలో ఉన్నది తానేనని శ్రీకృష్ణుడు గుర్తు చేస్తున్నాడు. తాను నిరాకారుణ్ణని సూచిస్తున్నాడు. అన్ని జీవులను ఒకేలా చూడగలిగే స్థాయికి ఎదగాలని చెబుతున్నాడు. ఇంద్రియాలు మనకు అందించిన సమాచారం ఆధారంగా... మనం ఎదుర్కొంటున్న పరిస్థితులను సురక్షితమైనవిగా, ఆహ్లాదకరమైనవిగా లేదా హానికరమైనవిగా, బాధాకరమైనవిగా మన మనస్సు నిర్ధారిస్తుంది. ఎదురుకాబోయే ప్రమాదాల నుంచి మనల్ని రక్షించడానికి ఇది ఎంతో అవసరం. ఇతర సాంకేతిక పరిజ్ఞానాల మాదిరిగా మన మనస్సు కూడా రెండువైపులా పదునున్న కత్తి లాంటిది. అది మన మీద పెత్తనం చేయడం కోసం తన పరిధుల్ని మీరుతుంది. అదే అహంకారానికి జన్మస్థానం.

మనస్సును ఆధీనంలో ఉంచుకొని... ఈ విభజనలను తగ్గిస్తే కలయిక, ఐక్యత కలుగుతాయని భగవద్గీత చెబుతోంది. మనం ఇటువంటి కీలకమైన ఉపాయాలను ఉపయోగించినప్పుడు... ఇతరుల పట్ల కరుణను, మన గురించిన అవగాహనను పెంచుకుంటాం. ఏ కారణం చేతనైనా మనకు శత్రువుగా మారిన వ్యక్తిలో సైతం భగవంతుణ్ణి చూడడం మొదలుపెట్టడం ఈ సూత్రాన్ని అనుభవంలోకి తీసుకురావడానికి మంచి మార్గం. వారితో మనకు అనేక బాధాకరమైన జ్ఞాపకాలు, భావనలు ముడిపడి ఉంటాయి. కాబట్టి ఇది కచ్చితంగా కష్టమైనదే. కానీ క్రమంగా... కాలంతో పాటు ఆ బాధంతా కరిగిపోయి, సంతోషానికి దారితీస్తుంది. నిజానికి మన అందరికీ ఇలాంటి పరిస్థితులు ఎదురై ఉంటాయి. కానీ అవగాహనతో గీతా బోధను అభ్యాసంలో పెట్టవలసిన అవసరం ఉంది. తన పట్ల అవగాహన, ఇతరుల పట్ల కరుణ అనేవి ప్రధానం. భగవద్గీత చెప్పిన మార్గంలో ప్రయాణిస్తూ 'అంతరాత్మ' అనే తీరాన్ని చేరడానికి దోహదం చేస్తాయి.

మన మనస్సు రెండువైపులా పదునున్న కత్తి లాంటిది. అది మన మీద పెత్తనం చేయడం కోసం తన పరిధుల్ని మీరుతుంది. అదే అహంకారానికి జన్మస్థానం.





కె.శివప్రసాద్


ఆఖరి సందేశం...

జెన్ కథ

ఒక జెన్ గురువుకు దేశమంతటా ఎంతో మంది శిష్యులు ఉండేవారు. ఆయన ఉపదేశాలకోసం వారు నిరంతరం ఎదురుచూస్తూ ఉండేవారు. ఒకరోజు ఉదయం ఆయన "ఇవాళ సాయంత్రం తనువు చాలిస్తాను. మన వాళ్ళందరికీ తెలియజెయ్యండి" అని తన శిష్యులకు చెప్పాడు. ఈ సమాచారం దావానలంలా నలుమూలలకూ పాకింది. చివరిసారి గురువును సందర్శించడానికి ఎక్కడెక్కడి నుంచో శిష్యులందరూ అక్కడికి వచ్చిచేరారు.

ముఖ్యుడైన ఒక శిష్యుడు మాత్రం గురువును వదలి దూరంగా ఉన్న సంతకు బయలుదేరాడు. 'వేరే ప్రదేశాల నుంచి ఎందరో వస్తూ ఉంటే... ఈ ముఖ్య శిష్యుడు వెళ్ళిపోవడం ఏమిటి?' అని అందరూ ఆశ్చర్యపోయారు. దారిలో అతనికి ఎదురుపడిన కొందరు "గురువుగారి చివరి క్షణాల్లో ఆయన దగ్గర ఉండకుండా ఎక్కడికి వెళ్తున్నావు?" అని ప్రశ్నించారు.

"నేను గురువుగారి దగ్గర ఎన్నో సంవత్సరాలుగా ఉన్నాను. ఆయనకు చాలా ఇష్టమైన ఒక ఆహార పదార్థం ఉంది. దాన్ని ఆయనకు తెచ్చి ఇద్దామని వెళుతున్నాను" అంటూ ఆ శిష్యుడు పరుగులు తీశాడు.




అక్కడ కుటీరంలో గురువుకు చివరి క్షణాలు దగ్గర పడుతున్నకొద్దీ శిష్యగణంలో ఉత్కంఠ పెరిగిపోతోంది. గురువు కళ్ళు మూసుకొని పడుకున్నాడు. అప్పుడప్పుడు కళ్ళు తెరచి, తన ప్రియశిష్యుడికోసం చూసి, అతను లేడని గ్రహించి, మళ్ళీ కళ్ళు మూసుకుంటున్నాడు. కొంతసేపటికి ఆ శిష్యుడు వచ్చి గురువు ముందు నిలబడ్డాడు. గురువు కళ్ళు తెరచి "వచ్చావా నాయనా! నాకు ఇష్టమైనది తెచ్చావా?" అని అడిగాడు.

అందరూ చాలా ఆశ్చర్యపోయారు. 'గురువుకు ఏదీ చెప్పకుండానే ఆ శిష్యుడు సంతకు వెళ్ళాడు. అతను తనకు ఇష్టమైన ఆహార పదార్థాన్ని తీసుకురావడానికి వెళ్ళాడని గురువుకి ఎలా తెలుసు?' అని గుసగుసలాడుకున్నారు. ఇంతలో ఆ శిష్యుడు తన చేతిలోని పదార్థాన్ని ఇవ్వబోతే... గురువు తన రెండు చేతులూ చాపి దాన్ని అందుకున్నాడు. "ఈ చివరి క్షణాల్లో కూడా మీ చేతులు వణకడం లేదే?" అని చుట్టూ ఉన్న ఇతర శిష్యులు అడిగారు. "నాకు చావంటే భయం ఉంటే కదా... చేతులు వణికేది" అన్నాడు గురువు. తన చేతుల్లోని ఆ పదార్థాన్ని తినేశాడు. అప్పటివరకూ ఓపికగా నిలబడిన శిష్యులు "గురువుగారూ! మీ ఆఖరి సందేశం కోసం ఎదురుచూస్తున్నాం. మీరు మాకు ఇచ్చే చివరి సందేశం ఏమిటి?" అని అడిగారు. గురువు నవ్వి "ఈ పదార్థం చాలా బాగుంది" అని చెబుతూ కన్నుమూశాడు.

ఈ కథను ఓషో ఒక సందర్భంలో వివరిస్తూ "ఆ గురువు ముంచుకొస్తున్న మృత్యువు గురించి చింతించలేదు. జీవించి ఉన్న చివరి క్షణాన్ని ఎలా ఆనందంగా గడపవచ్చో చేసి చూపించాడు. అదే అతను శిష్యులకు ఇచ్చిన ఆఖరి సందేశం" అని చెప్పారు.

● రాచమడుగు శ్రీనివాసులు



బుద్ధ దేవుని ధర్మ బోధ

వ్యాసపీఠం

బౌద్ధ సాహిత్యంలో జాతక కథలకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ కథలలో బౌద్ధ ధర్మ సూత్రాలు... నైతికతను, తాత్త్వికతను సులభమైన భాషలో అందిస్తాయి. బౌద్ధం ప్రపంచవ్యాప్తం కావడం వెనుక ఈ కథల పాత్ర ఎంతో ఉంది. బౌద్ధ గ్రంథమైన 'ఖుద్దక నికాయం'లో 547 జాతక కథలు మనకు లభిస్తాయి. 'పాళీ' భాషను నేర్చుకొని, ఆ కథలను అధ్యయనం చేసిన ప్రముఖ రచయిత బొర్రా గోవర్ధన్... వీటిలో 275 కథలను- తనదైన శైలిలో తెలుగువారికి నివేదించారు. 'ఆంధ్రజ్యోతి'తో పాటు వివిధ పత్రికల్లో ప్రచురితమైన ఆ కథలను 'ధర్మతేజం', 'ధర్మదీపం', 'ధర్మవీణ' అనే మూడు సంపుటాలుగా ప్రచురించారు. ఈ కథలన్నీ బౌద్ధ సంప్రదాయంలో విస్తృత ప్రచారంలో ఉన్నవే! వాటిని గోవర్ధన్ అందరికీ అర్థమయ్యేలా, సరళమైన రీతిలో అందించారు. ప్రాచీనమైన ఆ కథల్లోని నీతిని ఆధునిక జీవితానికి అన్వయించి వివరించడంలో రచయిత ప్రతిభ, సునిశిత పరిశీలన కనిపిస్తుంది. బౌద్ధం పట్ల ఆసక్తి, అనురక్తి ఉన్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాలివి.

ధర్మతేజం, ధర్మదీపం, ధర్మవీణ

రచయిత: బొర్రా గోవర్ధన్
ప్రచురణ: లతా రాజా ఫౌండేషన్
ప్రతులకు: 9390600157


దైవమార్గం

విలాప ప్రవక్త

దేవుడు కంటికి కనిపించకపోవచ్చు. ప్రత్యక్షంగా కాకపోయినా ఏదో ఒక రూపంలో చేయాల్సిన సాయం చేస్తాడు. దారి తప్పిన ప్రజలను సన్మార్గంలో నడిపించడానికి కొందరు వ్యక్తులను ఆయన ఎంచుకుంటాడు. వారిని ప్రజల మధ్యకు పంపుతాడు. వారే ప్రవక్తలు. అటువంటి ప్రవక్తలలో యిర్మియా ఒకరు.

'నేను ఎందుకూ పనికిరాను' అనే భావనలో ఉన్న యిర్మియాను దేవుడు తన పరిచర్యకు ఎంపిక చేసుకున్నాడు. "నీవు నావాడవు. నీకు భయం లేదు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే నిన్ను పేరు పెట్టి పిలువగలిగిన వాడిని. నీ దేవుణ్ణి" అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. దేవుని సేవకే అంకితమైన కుటుంబానికి చెందినవాడు యిర్మియా. ఆయనది బన్యామీను దేశం. అప్పటికే ఇశ్రాయిల్ దేశాన్ని బాబిలోనియన్లు ఆక్రమించేశారు. "మీ దేశం మీకు తిరిగి వచ్చేలా చేస్తాను" అని ఇశ్రాయేలీయులకు దేవుడు వాగ్దానం చేశాడు. ఆ మాట నెరవేరడం కోసం... అక్కడి ప్రజలు తన ఆజ్ఞలను అనుసరించి నడుచుకొనేలా చేయాలని అనుకున్నాడు. అందుకు మధ్యవర్తిగా యిర్మియాను వారి దగ్గరకు పంపించాడు. ఇది క్రీస్తుపూర్వం 700 నాటి సంగతి.

దైవాదేశాన్ని అందుకున్న యిర్మియా... ఇశ్రాయేలీయులను కలుసుకున్నాడు. దుష్కార్యాలను, విగ్రహారాధనను మానుకోవాలని హితవు చెప్పాడు. రాబోయే విపత్తుల గురించి సూచించి హెచ్చరించాడు. కానీ ఇశ్రాయేలీయులు ఆయన మాటలు పట్టించుకోలేదు. విగ్రహాలను ఆరాధించడానికే ఇష్టపడ్డారు. వ్యక్తుల చెడు నడతను బట్టి వారిని యెహోవా శిక్షిస్తాడని యిర్మియా చెప్పినప్పుడు... వారు నవ్వి, ఆయనపై రాళ్ళు



రువ్వారు. హింసించారు. 'యిర్మియా మనకు వ్యతిరేకంగా మాట్లాడాడు కాబట్టి అతణ్ణి చంపాలి' అని నిర్ణయించుకున్నారు. కానీ యిర్మియా ఎలాంటి జంకూ లేకుండా... దేవుని ఆదేశాన్ని అనుసరిస్తూ ముందుకు సాగిపోయాడు. ఇశ్రాయేలీయులు తమ చెడు మార్గాలను మార్చుకోకపోవడంతో... దుర్దశవైపు వెళ్తున్న ఆ ప్రజల కోసం ఆయన విలపించాడు. అందుకే ఆయనను 'విలాప ప్రవక్త' అని పిలుస్తారు. పెద్దల మాటను అనుసరించి, వారు అందించిన నైతిక విలువలను పాటించకపోతే వినాశనం తథ్యం. యిర్మియా చెప్పిన మంచిని తిరస్కరించిన ఆ ప్రజలు... పర రాజ పాలనకు దాసులై, వినాశనాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

● డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

సందేశం

శ్రేయస్సు, శుభాల కోసం...

మానవ జీవితం అంటేనే అనేక సంఘటనల సమాహారం. ఒక్కోసారి శుభాలు జరుగుతాయి. అశుభాలు కూడా చోటు చేసుకుంటూ ఉంటాయి. ఎటువంటి చెడు లేకుండా జీవితం సజావుగా సాగాలని దేవుణ్ణి ప్రార్థించాలి. దానికోసం 'ఇస్తిఖారా' చేయాలని పెద్దలు నిర్దేశించారు. 'ఇస్తిఖారా' అంటే... 'శ్రేయస్సును, శుభాలను, మేలును అర్థించడం' అని అర్థం. ఉద్యోగం, వ్యాపారం, వివాహం, ప్రయాణం... ఇలా అన్ని విషయాల్లో ఇస్తిఖారా చేస్తూ ఉండాలి. అయితే మన కోరిక ధర్మసమ్మతమై ఉండాలి. ఉదాహరణకు... ఒక వ్యక్తి తనకు మంచి ఉద్యోగం దొరకాలని ఇస్తిఖారా చేశాడు. అతనికి ఉద్యోగం వచ్చింది. కానీ దాన్ని దైవం తనకు అనుగ్రహించిన మహా ప్రసాదంగా సంతృప్తి చెందడు. ఆ ఉద్యోగం కష్టంగా ఉందని మనసులో మథనపడుతూ ఉంటాడు. కొన్నాళ్ళకు పదోన్నతులతో పెద్ద స్థాయికి చేరుకుంటాడు. అప్పుడు అతను తృప్తి పడవచ్చు. కానీ మొదట్లో కష్టపడకుండా ఆ స్థితికి రాలేడు కదా! దైవానికి ఎవరికి ఏ సమయంలో ఏ విధంగా సాయం అందించాలో తెలుసు. కానీ మనిషికి సహనం ఉండదు. తనకు మేలు జరిగితే ఆనందిస్తాడు. లేకుంటే దేవుణ్ణి నిందిస్తాడు. ఇది సాధారణమైన మానవ స్వభావం. అలాంటి వైఖరిని విడిచిపెట్టి... అంతా దైవ నిర్ణయమేనని భావించినవారే ఆనందంగా ఉంటారు.

"ఒక పని చెయ్యాల్సి వస్తుంది. అది మనకు ఎంత మేలు చేస్తుందనేది స్పష్టంగా తెలీదు. అప్పుడు తప్పనిసరిగా ఇస్తిఖారా పాటించాలి. దీనికోసం ముందుగా రెండు విడతలు నఫిల్ నమాజ్ చేయాలి. తరువాత ఇస్తిఖారా 'దుఆ' (ప్రార్థన) పఠించాలి. ఆ తరువాత మన హృదయం ఎటువైపు ఆకర్షితం అవుతుందో... దాన్నే దైవ నిర్ణయంగా భావించి అనుసరించాలి. ఇస్తిఖారా చేసే వ్యక్తి ఎన్నటికీ విఫలం కాడు. ప్రతి పని చేసే ముందు దైవనామంతో దాన్ని ప్రారంభిస్తే... ఆ కార్యం తప్పకుండా విజయవంతం అవుతుంది" అని ఇస్లాం ధర్మం చెబుతోంది. "దైవ ప్రవక్త మహమ్మద్ మాకు ఏ విధంగానైతే ఖుర్ఆన్ బోధించేవారో... అదే విధంగా ప్రతి పనిలో 'ఇస్తిఖారా' ప్రార్థన చేయడం గురించి కూడా చెప్పేవారు. "మీలో ఎవరైనా ఏదైనా ముఖ్యమైన విషయం గురించి సందిగ్ధంలో ఉంటే... వారు రెండు విడతలు నఫిల్ నమాజ్ చేసి తరువాత ప్రార్థన చేయాలి" అని వివరించేవారు. సరైన నిర్ణయం తీసుకోలేని సమయాల్లో... దేవునిపైనే భారం వేసి, నిర్ణయాన్ని ఆయనకే వదిలిపెడితే... పరిష్కారమార్గాన్ని కచ్చితంగా నిర్దేశిస్తాడు" అని మహనీయుడైన హజ్రత్ జాబిర్ స్పష్టం చేశారు.



● మహమ్మద్ వహీదుద్దీన్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సంప్రదాయ లుక్‌లో శంకర వరప్రసాద్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకొంది. పట్టుపంచె, కండువా ధరించి పడవపై స్టైలిష్ లుక్‌తో చిరంజీవి అలరించారు. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి

విడుదల వాయిదా



బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2'. గతంలో వీరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ముందు ప్రకటించిన విధంగా సెప్టెంబర్ 25న 'అఖండ 2' ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. 'ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని అందించేందుకు వీఎఫ్ఎక్స్, రీ రికార్డింగ్‌లో మెరుగులు దిద్దేందుకు మరింత సమయం అవసరం పడుతుంది, అందుకే సినిమాను వాయిదా వేస్తున్నాం. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం' అని నిర్మాణ సంస్థ 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. ఈ చిత్రంలో సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. తేజస్విని నందమూరి, రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు.

గ్యాంగ్‌స్టర్ డ్యూయెట్



పవన్ కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. పవన్, అరుల్ మోహన్‌పై చిత్రీకరించిన ప్రేమగీతాన్ని వినాయక చవితి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. 'సువ్వీ సువ్వీ' అంటూ సాగే ఈ గీతానికి తమన్ స్వరాలు అందించారు. కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం అందించగా, శ్రుతిరంజని ఆలపించారు. ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కెచంద్రన్, మనోజ్ పరమహంస, ఎడిటర్ నవీన్ నూలీ.

వైవాహిక బంధంలోకి నివేదా



కథానాయిక నివేదా పేతురాజ్ త్వరలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. తనకు కాబోయే భాగస్వామి రాజ్‌హిత్ ఇబ్రాన్‌ను పరిచయం చేస్తూ సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేశారు. 'ఇప్పటి నుంచి జీవితమంతా ప్రేమమయమే...'అనే క్యాప్షన్‌తో రాజ్‌హిత్‌తో ఉన్న ఫొటోలు పోస్ట్ చేశారు. రాజ్‌హిత్ దుబాయ్‌లో ప్రముఖ వ్యాపారవేత్త అని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో వీరి వివాహం జరగనున్నట్లు సమాచారం. 2016లో తమిళ సినిమా 'ఒరు నాళ్ కోత్తు'తో నివేదా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం 'పార్టీ' అనే చిత్రంలో నటిస్తున్నారు.

'వేదవ్యాస్' ఆరంభం



ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కిస్తోన్న 43వ సినిమా 'వేదవ్యాస్' గురువారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, దర్శకులు వీవీ వినాయక్, అనిల్ రావిపూడి, మురళీ మోహన్, అలీ, సాయికుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ చిత్రాన్ని కె.అచ్చిరెడ్డి సమర్పణలో సాయిప్రగతి ఫిల్మ్స్ బేనర్‌పై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు వీవీ వినాయక్ క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. నిర్మాత జెమినీ కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'తొలిసారిగా ఈ సినిమాలో కొరియన్ నటి జున్ హ్యాన్‌జీని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. నిర్మాత కె.అచ్చిరెడ్డి మాట్లాడుతూ 'కృష్ణారెడ్డి నుంచి ప్రేక్షకులు ఆశించే విధంగానే 'వేదవ్యాస్' ఉంటుంది. హీరో పేరు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు.




రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ మైసూర్‌లో జరుగుతోంది. జానీ మాస్టర్ నేతృత్వంలో వెయ్యిమందికి పైగా డాన్సర్లతో పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ సెట్‌లో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నారు.

మానవాళిని రక్షించే సూపర్ యోధ



తేజ సజ్జా కథానాయకుడిగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా సినిమా 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా సెప్టెంబరు 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నిస్వార్థంగా సాయం చేసే ఓ యువకుడి పరిచయంతో ట్రైలర్ ప్రారంభం అవుతుంది. ట్రైలర్‌లో యువకుడి నుంచి సూపర్ యోధ వరకు తేజ సజ్జా ట్రాన్స్‌ఫర్మేషన్‌ని అద్భుతంగా చూపించారు. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ 'నేను తెలుగు ప్రేక్షకుల కోసమే నటిస్తున్నాను. నా సినిమా మిగతా భాషల వారికి నచ్చితే అది బోనస్' అని అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ "హనుమాన్ లాంటి హిట్ అందుకున్న తర్వాత వరుసగా సినిమాల్లో నటించి డబ్బులు సంపాదించాలని చాలా మంది అనుకుంటారు. అలా అనుకోవడంలో తప్పు లేదు. కానీ, తేజ 'మిరాయ్' కోసం మరో ప్రాజెక్టును అంగీకరించకుండా మూడేళ్లు వేచి చూశాడు. కార్తీక్ ఈ సినిమాని అద్భుతంగా తెరెక్కించారు. అశోకుడు రాసిన 9 గ్రంథాల గురించి ప్రపంచానికి చెప్పాలనే సంకల్పంతో ఈ చిత్రాన్ని రూపొందించారు' అని అన్నారు.

ఆస్కార్ బరిలో 'పాపా బుకా'



కోలీవుడ్ దర్శకుడు పా.రంజిత్ సహ నిర్మాతగా వ్యవహరించిన 'పాపా బుకా' 98వ ఆస్కార్ పురస్కారాల పోటీకి అర్హత సాధించింది. పపువా న్యూ గినీ (పీఎన్‌జీ) దేశం నుంచి ఆస్కార్‌కు అర్హత పొందిన తొలి సినిమాగా ఈ చిత్రం రికార్డు నెలకొల్పింది. పపువా న్యూ గినీకి చెందిన నోయెలెన్ తౌలాతాతో కలసి పా.రంజిత్, అక్షయ్ కుమార్ పరిజా, ప్రకాశ్ బరే నిర్మించారు. బిజుకుమార్ దామోదరన్ తెరకెక్కించారు. రెండో ప్రపంచ యుద్ధంలో పీఎన్‌జీలో పోరాడిన భారతీయ సైనికులకు సంబంధించిన కథ ఇది. సినిమా సెప్టెంబరు 19న విడుదల కానుంది.

శక్తిమంతమైన మహిళ కథ



ఆమని ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'బ్రహ్మాండ'. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. బన్నీ రాజు కీలకపాత్ర పోషించారు. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమని మాట్లాడుతూ 'సామాజిక బాధ్యతతో కూడిన కథతో తెరకెక్కిన చిత్రమిది. మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగుతుంది. అట్టడుగు వర్గాల కోసం పోరాడే శక్తిమంతమైన మహిళ పాత్రను పోషించాను' అన్నారు.

కొత్త లోకం



కల్యాణి ప్రియదర్శన్ సూపర్ విమెన్ పాత్రలో నటించిన చిత్రం 'కొత్త లోక 1: చంద్ర'. నస్లెన్.కె.గఫూర్ కీలక పాత్రను పోషించారు. అరుణ్ డొమినిక్ దర్శకత్వంలో వేఫేరర్ ఫిల్మ్స్ పతాకంపై మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోంది. తాజాగా, ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. భారతదేశంలోనే తొలి మహిళా సూపర్ హీరోయిన్ చిత్రం ఇదని మేకర్స్ తెలిపారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు.

రక్తంతో రాసిన చరిత్ర



రిచర్డ్ రిషి, రక్షణ ఇందుసూదన్ ప్రధాన పాత్రల్లో మోహన్.జి తెరకెక్కిస్తున్న చిత్రం 'ద్రౌపది 2'. 2020లో విడుదలై విజయం సాధించిన 'ద్రౌపది'కి ఇది సీక్వెల్. చోళ చక్రవర్తి, జి.ఎం.ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహన్.జి మాట్లాడుతూ 'రక్తంతో రాసిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ ఏడాది చివర్లో తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

ఆకట్టుకునే కంటెంట్‌తో...



రాజ్ వేంకటాచ్చ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'ధర్మవరం'. ప్రసాద్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా. కంటెంట్ బాగుంది' అని అన్నారు.

మెప్పించే మిస్టర్ రాము



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రం 'మిస్టర్ రాము'. బొంత రాము హీరోగా నటిస్తూ నిర్మించారు. అజయ్ ఘోష్ విలన్ పాత్ర పోషించారు. అజయ్ కౌండిన్య దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే ఆడియో విడుదల వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా బొంత రాము మాట్లాడుతూ 'కథ మీద నమ్మకంతో సినిమా నిర్మించాను. ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది' అన్నారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమా రూపొందుతోంది అని దర్శకుడు తెలిపారు.

గణేశా గప్ చుప్



రోహన్, రిదా జంటగా సూరి.ఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'గప్ చుప్ గణేశా'. కేఎస్ హేమ్రాజ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదరప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రం టైటిల్ చాలా క్యాచీగా ఉంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఒక మొహమాటస్తుడు పడే ఇబ్బందులను హాస్యభరితంగా చూపించడమే ఈ చిత్ర కథాంశం అని మేకర్స్ తెలిపారు.



ట్రోఫీతో కబడ్డీ జట్ల సారథులు

విశాఖలో నేటి నుంచి ప్రొ. కబడ్డీ

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా శుక్రవారం నుంచి ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12 జరగనున్నది. తొలి అంచెలో భాగంగా సెప్టెంబరు 11 వరకు ఇక్కడ పోటీలు నిర్వహిస్తున్నారు. బీచ్ రోడ్డులోని ఐఎన్ఎస్ కురుసురా సబ్‌మెరైన్ వద్ద ట్రోఫీని ఆవిష్కరించారు. అనంతరం పీకేఎల్ చైర్మన్ అనుపమ గోస్వామితోపాటు 12 జట్ల సారథులు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఆటగాళ్లు భారత సాయుధ దళాలకు నివాళులర్పించారు. ఈ సీజన్‌లో అన్ని జట్లు పటిష్ఠంగా ఉన్నాయని తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్, తమిళ్ తలైవాస్ సారథి పవన్ సెహ్రావత్ అన్నారు. జొమోటా డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో టికెట్ల అమ్మకాలు ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్-తమిళ్ తలైవాస్, 9 గంటలకు జరిగే రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్-పుణెరి పల్టన్ జట్లు తలపడతాయి.

అదరగొట్టిన సింధు

- వరల్డ్ నెం: 2పై విజయంతో క్వార్టర్స్‌కు..
- సాత్విక్, ధ్రువ్ జోడీలు కూడా..
- వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్



పారిస్: గత కొంత కాలంగా ఫామ్ కోసం తంటాలుపడుతున్న భారత ఏస్ షట్లర్ పీవీ సింధు ఈ సీజన్‌లో తొలిసారి తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరచింది. అలనాటి పవర్ గేమ్‌ను మరోసారి ప్రదర్శించిన సింధు.. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)కు షాకిస్తూ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో తొమ్మిదో సీడ్ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ జోడీ, మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల జంట సంచలన విజయాలతో రౌండ్-8కు చేరుకొన్నాయి. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 15వ ర్యాంకర్ సింధు 21-19, 21-15తో వాంగ్ జి యిని వరుస గేముల్లో చిత్తు చేసింది. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో పుత్రి కుసుమవర్దని (ఇండోనేసియా)తో సింధు తలపడనుంది. పురుషల డబుల్స్ రౌండ్-16లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ 21-15, 21-17తో ఆరో సీడ్. చైనా జోడీ లియాంగ్ వి కెంగ్-వాంగ్ చాంగ్‌కు ఝలక్ ఇచ్చింది. తొలి గేమ్‌లో ఓడినా.. భారత జంట అద్భుతంగా పుంజుకొని మిగతా రెండు గేమ్‌లు గెలిచింది. ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంట 19-21, 21-12, 21-15తో హాంకాంగ్‌కు చెందిన టాంగ్ చున్ మన్-సె యింగ్ సూట్‌పై నెగ్గింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రణయ్ 7-21, 21-17, 21-23తో వరల్డ్ నెం:2 అంటాన్‌సెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు.

గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్‌కు ప్రజ్ఞానంద అర్హత

సెయింట్ లూయిస్ (యూఎస్): భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. సింక్వెఫీల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతో ప్రజ్ఞానందకు గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్ బెర్త్ ఖాయమైంది. అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో సింక్వెఫీల్డ్ కప్ టైటిల్ దక్కించుకున్నాడు. తొమ్మిదో, తుది రౌండ్‌లో అబ్దుసత్తోరోవ్‌పై నెగ్గిన వెస్లీ సో..ప్రజ్ఞానంద, తన దేశానికే చెందిన కరువానాతో కలిసి 5.5 పాయింట్లతో సమంగా నిలిచాడు. దాంతో..ప్లేఆఫ్ నిర్వహించగా రెండు పాయింట్లకుగాను వెస్లీ 1.5 పాయింట్లు సాధించి కప్ అందుకున్నాడు. ఇక..టైబ్రేకర్‌లో లెవాన్ అరోనియన్ (అమెరికా)తో డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద..కరువానపై నెగ్గి రన్నరప్‌గా నిలిచాడు.

సబలెంక, అల్కారజ్
ముందంజ

ఓస్టాపెంకో తిరుగుముఖం ● యూఎస్ ఓపెన్



సబలెంక



స్వియటెక్

న్యూయార్క్: ఈ ఏడాది ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో సీడెడ్‌ల పయనం సాఫీగా సాగుతోంది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ అల్కారజ్ 6-1, 6-0, 6-3తో మాటియా బెలూచీ (ఇటలీ)పై గెలుపొందాడు. షెల్టన్ 6-4, 6-4, 6-2తో కరెనోపై, జ్వెరెవ్ 6-2, 7-6 (4), 6-4తో తిబిలోపై, టేలర్ ఫ్రిట్జ్ 4-6, 7-6 (3), 6-2, 6-4తో హారిస్‌పై, జొకోవిచ్ 6-7 (7), 6-3, 6-3, 6-1తో సజ్డాపై, 17వ సీడ్ టియఫో 6-4, 7-5, 6-7 (10), 7-5తో మార్టిన్ డామ్‌పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరారు. ఐదో సీడ్ జాక్ డ్రేపర్ ప్రత్యర్థికి రెండో రౌండ్‌లో వాకోవర్ ఇచ్చాడు.

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక 7-6 (4), 6-2తో కుడెర్మెటోవాపై సునాయాసంగా నెగ్గగా, లామెన్స్‌పై గెలిచేందుకు రెండో సీడ్ స్వియటెక్ 6-1, 4-6, 6-4తో మూడు సెట్లు పోరాడాల్సి వచ్చింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో పెగుల 6-1, 6-3తో బ్లింకోవాని, ఆండ్రీవా 6-1, 6-3తో పొటపోవాని, పోలిని 6-3, 6-3తో జోవిక్‌ని, రిబకినా 6-3, 7-6 (7)తో వలెంటోవాని ఓడించి ముందంజ వేశారు. అన్‌సీడెడ్ అన్ లీ 6-3, 6-3తో 16వ సీడ్ బెన్సిక్‌ని, మరో అన్‌సీడెడ్ టేలర్ టౌన్‌సెండ్ 7-5 6-1తో ఫ్రెంచ్ ఓపెన్ మాజీ విజేత జెలెనా ఓస్టాపెంకోని కంగుతినిపించారు.

మెద్వెదెవ్‌కు రూ. 37 లక్షల జరిమానా: అనుచితంగా ప్రవర్తించిన రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు టోర్నీ రెఫరీ రూ. 37 లక్షల జరిమానా విధించారు. ఫ్రాన్స్ ఆటగాడు బెంజమిన్ బోన్జీ-మెద్వెదెవ్ తొలి రౌండ్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఫొటోగ్రాఫర్ ఒకరు కోర్టులోకి వచ్చారు. దాంతో బోన్జీకి అంపైర్ గ్రెగ్ అదనంగా మొదటి సర్వీస్ ఇవ్వడంతో..మెద్వెదెవ్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. అంపైర్ వద్దకు వెళ్లి వాదన పెట్టుకోవడమే కాదు అతడిని దూషించాడు. ఇక..మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అసహనంతో రాకెట్‌ను సైతం విరగ్గొట్టాడు. దాంతో అంపైర్‌తో వాగ్వాదానికి దిగినందుకు రూ. 26 లక్షలు, రాకెట్ విరగ్గొట్టినందుకు రూ. 11 లక్షల జరిమానాను మెద్వెదెవ్‌కు విధించారు.

నీరజ్‌కు రెండో స్థానం



డైమండ్ లీగ్ విజేత వెబర్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): డైమండ్ లీగ్ ఫైనల్లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. గురువారం జరిగిన ఈవెంట్‌లో ఆరో, ఆఖరి ప్రయత్నంలో నీరజ్ 85.01 మీటర్ల దూరం విసిరాడు. తొలి ప్రయత్నంలోనే 84.35 మీటర్లు దూరం విసిరిన చోప్రా ఆ తర్వాత తడబడ్డాడు. రెండో త్రోలో 82 మీటర్లు మాత్రమే నమోదు చేసిన నీరజ్.. మూడు, నాలుగు, ఐదు త్రోలు ఫౌల్ చేశాడు. జర్మన్ త్రోయర్ జూలియన్ వెబర్ 91.51 మీటర్లతో విజేతగా నిలవగా.. ట్రినిబాగో అథ్లెట్ కెషోర్న్ వాల్కాట్ 84.95 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకొన్నాడు. మొదటి రెండు త్రోలు వెబర్ 91 మీటర్లకుపైగా విసరగా.. మిగతా వారు అతడి దారిదాపులకు కూడా చేరుకోలేక పోయారు.

క్రీడా రంగ అభివృద్ధికి విశేష కృషి

సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: క్రీడా రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్-4 నిర్వహణకు సర్కారు నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పీవీఎల్ సీజన్ పోస్టర్‌ను క్రీడల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి సీఎం హైదరాబాద్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..ఇలాంటి పోటీల నిర్వహణవల్ల హైదరాబాద్ స్పోర్ట్స్ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందన్నారు. వాలీబాల్ లీగ్‌కు విచ్చేస్తున్న అన్ని జట్లకు ఆయన స్వాగతం పలికారు. అక్టోబరు రెండు నుంచి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ లీగ్ జరగనుంది.

గెలుపే లక్ష్యంగా..!

- తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్ ఢీ
- ఆసియాకప్ హాకీ నేటినుంచే

మ. 3 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



రాజ్‌గిర్ (బిహార్): ఇటీవలి కాలంలో వరుస ఓటములతో డీలాపడ్డ భారత హాకీ జట్టు బలంగా పుంజుకోవాలనుకొంటోంది. ఆసియా కప్ నెగ్గడం ద్వారా వచ్చే ఏడాది జరిగే వరల్డ్ కప్ బెర్త్‌ను సాధించే ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకొంటోంది. శుక్రవారం ఆరంభమయ్యే ఈ టోర్నీ పూల్-ఎలో తమ తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. అటాకింగ్ గేమ్ ఆడే చైనాను ఏ మాత్రం తక్కువగా అంచనా వేసినా ఫలితం తారుమారయ్యే ప్రమాదముంది. భారత్, చైనాలోపాటు జపాన్, కజకిస్థాన్ పూల్-ఎలో.. దక్షిణ కొరియా, మలేసియా, బంగ్లాదేశ్, చైనీస్ తైపీ పూల్-బిలో ఉన్నాయి.

26 పతకాలు ఖరారు

అంతర్జాతీయ యూత్ బాక్సింగ్

న్యూఢిల్లీ: చైనాలో జరుగుతున్న అంతర్జాతీయ యూత్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్లు 26 పతకాలు ఖాయం చేశారు. అండర్-17 కేటగిరీలో 20 మంది బాలురు, 20 మంది బాలికల బృందాలను భారత్ ఈ టోర్నీకి పంపింది.



గురుప్రీత్ గురి అదిరె..


- రెండు స్వర్ణాలు కొల్లగొట్టిన భారత షూటర్
- పసిడితో మెరిసిన మురళీధర్
- ఆసియా చాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్స్‌లో గుర్‌ప్రీత్ సింగ్ రెండు పసిడి పతకాలు కొల్లగొట్టాడు. జూనియర్ విభాగంలో తెలంగాణకు చెందిన మురళీధర్ నాయుడు స్వర్ణ, కాంస్యాలతో మెరిశాడు. 25మీ. స్టాండర్డ్ పిస్టల్ కేటగిరీ ఫైనల్లో గురుప్రీత్ స్వర్ణం, అమన్‌ప్రీత్ రజతం అందుకున్నారు. ఇక గురుప్రీత్, అమన్‌ప్రీత్, హర్ష్ గుప్తాతో కూడిన భారత జట్టు 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ టీమ్ విభాగంలో స్వర్ణం నెగ్గింది.

మురళీధర్ భళా..: జూనియర్ విభాగంలో మురళీధర్ నాయుడు రెండు పతకాలతో సత్తా చాటాడు. 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ టీమ్ కేటగిరీలో మురళీధర్ నాయుడు, సూరజ్ శర్మ, ముకేష్‌తో కూడిన భారత త్రయం (1703 పాయింట్లు) స్వర్ణం చేజిక్కించుకుంది. ఇక 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మురళీధర్ (568) కాంస్యం నెగ్గాడు. జూనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ ప్రోన్‌లో సమీవుల్లా, కర్మాకర్, కుశాగ్ర త్రయం పసిడి పతకాన్ని సాధించింది.

ట్రంప్ బెదిరింపులకు
లొంగొద్దు

- మన గౌరవ మర్యాదలే ముఖ్యం
- జీఎస్‌టీ తగ్గిస్తే చిన్న కార్లకు మేలే
- మారుతి సుజుకీ చైర్మన్ భార్గవ



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై భారత కార్పొరేట్ వర్గాల్లోనూ అసహనం వ్యక్తమవుతోంది. ఈ బెదిరింపులకు ఏ మాత్రం లొంగకూడదని మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) చైర్మన్ ఆర్‌సీ భార్గవ ప్రభుత్వాన్ని కోరారు. వాణిజ్యం కంటే దేశ గౌరవ మర్యాదలే ముఖ్యమన్నారు. ఈ కీలక సమయంలో దేశమంతా ఒక్కటిగా నిలవాలని కోరారు. మారుతి సుజుకీ ఇండియా వాటాదారుల 44వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని (ఏజీఎం) ఉద్దేశించి మాట్లాడుతూ భార్గవ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితికి ట్రంప్ సుంకాల పోటే కారణమన్నారు. దౌత్య సంబంధాల్లో సుంకాలను ఆయుధంగా ఉపయోగిస్తున్న తొలి నేత ట్రంపేనని భార్గవ విమర్శించారు. భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ).. అమెరికాతో సహా ఇతర దేశాలతో కుదుర్చుకునే ఎఫ్‌టీఏలకు ప్రాతిపదికగా ఉండాలని భార్గవ స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ మాగ్నెట్ల సరఫరాపై చైనా ఆంక్షలను ఒక హెచ్చరికగా తీసుకోవాలని కోరారు.

చిన్న కార్లకు మేలు: ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలపైనా భార్గవ మాట్లాడుతూ.. ఈ సంస్కరణలు జీడీపీ వృద్ధి రేటు, ఉపాధి కల్పన వేగం పుంజుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ సంస్కరణల్లో భాగంగా చిన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్‌టీ.. 18 శాతానికి తగ్గుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. అయితే దీనిపై ప్రభుత్వం ఇంకా అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉందన్నారు. చిన్న కార్లపై జీఎస్‌టీ 18 శాతానికి తగ్గిస్తే ఈ తరగతి కార్ల మార్కెట్ మళ్లీ పుంజుకుంటుందన్నారు. ప్రస్తుతం తమ ప్రయాణాల కోసం స్కూటర్లు, బైకులపై ఆధారపడిన అనేక మంది చిన్న కార్లు కొనేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. జపాన్ అనుభవమే ఈ విషయంలో మనకు ఆదర్శమన్నారు.

బిజినెస్

బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కారు, తనఖా రుణాలు సహా కొన్ని ఎంపిక చేసిన రుణాలపై వడ్డీ రేటును 0.25% మేరకు తగ్గించింది. ఈ తగ్గింపు తక్షణం అమల్లోకి వస్తుంది. ఈ తగ్గింపుతో కారు రుణాలపై ఫ్లోటింగ్ రేటు 8.15% నుంచి మొదలవుతుందని బ్యాంక్ తెలిపింది. ప్రాపర్టీని తనఖా పెట్టి తీసుకునే రుణాలపై వడ్డీరేటు 9.85% నుంచి 9.15 శాతానికి తగ్గింది.

హైదరాబాద్‌లో సంహీ హోటల్స్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సంహీ హోటల్స్ లిమిటెడ్ హైదరాబాద్‌లో తన హోటల్స్‌ను మరింత విస్తరిస్తోంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా 260 గదులతో మరో మిడ్ స్కేల్ హోటల్‌ను నిర్మించనుంది. ఇందుకోసం రూ.125 కోట్ల నుంచి రూ.143 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. కాగా ఈ హోటల్ కోసం పీ ప్రమోద, పీ హారిక, ఆరియన్ ఎస్కార్‌లతో ఒక లీజు ఒప్పందం కుదుర్చుకుంది. ఆరియన్ ఎస్కార్ సంస్థ ఈ హోటల్‌ను నిర్మించి తమకు ఇస్తుందని సంహీ తెలిపింది. సంహీ ఇప్పటికే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో షెరటాన్, ఫెయిర్‌ఫీల్డ్ బై మారియట్ హోటల్స్‌ను నిర్వహిస్తోంది.

సుంకాల సంకటం

2 రోజుల్లో సెన్సెక్స్ 1,555 పాయింట్లు పతనం

- రూ..69 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరి
- టెక్స్‌టైల్స్, రొయ్యలు, తోలు, జెమ్స్ అండ్ జువెలరీ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడిన మదుపరులు



ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు స్టాక్ మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. భారత ఎగుమతులపై ట్రంప్ అదనంగా 25 శాతం జోడించి 50 శాతానికి పెంచిన సుంకాలు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ఎగుమతి ప్రభావిత కంపెనీల షేర్లలో పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు భారీగా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) కూడా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచింది. దాంతో బీఎస్ఈ సెన్సెక్స్ గురువారం మరో 705.97 పాయింట్లు పతనమై 80,080.57 వద్దకు జారుకుంది. నిఫ్టీ 211.15 పాయింట్లు కోల్పోయి 24,500.90 స్థాయికి పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి..

వినాయక చవితి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు బుధవారం సెలవు పాటించాయి. సుంకాల పోటుతో గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో (మంగళవారం, గురువారం) సెన్సెక్స్ 1,555.34 పాయింట్లు, నిఫ్టీ 466.85 పాయింట్లు క్షీణించాయి. రెండు రోజుల్లో ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.69 లక్షల కోట్లు తగ్గి రూ.445.17 లక్షల కోట్లకు (5.08 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఈ రంగాలపై అధిక ప్రభావం

ట్రంప్ సుంకాల పోటుతో టెక్స్‌టైల్స్, రొయ్యలు, తోలు, జెమ్స్ అండ్ జువెలరీ రంగ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. రంగాల వారీగా కంపెనీల షేర్ల నష్ట వివరాలు..

కంపెనీ షేరు	నష్టం(%)
టెక్స్‌టైల్స్	
కిటెక్స్ గార్మెంట్స్	5.0
పర్ల్ గ్లోబల్	2.94
సియారామ్ సిల్క్ మిల్స్	2.56
రేమండ్ లైఫ్‌స్టైల్	2.37
అలోక్ ఇండస్ట్రీస్	1.59
రూప అండ్ కంపెనీ	1.43
వెల్‌స్పన్ లివింగ్	1.09
ట్రైడెంట్ లిమిటెడ్	1.01
రొయ్యలు	
అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్	5.36
వాటర్‌బేస్ లిమిటెడ్	3.38
అవంతి ఫీడ్స్	0.82
తోలు, పాదరక్షలు	
ఖదీమ్ ఇండియా	1.95
రిలాక్సో ఫుట్‌వేర్	1.84
మయూర్ యూనికోటర్స్	0.83
సూపర్‌హౌస్ లిమిటెడ్	0.56
మీర్జా ఇంటర్నేషనల్	0.50
జెమ్స్ అండ్ జువెలరీ	
బ్లూస్టోన్ జువెలరీ	3.51
స్కై గోల్డ్ అండ్ డైమండ్స్	3.23
శాంతి గోల్డ్	3.05
త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ	0.84
రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్	0.37

ఎగుమతిదారులకు అండగా ప్రభుత్వం

- రూ.25,000 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ !
- హామీ ఇచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో దెబ్బతిన్న ఎగుమతి కంపెనీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గురువారం తనను కలిసిన భారత ఎగుమతిదారుల సమాఖ్య (ఫియో) జాతీయ అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ నాయకత్వంలోని ఎగుమతిదారుల బృందానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ కష్ట సమయంలో మీకు అండగా నిలబడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు సీతారామన్ చెప్పినట్టు ఫియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం ఆరేళ్లపాటు అమల్లో ఉండేలా రూ.25,000 కోట్ల నిధితో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) పేరుతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి.

సాయం ఇలా!

ఎగుమతుల కోసం ఈ కంపెనీలు తీసుకున్న రుణ వసూళ్లపై విరామం (మారటోరియం) ప్రకటించే విషయాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. వీటికి తోడు అమెరికా సుంకాల పోటును దృష్టిలో ఉంచుకుని ఇతర దేశాల మార్కెట్లపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. భారత్-బ్రిటన్ ఎఫ్‌టీఏ తరహాలో ఈయూ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్‌లతోనూ ఎఫ్‌టీఏలు కుదుర్చుకునేందుకు చర్చలను త్వరితం చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. మరోవైపు జీఎస్‌టీ సంస్కరణల ద్వారా దేశీయ వినియోగాన్ని పెంచి ఈ కంపెనీలకు అండగా నిలవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఎంఎస్ఎంఈల కోసం..

అమెరికా సుంకాల పోటుతో ఎగుమతుల రంగంలో ఉన్న ఎంఎస్ఎంఈ కంపెనీలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఈ కంపెనీలను ఆదుకునేందుకు అవి తీసుకునే రుణ చెల్లింపుల కోసం అత్యవసరంగా ప్రత్యేక రుణ చెల్లింపుల హామీ పథకం తీసుకువచ్చేందుకూ కసరత్తు చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. అమెరికా ఆంక్షల ప్రభావం పెద్ద పెద్ద కంపెనీలపై కంటే అన్‌లిస్టెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈలపైనే ఎక్కువగా ఉంటుందని పరిశ్రమ వర్గాల అంచనా. దీనికి తోడు ఈ కంపెనీల్లోనే ఎక్కువ మంది పని చేస్తున్నారు. దీంతో కొవిడ్ సమయంలోలా ఈ కంపెనీలకు ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29 తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	560
వరంగల్	512	గోదావరి	550
చిత్తూరు	568	విశాఖపట్నం	550

దజను గుడ్లు రూ. 72

రష్యా చమురు దిగుమతులతో
ప్రయోజనం కొంతే..

- వార్షిక లబ్ధి 250 కోట్ల డాలర్లే..
- గత అంచనాల్లో పదో వంతే..
- వెల్లడించిన సీఎల్ఎస్ఏ నివేదిక

న్యూఢిల్లీ: డిస్కౌంట్ ధరకు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి చమురుతో భారత్‌కు వార్షిక ప్రయోజనం కేవలం 250 కోట్ల డాలర్లేనని (సుమారు రూ.21,875 కోట్లు), దేశ జీడీపీలో 0.6 శాతానికి సమానమని బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ గురువారం విడుదల చేసిన అధ్యయన నివేదికలో వెల్లడించింది. గతంలో పలు మీడియా కథనాలు అంచనా వేసిన 1,000-2,500 కోట్ల డాలర్ల (రూ.87,500-2,18,750 కోట్లు) స్థాయి భారీ లబ్ధితో పోలిస్తే చాలా తక్కువని పేర్కొంది. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. వినియోగదారు కూడా. రష్యా నుంచి దిగుమతిని నిలిపివేస్తే, భారత్ ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిమిత ప్రత్యామ్నాయాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు అనూహ్యంగా పెరిగాయి. ఈ యుద్ధానికి ముందు భారత్ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం ఒక శాతం కాగా.. ప్రస్తుతం అది దాదాపు 40 శాతానికి పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ రోజుకు సగటున 54 లక్షల పీపాల ముడి చమురును దిగుమతి చేసుకోగా.. అందులో రష్యా వాటా 18 లక్షల పీపాలుగా (36 శాతం) నమోదైంది. సౌదీ అరేబియా వాటా 14 శాతం, ఇరాక్ వాటా 20 శాతం, యూఏఈ వాటా 9 శాతం, అమెరికా వాటా 4 శాతంగా ఉంది.

పవర్ మెక్ ప్రాజెక్ట్స్‌కు రూ.370 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్.. అదానీ పవర్ అనుబంధ సంస్థ అయిన మహాన్ ఎనర్జెన్ నుంచి రూ. 370.84 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. ఆర్డర్‌లో భాగంగా మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలిలో ఉన్న మహాన్ ఫేజ్-3 థర్మల్ పవర్ ప్రాజెక్టులో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుందని పవర్‌మెక్ తెలిపింది.

భారత స్టాక్ మార్కెట్‌కు ఢోకా లేదు

ఎన్ఎస్ఈ సీఈఓ చౌహాన్

దేశీయ స్టాక్ మార్కెట్‌కు ఢోకా లేదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) సీఈఓ, ఎండీ ఆశిష్ కుమార్ చౌహాన్ అన్నారు. స్థిరమైన అధిక వృద్ధి రేటు, సమగ్ర పొదుపు నిల్వలు, బలమైన బ్యాంక్‌ల బ్యాలెన్స్‌షీట్లు, ప్రభుత్వ సంస్కరణల ఎజెండా, శరవేగ డిజిటలీకరణ వంటి పటిష్ఠ మూలాలు మన మార్కెట్‌కు దన్నుగా నిలుస్తాయన్నారు. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో ప్రస్తుతం ప్రతికూలతలు ఎదురవుతున్నప్పటికీ, మన మార్కెట్ అంతర్జాతీయ అనిశ్చితులను తట్టుకుంటూనే ఇన్వెస్టర్లకు దీర్ఘకాలిక స్థిరత్వంతో పాటు పెట్టుబడి అవకాశాలను కల్పించగలదన్నారు.

స్టాక్స్ ఫ్యూచర్స్‌లోనూ ప్రీ-ఓపెన్ ట్రేడింగ్

ఈ ఏడాది డిసెంబరు 8 నుంచి ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో ఇండెక్స్, స్టాక్ ఫ్యూచర్స్‌లోనూ ప్రీ-ఓపెన్ ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టాలని బీఎస్ఈ ప్రతిపాదించింది. ఈక్విటీ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్ వెసులుబాటును మెరుగుపరచడంతో పాటు నష్టాల ముప్పుపై పర్యవేక్షణను పటిష్ఠపరచాలని సెబీ.. స్టాక్ ఎక్స్ఛేంజీలను నిర్దేశించింది. ఈ నేపథ్యంలోనే ఇండెక్స్, స్టాక్స్ ఫ్యూచర్స్‌లోనూ ప్రీ-ఓపెన్ ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టబోతున్నట్టు బీఎస్ఈ పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	112
వరంగల్	92	గుంటూరు	107
కరీంనగర్	92	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	94
కర్నూలు	92	నెల్లూరు	99
విశాఖపట్నం	116	అనంతపురం	99
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,600 ▲	94,050 ▲	1,30,000 ▼
విజయవాడ	1,04,700 ▲	98,000 ▲	1,20,070 ▲
విశాఖపట్నం	1,04,590 ▲	94,050 ▲	1,30,000 ▲
రాజమండ్రి	1,02,600 ▲	94,050 ▲	1,12,000 ▼
ప్రొద్దుటూరు	1,02,450 ▲	94,250 ▲	1,19,100 ▲
ముంబై	1,01,506 ▲	92,980 ▲	1,17,110 ▲



కామారెడ్డి-రాజంపేట మధ్యలో ధ్వంసమైన రోడ్డు



కామారెడ్డి పట్టణంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన వాహనాలు



జగిత్యాల జిల్లా వడ్డె లింగాపూర్‌లో గర్భిణిని ఎక్స్‌కవేటర్‌లో తరలిస్తున్న దృశ్యం

వరద బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

చిక్కుకున్న 1071 మందిని కాపాడింది. వరదల తాకిడికి కామారెడ్డి జిల్లాలో 58 రహదారులు ధ్వంసమయ్యాయి. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. కామారెడ్డి పట్టణ కేంద్రం నుంచి మొదలుకుని భిక్కనూరు వరకు 44వ జాతీయ రహదారిపై వరదలు ఉధృతంగా ప్రవహించడంతో బుధవారం రోజంతా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భిక్కనూరు మండలంలోని జంగంపల్లి, బస్వాపూర్ వద్ద జాతీయ రహదారిపై వరదలో చిక్కుకున్న పలువురు వాహనదారులను పోలీసులు రక్షించారు. తిప్పాపూర్- రామేశ్వర్‌పల్లి మధ్యలోని రైల్వేమార్గం వరదల తాకిడికి ట్రాక్ కొట్టుకుపోవడంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు.

మెదక్‌జిల్లాలో..

మెదక్‌జిల్లాలో 48 గంటల వ్యవధిలో 55 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మెదక్ పట్టణంలో పుష్పల వాగు ఉధృతికి విద్యుత్ సబ్ స్టేషన్ కొట్టుకుపోవడంతో 9 గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. హవేళీ ఘనపూర్ మండలంలో నక్కవాగు పొంగిపొర్లడంతో బోధన్-మెదక్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. కొచ్చెరువు, దేవుని చెరువు కట్టలు తెగిపోయి నీరు ప్రవహించడంతో రైల్వే ట్రాక్ ధ్వంసమైంది. అక్కన్నపేట రైల్వేట్రాక్ కింద కంకర కొట్టుకుపోయి రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఇతర జిల్లాల్లో..

- ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాల ధాటికి పెన్‌గంగా, కడెం నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వేల ఎకరాల్లో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ధన్నూర్ గ్రామంలో ఓ యువకుడు వాగులో కొట్టుకుపోయినా.. ప్రాణాలతో బయటపడ్డాడు.
- ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని జలగలంచ వాగు ఉధృతంగా ప్రవహించడంతో మొద్యాల తోగు వద్ద 163 జాతీయ ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లక్నవరం ఆయకట్టులోని నాలుగు పంటకాల్వలకు సుమారు 15 చోట్ల గండ్లు పడ్డాయి.
- భూపాలపల్లి ఏరియా పరిధిలోని మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్‌కాస్టు, గణపురం మండలంలోని మాధవరావుపల్లి సమీపంలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు-3లోకి భారీగా వరద నీరు చేరి 2 రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు రూ.2.5 కోట్ల నష్టం వాటిల్లింది.
- యాదాద్రిభువనగిరి జిల్లాలో సంగెం-బొల్లెపల్లి, రుద్రవల్లి-జూలూరు లోలెవల్ బ్రిడ్జిల పై నుంచి 3-4 అడుగుల ఎత్తులో మూసీ పరవళ్లు తొక్కుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65)పై.. భువనగిరి-చిట్యాల రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది.
- మంగళవారం నుంచి కురిసిన వర్షానికి వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని వాగులు పొంగి ప్రవహించాయి. గండిపేట, హిమాయత్ సాగర్ నిండుకుండలను తలపిస్తున్నాయి.
- సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.



గంగమ్మ ఒడిలో ఏడుపాయల దుర్గమ్మ గర్భగుడి



కామారెడ్డిపట్టణంలోని జీఆర్ కాలనీలో వరదతో బురదమయమైన ఇళ్లు



కామారెడ్డి - రాజంపేట మండల మధ్యలో పాడైన రోడ్లు



నిజామాబాద్.. వాడి గ్రామంలో వరదనీరు



సిరిసిల్ల జిల్లాలో డ్రోన్ సహాయంతో రైతులకు ఆహారాన్ని పంపిస్తున్న దృశ్యం



కామారెడ్డి పట్టణంలో వరదతో వచ్చిన బురదను కడుగుతున్న బాధితుడు

చివరి మజిలీలో.. వరద కష్టాలు



సిద్దిపేట జిల్లాలోని రేగోడ్ మండలం మర్పల్లి గ్రామానికి చెందిన బండి హరి అనే దివ్యాంగుడు బుధవారం గుండెపోటుతో మరణించాడు. కానీ.. దారిలో గొల్లవాగు ఉధృతి కారణంగా ముందుకు వెళ్లలేకపోయారు. చివరికి ఒక ట్రాక్టర్‌కు తాడు కట్టి దానికి జేసీబీ సహాయంతో మృతదేహాన్ని వాగు దాటించారు. మరోవైపు.. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన తుమ్మ ఆగమ్మ అనే మహిళ గుండెపోటుతో మరణించారు. ఆమె దహన సంస్కారాల కోసం కుటుంబసభ్యులు వైకుంఠధామానికి వెళ్లగా, అది పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో చేసేదేమీ లేక, గ్రామస్థులు రోడ్డు మీదనే అంత్యక్రియలు పూర్తి చేశారు.

గర్భిణులను కాపాడారు..

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డెలింగాపూర్‌లో కళ్యాణి అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి ప్రయత్నించారు. దారిలో.. వాగు నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో కొందరు యువకులు ఎక్స్‌కవేటర్ సహాయంతో గర్భిణిని వాగు నీటి నుంచి ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే.. మెదక్‌జిల్లా రాజ్‌పేట తండాకు చెందిన మాలోత్ హరితకు పురిటినొప్పులు రాగా.. బూర్గుపల్లి వద్ద బ్రిడ్జి కొట్టుకుపోయి రవాణా నిలిచిపోవడంతో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఆమెను 108 అంబులెన్సులో మెదక్ ఆస్పత్రికి తరలించారు.

మృతులు.. గల్లంతైనవారు..

కామారెడ్డి జిల్లాలో భారీవర్షాలు, వరదల తాకిడికి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. రాజంపేటలో ఇప్పకాయల వినయ్‌కుమార్(29) అనే యువకుడు ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున వరద ఒక్కసారిగా రావడంతో గోడకూలి మృతిచెందాడు. మృతుడు గుండారం గ్రామంలో పల్లెదవాఖానాలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. బీబీపేట మండలం జనగామలో కప్పెరా రాజారెడ్డి(63) గ్రామశివారులోని తన పశువుల పాక వద్దకు వెళ్లగా ఎడ్లకట్ట వాగు వరదతో ఒక్కసారిగా పొటెత్తడంతో వరదలో కొట్టుకుపోయి మృతిచెందాడు.

- మెదక్ జిల్లా రాజ్‌పేట గ్రామం గంగమ్మవాగులో ఆటో వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అందులో ఉన్న బెస్త సత్యనారాయణ, యాదగౌడ్‌లు కొట్టుకుపోయారు. వారిలో సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది.
- ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో మండలంలో ఆకేరు వాగులో పడి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామానికి చెందిన సీహెచ్.మునీష్(25) మృతిచెందాడు. అతడు వీరారం నుంచి మంగళవారం తిరుమలాయపాలెం మండలం గుండా ఆటోలో వెళుతుండగా ఆటో చెడిపోయింది. నడిచి రాకాసితండావైపు వెళుతూ వాగుదాటే ప్రయత్నం చేసి.. వాగు ఉధృతికి కొట్టుకుపోయాడు. అతడి మృతదేహం గురువారం లభ్యమైంది.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎగువ మానేరు ప్రాజెక్టు వద్దకు గేదెలు మేపడానికి నర్మాల గ్రామానికి చెందిన ఆరుగురు రైతులు వెళ్లారు. వీరిలో ఒకరు వరద నీటిలో గల్లంతు కాగా గురువారం ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించారు.

4 వర్సిటీల్లో పరీక్షలు వాయిదా

భారీ వర్షాల కారణంగా శుక్ర, శనివారాల్లో జరిగే అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు జేఎన్‌టీయూ హైదరాబాద్ ఒక ప్రకటనలో తెలిపింది. వాయిదా పడిన పరీక్ష తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే.. 28, 29 తేదీల్లో కాకతీయ వర్సిటీలో.. 29, 30 తేదీల్లో తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరగాల్సిన పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. శాతవాహన వర్సిటీ పరిధిలో గురువారం జరగాల్సిన పరీక్షలు వాయిదాపడ్డాయి. వాటిని తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేయనున్నారు.

ఎస్సారెస్పీ గేట్లు మూయించి మరీ..

నిర్మల్ జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ ఎడతెరిపి లేకుండా కుండపోతగా వాన కురిసింది. కుంభవృష్టి దాటికి.. లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి వద్ద గోదావరి కుర్రులో చిక్కుకున్న ముగ్గురు పశువుల కాపర్లను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. వీరిలో పార్‌పెల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ అనే వ్యక్తిని కాపాడేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెలికాప్టర్ కోసం ప్రయత్నించారు. గోదావరిలో నీటి మట్టం భారీగా ఉండడంతో ఎస్సారెస్పీ గేట్లను కొద్దిసేపు మూసి వేయించారు. నీటి ఉధృతి తగ్గగానే ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందం శంకర్ నాయక్‌ను కుర్రు నుంచి బయటకు తీసుకువచ్చారు.






సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలలో వరదప్రాంతాల్లో పర్యటిస్తున్న బండి సంజయ్ వద్దకు వచ్చి పలకరిస్తున్న కేటీఆర్

బాగున్నారా?

అనుకోకుండా ఎదురుపడి పలకరించుకున్న బండి సంజయ్.. కేటీఆర్

కేంద్రంతో మాట్లాడి.. నాలుగు హెలికాప్టర్లను రప్పించిన బండి సంజయ్

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ఆరుగురు పశులకాపరులు వరదల్లో చిక్కుకున్నారు. ఈ విషయం తెలియగానే.. కేంద్ర మంత్రి బండి సంజయ్.. వైమానిక దళం అధికారులతో మాట్లాడి నాలుగు హెలికాప్టర్లను పంపించాలని కోరారు. సంజయ్ అభ్యర్థన మేరకు తక్షణం హెలికాప్టర్లు అందుబాటులో ఉంచాలని రాజ్‌నాథ్‌సింగ్ ఆదేశించారు. ఈమేరకు గురువారం ఉదయమే 2 హెలికాప్టర్లు నర్మాల చేరుకుని వరదల్లో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతానికి తరలించాయి. మరో 2 హెలికాప్టర్లను సిరిసిల్లకు పంపించారు. కాగా.. గురువారం ఆ పశులకాపరులను బండి పలకరించారు. అనంతరం వరదల్లో గల్లంతైన నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. నాగయ్య కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఆయన అక్కణ్నుంచీ వెళుతుండగా దారిలో మాజీ మంత్రి కేటీఆర్ ఎదురయ్యారు. బండి సంజయ్‌ను చూడగానే ఆయన కాన్వాయ్ వద్దకు కేటీఆర్ వచ్చారు. బండి కూడా వాహనం దిగి కేటీఆర్ వద్దకు వెళ్లారు. ఇద్దరూ పరస్పరం అభివాదం చేసుకుని.. బాగున్నారా? అంటూ పలకరించుకున్నారు. కష్టపడుతున్నారంటూ కేటీఆర్ ఈ సందర్భంగా బండి సంజయ్‌ను ఉద్దేశించి అన్నారు. అనంతరం నర్మాల బాధితులను పరామర్శించేందుకు కేటీఆర్ వెళ్లిపోయారు.



17ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకుపైగా

బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 7 గంటల దాకా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 200 మిల్లీమీటర్ల(20 సెం.మీ.)కు మించి వర్షపాతం కురిసిన ప్రాంతాలు..

మండలం	జిల్లా	ప్రాంతం	వర్షపాతం (మి.మీలో)
రాజంపేట	కామారెడ్డి	ఆర్గొండ	440.5
నిర్మల్ రూరల్	నిర్మల్	అక్కాపూర్	325.3
హవేలీఘన్‌పూర్	మెదక్	సర్దానా	316
కామారెడ్డి	కామారెడ్డి	ఐడీవోసీ	308.5
తాడ్వాయి	కామారెడ్డి	తాడ్వాయి	289.8
లక్ష్మణచాంద	నిర్మల్	వడ్యాల్	281.3
భిక్నూర్	కామారెడ్డి	భిక్నూర్	279
హవేలీఘన్‌పూర్	మెదక్	నాగపూర్	278.8
కామారెడ్డి	కామారెడ్డి	పాతరాజంపేట	249.8
నిర్మల్	నిర్మల్	విశ్వనాథ్‌పేట	241.3
నిర్మల్ రూరల్	నిర్మల్	ముజిగి	232
చేగుంట	మెదక్	చేగుంట	231.8
లింగంపేట	కామారెడ్డి	లింగంపేట	229
రామాయంపేట	మెదక్	రామాయంపేట	208
మెదక్	మెదక్	మెదక్	207.5
కొముురవెల్లి	సిద్దిపేట్	కొముురవెల్లి	207.3
దోమకొండ	కామారెడ్డి	దోమకొండ	202

భారీ వర్షాలతో పలు రైళ్ల రద్దు

హైదరాబాద్, సికింద్రాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పట్టాలపైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో 29, 30 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట్-మల్కాజిగిరి (77656), మెదక్-కాచిగూడ (77604), బోదన్-కాచిగూడ (57414), కాజీపేట్-సిర్పూర్ టౌన్ (17003), బలార్షా-కాజీపేట్ (17004), బలార్షా-కాజీపేట్ (17036), బీదర్-కాలాబురాగి(77631), కాలాబురాగి-బీదర్ (77632), బీదర్-కాలాబురాగి (77638), కాలాబురాగి-బీదర్ (77635), బీదర్-కాలాబురాగి (77633), కాలాబురాగి-బీదర్ (77634), బీదర్-కాలాబురాగి (77636), కాలాబురాగి-బీదర్ (77637), కాజీపేట్-బలార్షా (17035), సిర్పూర్ టౌన్ (67772), సిర్పూర్‌టౌన్-కరీంనగర్ (67771), కరీంనగర్-బోధన్ (67773), బోధన్-కరీంనగర్ (67774) రైళ్లను రద్దు చేశారు. శనివారం బలార్షా-కాజీపేట్ (17036), నర్కేర్-కాచిగూడ (17642), నాగర్‌సోల్-కాచిగూడ (17662)రైళ్లను రద్దు చేశారు. ప్రయాణీకుల కోసం దక్షిణ మధ్య రైల్వే వివిధ రైల్వే స్టేషన్లలో హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసింది. ఆ వివరాలు.. కాచిగూడ స్టేషన్(9063318082) సికింద్రాబాద్ స్టేషన్(040-27786170), నిజామాబాద్ స్టేషన్(970329671), కామారెడ్డి స్టేషన్ (రైల్ నెంబర్: 9281035664)



మెదక్ జిల్లా శమ్నాపూర్ వద్ద కోతకు గురైన రైల్వేట్రాక్



కామారెడ్డి జిల్లాలో నీటమునిగిన పంటలు

నష్టం లెక్కలు వేయండి

పంటలు, ఆస్తుల నష్టం ఫొటోలు భద్రపరచండి.. ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించాలి

- పాత ఇళ్లలో ఉన్న వారిని తరలించండి
- గణేశ్ మండపాల దగ్గర విద్యుత్ జాగ్రత్త
- వరద సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

మెదక్ అర్బన్, హైదరాబాద్, పెద్దపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో జరిగిన పంట, ఆస్తి నష్టాలపై నివేదికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కామారెడ్డి, మెదక్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. హైదరాబాద్ నుంచి బయల్దేరిన ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టును, కామారెడ్డి వరద ప్రాంతాలను సందర్శించిన అనంతరం కామారెడ్డిలో జిల్లా వరద సమీక్ష నిర్వహించాలని ప్లాన్ చేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో కామారెడ్డి ఏరియల్ సర్వే ముగించుకొని మెదక్ జిల్లాకు వచ్చారు. మెదక్ వరద ప్రాంతాలను సందర్శించిన అనంతరం మెదక్ ఎస్పీ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండి, ఆస్తి, పంట, ప్రాణనష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. జిల్లాలో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాన్ని వేగంగా అంచనా వేయాలని, యుద్ధ ప్రాతిపదికన నివేదికలు సిద్ధం చేయాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. డిజాస్టర్ మెనేజ్‌మెంట్‌లో భాగంగా ఒక పక్క వరద నష్టాలను అంచనా వేస్తూ మరోపక్క శాశ్వత ప్రాతిపదికన అవసరమైన చోట హైలెవెల్ బ్రిడ్జిలు కట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట నష్టాన్ని అంచనా వేసినప్పుడు ఫొటో, వీడియో ద్వారా జిల్లాలో జరిగిన సమగ్ర వివరాలను భద్రపరాలని అధికారులకు సూచించారు. వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. 6.20కు సమీక్ష ముగించుకుని సీఎం ఏడు గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు.



సర్వే వివరాలపై మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడుతున్న సీఎం రేవంత్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాత ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అలాగే వినాయక మండపాలకు దగ్గర్లో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గురువారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కతో కలిసి తన నివాసంలో వరద పరిస్థితిపై సమీక్షించారు. పోలీసు, అగ్నిమాపక, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వైద్యారోగ్య సిబ్బంది అవసరమైన మందులను సరిపడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లను మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ఎల్లంపల్లి నిలబడింది.. మేడిగడ్డ కుంగింది

"కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణపై లోపాలు ఉన్నాయని జస్టిస్ ఘోష్ నివేదిక ఇచ్చారు. దీనిపై అసెంబ్లీలో చర్చిస్తాం. మేం కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి నిలబడింది.. వాళ్లు (బీఆర్‌ఎస్) కట్టిన మేడిగడ్డ కుంగింది.. గోదావరి జలాల ఎత్తిపోతలకు ఎల్లంపల్లి ఒక జంక్షన్, గుండెకాయ' అని సీఎం రేవంత్ అన్నారు. ఏరియల్ సర్వేలో భాగంగా ఉత్తమ్, మహేశ్‌తో కలిసి ఆయన మొదట ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల పట్టణాలు ఏమైనా నీట మునిగాయా అని పరిశీలించారు. ఎల్లంపల్లి బ్యారేజీ వద్ద గోదారమ్మకు కొబ్బరి కాయలు కొట్టి పసుపు, కుంకుమ, పూలు, సారె సమర్పించారు. గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలకు నీరు వెళ్లకుండా చూడాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది మృతి

వరదల పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాం: డీజీపీ జితేందర్

1500 మందిని రక్షించిన అగ్నిమాపకశాఖ: డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మంది మృతి చెందినట్లు సమాచారం అందిందని డీజీపీ జితేందర్ తెలిపారు. వరద నీటిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అగ్నిమాపకశాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు సమష్టిగా రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 3 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వెల్లడించారు. నీటి ప్రవాహాల్లో చిక్కుకున్న వారిని కాపాడటానికి ఎయిర్‌ఫోర్స్ సహాయం తీసుకుంటున్నామని, సిబ్బంది వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహారాన్ని పంపిస్తున్నామని తెలిపారు. దాదాపు రెండు వేల మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. అనేక జిల్లాల్లో రోడ్లు కొట్టుకుపోయాయని, కొన్ని జిల్లాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని తెలిపారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో వాహనదారులను పంపిస్తున్నామన్నారు. చెరువులు అలుగులు పారడం, వాగులు ప్రమాదకరంగా పారుతున్న ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని చెప్పారు. డీజీపీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. కాగా, మెదక్ జిల్లా రామాయంపేటలోని ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలలో చిక్కుకున్న 350 మందిని, రామాయంపేట ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్‌లో చిక్కుకున్న 80 మందిని, కామారెడ్డిలోని జీఆర్ కాలనీలో నీటిలో చిక్కుకున్న 70 మందిని అగ్నిమాపక శాఖ సిబ్బంది సకాలంలో స్పందించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాదాపుగా 1500 మంది బాధితుల్ని అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించినట్లు అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. వరద, ముంపు ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సేవలందిస్తారని పేర్కొన్నారు.

వర్షాలు, వరదలతో ఆర్‌అండ్‌బీకి రూ.1,157 కోట్ల నష్టం

- తాత్కాలిక మరమ్మతులకు రూ.53.76కోట్లు కావాలి
- మెదక్‌లో 52కి.మీ రోడ్లు ధ్వంసం
- కామారెడ్డిలో 4చోట్ల దెబ్బతిన్న బ్రిడ్జిలు.. సర్కారుకు ఆర్‌అండ్‌బీ నివేదిక
- అధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖకు ఇప్పటివరకు రూ.1,157.46 కోట్ల నష్టం వాటిల్లినట్లుగా సర్కారుకు ఆ శాఖ నివేదికను అందజేసింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.53.76 కోట్లు కావాలని నివేదికలో పేర్కొంది. ఆర్‌అండ్‌బీ శాఖ నివేదికలోని వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 794 ప్రాంతాల్లో సమస్యాత్మక రోడ్లను గుర్తించారు. వీటిలో 1,039 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. 31 చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. 10 చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 356 చోట్ల రోడ్లపై వరద ప్రవహిస్తోంది. 305 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగితే, 236 చోట్ల ట్రాఫిక్‌ను దారి మళ్లించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. మెదక్‌లో 52 కి.మీ మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లపై 33 చోట్ల వరద ప్రవహిస్తోంది. 5 చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 4 చోట్ల వంతెనలు దెబ్బతినగా వాటి అప్రోచ్ రోడ్లు కోతకు గురయ్యాయి. మొత్తం 15 ప్రాంతాల్లో రోడ్డుపై నుంచి వరద ప్రవహిస్తోంది. 3 చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన నష్టం, వాటి శాశ్వత, తాత్కాలిక మరమ్మతులకయ్యే ఖర్చు వివరాలను మంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారులకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నేడు, రేపు వర్షాలు..

- కొన్ని చోట్ల భారీ వానలు పడే చాన్స్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రెండు రోజుల పాటు చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

కూలిపోయిన ఇళ్లు కట్టిస్తాం

- నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కూలిపోయిన ఇళ్లను తిరిగి కట్టిస్తామని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రహదారులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవలం గంట వ్యవధిలో 700 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని, దీనివల్ల నీటివనరులు పూర్తిగా నిండిపోయి వరద నీరు ఉధృతంగా ప్రవహించిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు. సిరిసిల్ల జిల్లా నర్మల గ్రామం వద్ద బుధవారం మానేరు వరదల్లో చిక్కుకుపోయిన ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించినట్లు వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాలకు అత్యవసర ఖర్చుల నిమిత్తం వారం క్రితమే ప్రభుత్వం జిల్లాకు రూ.కోటి విడుదల చేసిందన్నారు. భారీగా నష్టపోయిన జిల్లాలకు అదనపు నిధులు ఇస్తామని తెలిపారు. వరద ప్రభావిత గ్రామాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. బీఆర్‌ఎస్ రాజకీయ లబ్ధి కోసం మాట్లాడటం సరికాదన్నారు.



రామాయంపేటలో వరద బాధితులను పరామర్శిస్తున్న మంత్రి దామోదర

ప్రజలకు తక్షణ వైద్య సాయం అందాలి: దామోదర

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యానికి ఇబ్బంది తలెత్తకుండా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు(డీఎం అండ్ హెచ్‌ఓ) అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రజలకు తక్షణ వైద్య సాయం అందాలని, ఇందుకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వరద ప్రభావిత జిల్లాల డీఎం అండ్ హెచ్‌ఓలతో మంత్రి దామోదర రాజనర్సింహ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, రాజన్నసిరిసిల్ల, సిద్దిపేటతోపాటు ఇతర జిల్లాల వైద్య ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నిజామాబాద్‌కు వెళ్లే 89 ఆర్టీసీ బస్సులు రద్దు

చాదర్‌ఘాట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్‌కు వెళ్లే 89 ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. కామారెడ్డి మార్గంలో రోడ్లపై వరద ప్రవాహంతోపాటు పలు చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. దాంతో ఈ రూట్లలో నడిచే ఆర్టీసీ బస్సులను తాత్కాలికంగా రద్దు చేశారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే 9 ఆర్టీసీ బస్సులను కూడా రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వరదల తీవ్రతపై రాజ్‌నాథ్, నడ్డా ఆరా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు ఫోన్

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల ప్రభావంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరా తీశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరిన్ని సహాయక చర్యలకు గాను సిబ్బందిని, సామగ్రిని కేంద్రం నుంచి వెంటనే పంపిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని రాంచందర్‌రావు.. రాజ్‌నాథ్‌సింగ్‌కు తెలిపారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే ప్రక్రియలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు నిమగ్నమై ఉన్నాయన్నారు. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.

వరద బాధితులకు అండగా నిలవాలి: కేసీఆర్

భారీ వర్షాలు, వరదలతో పలు జిల్లాల్లో అనేక నివాసాలు నీట మునిగి.. ప్రజలు అవస్థలు పడుతుండడం పట్ల బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పార్టీ నాయకులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. బాధిత ప్రజలకు అందుబాటులో ఉంటూ తమవంతు సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అండగా ఉండేలా పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేసీఆర్ సూచించారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి: హరీశ్

మెదక్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరద ముంపు వల్ల నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. వర్షాల వల్ల విపత్కర పరిస్థితులు తలెత్తి ప్రజలు ఇబ్బంది పడుతుంటే మూసీ సుందరీకరణపై సీఎం సమీక్ష నిర్వహించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ముంపు ప్రాంత ప్రజలను ఆదుకునే విషయంలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మెదక్ జిల్లాలో వరద ముంపునకు గురైన హవేళీఘనపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో హరీశ్ పర్యటించారు. వరద బాధితులను పరామర్శించారు. వరదలో కొట్టుకుపోయి మృతిచెందిన సత్యనారాయణ, యాదాగౌడ్ కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలి: కవిత

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహాయక చర్యలు సక్రమంగా లేవని, చాలాచోట్ల ఆహార పదార్థాల కొరత ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు గురువారం ఎక్స్ వేదికగా ఆమె పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని ప్రభుత్వం వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలని కోరారు.

వరద నష్టంపై ప్రాథమిక నివేదిక ఇవ్వండి: సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరదల వల్ల జరిగిన నష్టంపై వెంటనే ప్రాథమిక నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల కార్యదర్శులను సీఎస్ కె.రామకృష్ణారావు ఆదేశించారు. వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మల్, కామారెడ్డి, మెదక్, రాజన్న-సిరిసిల్ల జిల్లాల్లో నష్టం అధికంగా ఉందని, నష్టాలపై ప్రాథమిక నివేదికతోపాటు జరిగిన నష్టాలను తెలిపే ఫొటోలు, వీడియో క్లిప్పింగులు, పత్రికా క్లిప్పింగులను జతపర్చాలన్నారు. జిల్లా కలెక్టర్లు పంపే ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు సూచించారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు.

సహాయక చర్యల వివరాలివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వరదల నేపథ్యంలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకున్నారో వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు గురువారం ఆదేశించింది. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, విపత్తుల సమయంలో తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తాజా పరిస్థితులపై అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇప్పుడే ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న ధర్మాసనం.. విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది.

అండగా ఉంటాం ఆదుకుంటాం

- వరద బాధితులకు దామోదర, వివేక్ భరోసా
- కేంద్రం ఆర్థిక సాయం అందించాలి: సీతక్క

మెదక్, కామారెడ్డి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలు వల్ల నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, ధనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో వర్షాల వల్ల దెబ్బతిన్న పలు ప్రాంతాల్లో మంత్రులు దామోదర, వివేక్ వేర్వేరుగా పర్యటించగా.. మంత్రి సీతక్క కామారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. పోచారం డ్యామ్ పరిస్థితి దృష్ట్యా ముందుజాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలతో మంత్రి వివేక్ స్వయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. అలాగే, హవేళీ ఘనపూర్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించిన వివేక్.. లింగ్సాన్‌పల్లి తండా-తిమ్మాయిపల్లి మార్గంలో దెబ్బతిన్న వంతెన, కోతకు గురైన బూర్గుపల్లి రోడ్డును పరిశీలించారు. ఇక, మెదక్ జిల్లా రామాయంపేటలో పర్యటించిన మంత్రి దామోదర రాజనర్సింహ వరద బాధితులతో మాట్లాడారు. అలాగే, కామారెడ్డి రోడ్డులోని బీసీ కాలనీలో ముంపునకు గురైన కుటుంబాలను పరామర్శించారు. పాక్షికంగా కూలిన ఇండ్లను పరిశీలించారు. కాగా, గత 50 ఏళ్లలో జిల్లాలో ఈ స్థాయిలో వర్షాలు ఎప్పుడూ కురవలేదన్న మంత్రి దామోదర.. భారీ వర్షాలకు వరదలో చిక్కుకున్న 60మందిని ప్రభుత్వ యంత్రాంగం కాపాడిందని ఈ సందర్భంగా తెలిపారు. ఇక, భారీ వర్షాలు, వరదలు తీవ్ర ఆస్తి నష్టాన్ని మిగిల్చాయని, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు కేంద్రం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని మంత్రి సీతక్క అన్నారు. కామారెడ్డిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన తర్వాత ఆమె మాట్లాడారు. వరద నష్టంపై నివేదికలు తెప్పించి నష్టనివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 1,044 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు.



మెదక్ - బోధన్ రహదారిని పరిశీలిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

వరద బాధితులను రెచ్చగొడుతున్న హరీశ్

కాంగ్రెస్ నేతల ధ్వజం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావు వరద బాధితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండిపడ్డారు. సీఎం, మంత్రులు ఎప్పటికప్పుడు అధికారులతో వరదలపై సమీక్ష చేస్తుండగా.. హరీశ్ మాత్రం బుద్ధి లేకుండా రాజకీయ విమర్శలు మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. ఎన్నికలు వస్తున్నందున హరీశ్‌రావు రాజకీయాలు మాట్లాడుతున్నారని.. సీఎంపై ఆయన విమర్శలు సరికాదన్నారు. వరద బాధితులను సర్కారు అన్ని రకాలుగా ఆదుకుంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. హరీశ్‌రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.



భారీ వరద తరువాత పోచారం ప్రాజెక్టు కట్ట కోతకు గురైన దృశ్యం

'పోచారం' పైనుంచి వరద

- తట్టుకొని నిలబడ్డ 103 ఏళ్ల ప్రాజెక్టు
- ప్రాజెక్టు సురక్షితం: మంత్రి ఉత్తమ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నిజాం హయాంలో నిర్మించిన పోచారం ప్రాజెక్టు మీద నుంచి నీరు ప్రవహించడం... తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ప్రాజెక్టు సామర్థ్యాన్ని మించి రెండున్నర రెట్ల మేర అధికంగా వరద రావడంతో సమీప గ్రామాల ప్రజలు హడలిపోయారు.అయితే, ఇంత వరదను సైతం పోచారం ప్రాజెక్టు తట్టుకోగలిగింది. కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో మంచిప్ప చెరువుపై 103ఏళ్ల కిందట ఈ ప్రాజెక్టును నిర్మించారు. 1917లో అప్పటి నిజాం శంకుస్థాపన చేయగా.. రూ.27.11లక్షలు వెచ్చించి.. 1922లో పూర్తి చేశారు. వందేళ్లుగా నిజామాబాద్, మెదక్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న ఈ ప్రాజెక్టును సున్నపు రాయితో కట్టారు. పూర్తి నిల్వ సామర్థ్యం 2.42 టీఎంసీలు కాగా...పూడికతో 1.82 టీఎంసీలకు తగ్గిపోయింది. ప్రాజెక్టు గరిష్ఠ వరద సామర్థ్యం 70 వేల క్యూసెక్కులు కాగా.. బుధవారం ఏకంగా 1.82 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఓ దశలో కట్టపై నుంచి నీరు ఉప్పొంగింది. వరద తాకిడికి ప్రాజెక్టు కట్ట కోతకు గురికావడం ఆందోళన గురి చేసింది. కట్ట కొట్టుకుపోతుందేమోనని దిగువన ఉన్న సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. యంత్రాంగం సైతం ఉరుకులు పరుగులు చేపట్టింది. చివరకు వరద తగ్గడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ... '103సంవత్సరాల ప్రాజెక్టు 1.82 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని నిలబడడం.. నీటిపారుదల శాఖ అధికారులకు ఉపశమనాన్ని కలిగించింది. ఇది గర్వించదగ్గ భావోద్వేగ సమయం' అని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 30వేలక్యూసెక్కుల వరద వస్తోందని, ఎలాంటి ప్రమాదం లేదని కామారెడ్డి జిల్లా నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్ తెలిపారు. కోతకు గురైన కట్టను పునరుద్ధరిస్తామని చెప్పారు.

గోదావరి ఉగ్రరూపం

- ఎల్లంపల్లికి అత్యధికంగా 8 లక్షల క్యూసెక్కులు
- శ్రీశైలానికి 2.38 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్ నుంచి దిగువకు 2.4లక్షల క్యూసెక్కులు
- రాష్ట్ర వ్యాప్తంగా 120 చెరువులకు గండ్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



భద్రాచలం వద్ద గోదావరి

పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువన శ్రీరాం సాగర్ నుంచి దిగువన భద్రాచలం వరకు భారీగా ప్రవాహం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గురువారం మధ్యాహ్నం అత్యధికంగా 8 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో 8.20లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. సాయంత్రానికి నీటి ప్రవాహం 5,77,398 క్యూసెక్కులకు తగ్గడంతో 38 గేట్ల ద్వారా అంతే స్థాయిలో నీటిని వదులుతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పరిశీలిస్తున్నారు. శ్రీరాంసాగర్ వరద కాలువ నుంచి 16,365 క్యూసెక్కులు, మానేరు, మూలవాగు నుంచి 79,540 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో మిడ్‌మానేరులో నీటి నిల్వ క్రమేణా పెరుగుతోంది. 27.55 టీఎంసీలకుగాను ప్రస్తుతం 20.407టీఎంసీల నీరు ఉండడంతో 17గేట్లుఎత్తి 45,635క్యూసెక్కులను లోయర్ మానేరు డ్యాంలోకి వదులుతున్నారు. ఎల్ఎండీలోకి 56,944 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 16.263 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఇక, ఎగువన ఉన్న నిజామాబాద్ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1.75లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా...2.83 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. మరోవైపు.. సింగూరు ప్రాజెక్టుకు 44,650 క్యూసెక్కుల వరద వస్తుండగా.. నాలుగు గేట్లను ఎత్తి 37,685 క్యూసెక్కులను వదులుతున్నారు. మంజీర రిజర్వాయర్ నిండు కుండను తలపిస్తోంది. నాలుగు గేట్లను ఎత్తి 50వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. అలాగే, నిజాంసాగర్ ప్రాజెక్టుకు 2.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... అంతే స్థాయిలో నీటిని కిందకు వదిలేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు 44వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఔట్‌ఫ్లో 41 వేలుగా ఉంది. పాల్వంచలోని కిన్నెరసాని, చర్లలోని తాలిపేరు ప్రాజెక్టులకు వరద పోటెత్తగా.. కిన్నెరసాని నుంచి 10వేల క్యూసెక్కులు, తాలిపేరు నుంచి 65వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇక, కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. గురువారం 2.38లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 9 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,23,119 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాలకు 1.76 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 22గేట్లను ఎత్తి 1,48,323క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టుకు 2,46,410 క్యూసెక్కులు వస్తుండగా.. 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,01,318 క్యూసెక్కులను వదిలేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు తరలిస్తున్నారు. కాగా, మూసీ ప్రాజెక్టుకు 9,956 క్యూసెక్కులు వచ్చి చేరుతుండటంతో 8 గేట్లు ఎత్తారు.

చెరువులకు జలకళ

తాజా వర్షాలతో ములుగు జిల్లాలోని రామప్ప సరస్సు నీటిమట్టం 32 అడుగులకు చేరింది. ఇక, మెదక్ పరిధిలో 1800 చెరువులు ఉండగా... రెండు రోజుల్లోనే అన్నీ నిండి...అలుగులు పారుతున్నాయి. రాష్ట్రంలో 120 చెరువులకు గండ్లు పడినట్లు అధికారులు గుర్తించారు.

సమస్యలపై 2న చర్చిద్దాం రండి

» ఉద్యోగుల జేఏసీకి సర్కారు పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణపై ప్రభుత్వం స్పందించిందని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించేందుకు సెప్టెంబరు 2న రావాలంటూ ప్రభుత్వం ఆహ్వానం పంపిందని చెప్పారు. గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో భేటీ అనంతరం ఈ మేరకు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సెప్టెంబరు 2న ప్రభుత్వం స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ చర్చల తర్వాత ప్రభుత్వం చేసే ప్రకటనను అనుసరించి, తదుపరి కార్యాచరణ వెల్లడిస్తామని జేఏసీ నేతలు తెలిపారు.

నిద్రిస్తున్న తల్లీకూతుళ్లకు పాముకాటు

» చిన్నారి మృతి.. చికిత్స పొందుతున్న తల్లి


లోహిత (ఫైల్)

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నిద్రలో ఉన్న తల్లీకూతుళ్లను పాము కాటేయడంతో చిన్నారి మృతి చెందగా.. తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం చిన్నపాకలగూడెంలో జరిగింది. గూడేనికి చెందిన గౌర గోపి, మౌనిక దంపతులు, వారి చిన్న కుమార్తె లోహిత (5)తో కలిసి బుధవారం ఇంట్లో నేలపై నిద్రిస్తున్న క్రమంలో అర్ధరాత్రి 1 గంట సమయంలో చిన్నారితో పాటు తల్లిని కట్లపాము కాటు వేసింది. వారిద్దరిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మౌనికకు ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ముగ్గురు పిల్లలను చంపి ఆత్మహత్యాయత్నం

» సౌదీలో హైదరాబాదీ తల్లి దుశ్చర్య

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియాలో ఒక హైదరాబాదీ మహిళ దారుణానికి ఒడిగట్టింది. తన ముగ్గురు చిన్నారులను చంపి ఆపై ఆమె కూడా ఆత్మహత్యాయత్నం చేసింది. సౌదీ అరేబియాలోని అల్ ఖోబర్ నగరంలో హైదరాబాద్‌లోని టోలీచౌకికి చెందిన సయ్యద్ హుమేరా అమ్రీన్ (33) కుమారులు సాదిఖ్ అహ్మద్(7), అదిల్ అహ్మద్(7), యూసుఫ్ అహ్మద్(3)తో ఉంటోంది. మంగళవారం ఆమె తన ముగ్గురు పిల్లలను బాత్ టబ్‌లో ముంచి చంపేసింది. ఆ తర్వాత ఆమె కూడా ఆత్మహత్యాయత్నం చేసింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త మహ్మద్ షాహనవాజ్ ఇది చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. తన భార్య మానసిక స్థితి సరిగా లేదని ఆయన చెబుతున్నారు.

న్యాయ శాఖ కార్యదర్శిగా పాపిరెడ్డి నియామకం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శిగా మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.పాపిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం న్యాయ శాఖ కార్యదర్శిగా ఉన్న రెండ్ల తిరుపతి ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో పాపిరెడ్డిని ఏడాది కాలానికి డిప్యుటేషన్‌పై ప్రభుత్వం నియమించింది.

సెప్టెంబరు 22 నుంచి 'టాస్' పరీక్షలు

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) సెప్టెంబరుకు సంబంధించిన వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. పదో తరగతి, ఇంటర్ థియరీ పరీక్షలు సెప్టెంబరు 22 నుంచి 28 వరకు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయని టాస్ సంచాలకుడు పీవీ శ్రీహరి తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబరు 6 నుంచి 13 వరకు నిర్వహిస్తారు.

బకాయిలు చెల్లించాలని చేప రైతుల ఆందోళన

మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్య భవన్ వద్ద చేప రైతులు అర్ధనగ్నంగా ఆందోళనకు దిగారు. రెండేళ్లుగా తాము సరఫరా చేసిన చేపల బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రూ.109 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. "రైతుల ప్రభుత్వమని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మా సమస్యలపై ఎందుకు స్పందించడంలేదు" అని వారు ప్రశ్నించారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో భారీ ఆందోళన చేపట్టాల్సి వస్తుందని తెలంగాణ మత్స్య రైతుల ఉత్పత్తి అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ హెచ్చరించారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇబ్రాం శేఖర్


ఇబ్రాం శేఖర్

సరూర్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన ఇబ్రాం శేఖర్‌ను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్ష పదవి వరించింది. దాదాపు 15 సంవత్సరాలుగా ఆయన బీఎస్పీలో అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ సిద్ధాంతాలను బహుజనుల్లోకి తీసుకెళ్తూ గుర్తింపు పొందారు. అంతకుముందు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలోనూ కీలకంగా పాల్గొన్నారు. బీఎస్పీ ప్రస్తుత అధ్యక్షుడు ప్రభాకర్ ఇటీవల రాజీనామా చేయడంతో ఇబ్రాం శేఖర్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తూ బుధవారం బీఎస్పీ అధినేత్రి మాయావతి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ఓటును పోరాట సాధనంగా మలిచి బహుజనులకు రాజ్యాధికారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

డ్రగ్స్ కలకలంపై మహీంద్రా వర్సిటీ వీసీ సీరియస్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం, అరెస్టుల నేపథ్యంలో ఆ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు సీరియస్‌గా స్పందించారు. మత్తు పదార్థాల వినియోగం, వాటిని కలిగి ఉండటం, సరఫరా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే లేదా విద్యార్థుల శ్రేయస్సుకు హానీ కలిగించే ఏ చర్యలనైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నియమాలు ఉల్లంఘించిన వారు దోషులుగా తేలితే.. వర్సిటీ నిబంధనలు, చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. .

సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ మద్దతు ఎందుకివ్వదు?

» గోడ మీద పిల్లిలా ఉంటానంటే కుదరదు: నారాయణ

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణకు మద్దతుగా నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి.. బీఆర్ఎస్ మద్దతు ఎందుకివ్వదో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రశ్నించారు. బీఆర్ఎస్ గోడ మీద పిల్లిలా ఉంటానంటే కుదరదని.. పగలో మాట, రాత్రో మాట అంటామంటే తెలంగాణ చూస్తూ ఊరుకోదన్నారు. సుదర్శన్‌రెడ్డిని రేవంత్ ప్రతిపాదించారు కాబట్టే మద్దతివ్వబోమని బీఆర్ఎస్ అనడం సరికాదన్నారు. యూరియాకు ఉప రాష్ట్రపతి అభ్యర్థికి సంబంధం ఏంటని ప్రశ్నించారు. అసలు కేటీఆర్ యూరియా అడిగారో లేక యూరిన్ అడిగారో అర్థంకావడం లేదని, బహుశా స్పెల్లింగ్ మిస్టేక్ జరిగి ఉంటుందని అన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్లతో ఎన్నికలకు!

సన్నాహాలు ప్రారంభించాలన్న సీఎం రేవంత్?.. సీఎంతో టీపీసీసీ చీఫ్, మంత్రుల కమిటీ భేటీ



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రుల కమిటీ గురువారం సమావేశమైంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించింది. న్యాయనిపుణుల సలహాల అనంతరం రిజర్వేషన్లపై కమిటీ మూడు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సీఎంకు సూచించినట్లు తెలిసింది. బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై గాంధీభవన్‌లో బుధవారం జరిగిన న్యాయ సలహా కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీహరి, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. అభిషేక్ సింఘ్వీ తదితర న్యాయనిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై మహేశ్‌గౌడ్‌కు కమిటీ సభ్యులు మూడు ప్రత్యామ్నాయాలను సూచించినట్లు తెలిసింది. పార్టీ పరంగా ఎన్నికల్లో బీసీలకు 42 శాతం అవకాశం కల్పించడం, ప్రత్యేక జీవోతో రిజర్వేషన్లు అమలు చేయడం, మరో నెల రోజుల గడువు ఉన్నందున కేంద్రం నుంచి ఆమోదం లభించేవరకు నిరీక్షించడం.. ఈ అంశాలపై సీఎం రేవంత్‌తో చర్చించినట్లు తెలిసింది. సెప్టెంబరు 30లోపు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్న హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల అమలుకు కార్యాచరణ రూపొందించడంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. రిజర్వేషన్లు పెంచుతూ ప్రత్యేక జీవోతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తే అడ్డుకునేందుకు విపక్షాలు కోర్టును ఆశ్రయిస్తే ఏం చేయాలనేదానిపైనా చర్చించినట్లు తెలిసింది. గతంలో బీసీలకు సంబంధించిన సమాచారం లేకపోవడంతో రిజర్వేషన్ల పెంపును కోర్టు అంగీకరించలేదని, ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సమాచారాన్ని అందిస్తే కోర్టు సానుకూలంగా స్పందించే అవకాశం ఉంటుందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. మరోవైపు హైకోర్టు గడువుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఏదేమైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లడానికి సన్నాహాలు ప్రారంభించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా కమిటీకి స్పష్టం చేసినట్లు సమాచారం.

సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపు

» 7 నెలలు పొడిగింపునకు కేంద్రం అంగీకారం

హైదరాబాద్, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.రామకృష్ణారావు పదవీ కాలాన్ని పొడిగించారు.ఆయన పదవీ కాలాన్ని మరో 7 నెలలు పొడిగించడానికి కేంద్రం అంగీకరించింది. వాస్తవానికి రామకృష్ణారావు 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. రామకృష్ణారావు పదవీ కాలాన్ని 7 నెలలు పొడిగించడానికి డీవోపీటీ అంగీకారం తెలిపింది.

చైల్డ్ కేర్ పేరిట స్మితా సబర్వాల్ దీర్ఘకాలిక సెలవు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి జనవరి 31 వరకూ చైల్డ్ కేర్ లీవ్ పేరిట ఆమె 6 నెలల సెలవు పెట్టారని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఆమె పెట్టుకున్న దరఖాస్తును జూలై 19న ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్ బాధ్యతలను సెర్ప్ అదనపు సీఈఓ పీ కాత్యాయనీ దేవికి అప్పగించింది. కాగా, తాను అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్మితా సబర్వాల్ చెప్పారు. 'కొన్నిసార్లు మన జీవితంలో అత్యంత ప్రశాంతమైన కాలాలు మనతో బిగ్గరగా మాట్లాడతాయి. కొన్ని నెలలుగా వెన్నెముక సమస్య నా ప్రపంచాన్ని కుదిపేసింది. చాలా బాధతో, నెమ్మదిగా కోలుకుంటున్నా. ఈ సమస్యను అధిగమిస్తా' అని పేర్కొంటూ గురువారం.. ఓ పర్యాటక ప్రాంతాన్ని ఆస్వాదిస్తున్న వీడియోనూ పోస్టు చేశారు. ప్రభుత్వ అధికారిగా ఉంటూనే స్మితా సబర్వాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల తొలగింపు సమయంలో ఏఐ ఆధారిత నకిలీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడం వివాదాస్పదమైంది. ఈ విషయమై ఆమెకు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరైన స్మితా సబర్వాల్.. ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల వల్లే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారని తెలుస్తోంది.

రేవంత్ గెటప్‌లో వినాయకుడి విగ్రహం

» ఆగాపురాలో ఏర్పాటు.. రాజాసింగ్ ఫిర్యాదు

» పలు ఠాణాల్లో బీజేపీ నేతల ఫిర్యాదులు

» మనోభావాలు దెబ్బతీయొద్దు.. నిర్వాహకులతో డీసీపీ

» ఆ విగ్రహం తొలగించి మరొకటి ప్రతిష్ఠ


రేవంత్ గెటప్‌లో గణపతి విగ్రహం

గోషామహల్/బాలానగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గం ఆగాపురాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెటప్‌లో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ నేతృత్వంలో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. సౌత్ వెస్ట్ డీసీపీ జీ చంద్రమోహన్ ఆ మండపాన్ని సందర్శించి భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దని సాయికుమార్‌కు సూచించారు. పోలీసుల ఆదేశాలతో ఆ విగ్రహాన్ని తొలగించి మరొకటి ప్రతిష్ఠించారు. ఈ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ముందుగా ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో సాయికుమార్‌పై బీజేపీ నాయకులు ఫిర్యాదులు అందజేశారు.


ఖైరతాబాద్ మహాగణపతి వద్ద తొలి పూజలు చేస్తున్న గవర్నర్

ఖైరతాబాద్ గణపతికి గవర్నర్ తొలి పూజ

ఖైరతాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ విశ్వశాంతి మహాశక్తి గణపతి పూజలు వినాయక చవితి రోజున వైభవంగా ప్రారంభమయ్యాయి. ముహూర్తం సమయానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మండపం వద్దకు రాగా, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆహ్వానించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ఠ చేసి కళశ పూజతో తొలి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

మీ గురువు చంద్రబాబును చూసి నేర్చుకోండి

పింఛన్ల పెంపుపై రేవంత్, కేసీఆర్‌కు మంద కృష్ణ సూచన

వర్ధన్నపేట రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబును చూసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ నేర్చుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సూచించారు. గతంలో ఈ ఇద్దరూ చంద్రబాబు దగ్గర శిష్యరికం చేశారని, కానీ ఆయనలా ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా వారు పనిచేయడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు రూ.6వేలు.. వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.15 వేలు పింఛన్ ఇస్తున్నారని గుర్తుచేశారు. గురువారం వరంగల్ జిల్లా ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు.

జపాన్ కంపెనీల కోసం టి-వర్క్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

» మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

» ఎంఎస్ఎంఈల కోసం సీఎంపీ ప్యాడ్

» ఏర్పాటుకు ముందుకొచ్చిన జపాన్ కంపెనీ

» దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ ఉత్పాదనలో కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) ప్యాడ్ ఏర్పాటుకు జపాన్ కంపెనీ సహకారం అందించనుంది. ఇప్పటివరకు దీన్ని ఇక్కడి సెమీకండక్టర్ కంపెనీలు దిగుమతి చేసుకునేవి. అయితే రాష్ట్రంలోని సెమీ కండక్టర్ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను ప్రోత్సహించాలన్న లక్ష్యంగా జపాన్‌కు చెందిన టొహోకోకి సంస్థ రూ.8 కోట్ల విలువైన సీఎంపీ ప్యాడ్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. రాష్ట్ర ఎంఎంఎస్ఎంఈల కోసం దీనిని రాయదుర్గ్‌లోని టి-వర్క్స్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు టోహోకోకి గ్లోబల్ బిజినెస్ హెడ్ టకుయా నిషిమురా తెలిపారు. గురువారం టీ-వర్క్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఈ మేరకు జపాన్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జపనీస్ పరిశ్రమలు, అంకుర సంస్థలు, పరిశోధకుల కోసం టి-వర్క్స్‌లో ప్రత్యేకంగా ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను నెలకొల్పనున్నట్టు తెలిపారు. సెమీకండక్టర్ సాంకేతిక పరిజ్ఞానానికి తెలంగాణ ముఖద్వారంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భారత్‌లో తొలిసారి సీఎంపీ ప్యాడ్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

విధులకు ఆలస్యంగా హాజరైతే ఉపేక్షించం

» ఉదయం 10.30 గంటలకు ఆఫీసుల్లో ఉండాల్సిందే:తుమ్మల



ఆలస్యంగా విధులకు హాజరైతే ఉపేక్షించబోమని వ్యవసాయశాఖ, అనుబంధ కార్పొరేషన్ల అధికారులు, ఉద్యోగులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలకు కార్యాలయాలకు చేరుకోవాల్సిందేనన్నారు. గురువారం ఉదయం 10.40 గంటలకూ కొందరు ఉద్యోగులకు విధులకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో విధులకు హాజరు కాని సిబ్బంది నుంచి వివరణ తీసుకోవాలని ఆయా విభాగాల అధిపతులను ఆదేశించిన మంత్రి తుమ్మల.. ఆలస్యంగా హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులకు ఉద్యోగులు అందుబాటులో ఉండాలని, పంటనష్టం వివరాలను సేకరించి, అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.